

# పూరన్, మార్ష్ విధ్వంసం..
# ఉప్పల్ స్టేడియంలో కంగుతిన్న సన్‌రైజర్స్

క్రికెట్‌లో ఎప్పుడు ఏ జట్టు చెలరేగి ఆడుతుందో చెప్పలేం. ఐపీఎల్‌లో రికార్డులు బద్ధలు కొట్టిన టీమ్.. అనూహ్యంగా ఓటమి పాలవ్వడం చూశాం. తొలి మ్యాచ్‌లోనే రికార్డు స్కోర్ కొట్టిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఊహించని షాక్ తగిలింది. తొలి పోరులో రాజస్థాన్ రాయల్‌స్‌ను 44 పరుగుల తేడాతో ఓడించిన ఆరెంజ్ ఆర్మీ సొంత ఇలాకాలో ఓటమి పాలైంది. టాపార్డర్ వైఫల్యంతో భారీ స్కోర్ కొట్టలేకపోయిన కమిన్స్ సేన.. లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్లను కట్టడి చేయడంలో విఫలమైంది.


శుక్రవారం
హైదరాబాద్
28.03.2025

సంపుటి : 15 సంచిక: 199
పేజీలు: 8 వెల: రూ.5

@ChattamTV

# చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక


## ఏప్రిల్ 6న రామేశ్వరానికి ప్రధాని..



- కొత్త పంబన్ బ్రిడ్జి ప్రారంభించనున్న మోడీ
- ఆసియాలోనే తొలిసారిగా వర్టికల్ లిఫ్ట్ బ్రిడ్జి

**చట్టం చెన్నై :** పంబన్ కొత్త రైల్వే వంతెన త్వరలోనే అందుబాటులోకి రానున్నది. ఏప్రిల్ 6న రామనవమి సందర్భంగా తమిళనాడులో పర్యటించనున్న మోడీ ఈ బ్రిడ్జిని జాతికి అంకితం చేయనున్నారు. అనంతరం రామేశ్వరం రామనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నారు. 2.5 కిలోమీటర్ల పొడవైన ఈ పంబన్ వంతెన.. భారత ప్రధాన భూభాగంతో రామేశ్వరం దీప్వాన్ని కలుపుతుంది. బ్రిటీష్ కాలంలో నిర్మించిన వంతెనపై రైలు ప్రయాణించేందుకు 25 నుంచి 30 నిమిషాల సమయం పట్టగా.. సరికొత్తగా నిర్మించిన వంతెనపై కేవలం ఐదు నిమిషాల్లోనే దూసుకెళ్లనున్నది.

**బ్రిడ్జి ప్రత్యేకతలు**

ఆసియాలోనే తొలిసారిగా వర్టికల్ లిఫ్ట్ వంతెనను రైల్వేశాఖ నిర్మించింది. పాత వంతెన 1914లో నిర్మించారు. ఈ వంతెన తప్పుపట్టి శిథిలావస్థకు చేరడంతో 2022లో మూసివేశారు. రూ.535 కోట్ల వ్యయంతో కొత్త బ్రిడ్జిని నిర్మించింది. కొత్త వంతెనకు తుప్పు సమస్య రాకుండా మూడు పొరల పాలీసిలో క్సేన్ పెయింట్ వేశారు. దాంతో దాదాపు 58ఏళ్లు వరకు తుప్పు ముప్పు ఉండదు. సముద్రంలో వేసిన దిమ్మెలకు ఇబ్బంది కలుగకుండా కేసింగ్ విధానంలో ఐరన్ చట్రాలతో కాంక్రీట్ వేశారు. వర్టికల్ లిఫ్ట్ బ్రిడ్జిలో ఒక బోల్టును వాడకపోడం విశేషం. వెల్డింగ్‌తోనే అన్నింటిని జోడించారు. వంతెన మొత్తాన్ని స్కాడా సెన్సర్లతో లింక్ చేయగా.. గంటకు 58 కిలో మీటర్ల వేగంతో గాలులు వీస్తే స్కాడా సెన్సార్లు ఆటోమేటిక్‌గా వంతెనను మూసివేస్తాయి. మత్స్యకారుల పడవలు, నేవీ, పోర్టుల నుంచి వచ్చే ఓడలు వంతెనను దాటాల్సి వచ్చిన సమయంలో సిబ్బంది దిమ్మెల వద్ద ఏర్పాటు చేసిన గదుల్లోకి వెళ్లి రిమోట్ ద్వారా వంతెన లిఫ్ట్‌ని ఆపరేట్ చేస్తుంటారు.

## దంచికొడుతున్న ఎండలు

- ఉమ్మడి నిజామాబాద్ లో అత్యధికంగా 40 డిగ్రీలు


**చట్టం , హైదరాబాద్:** రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి. ఇటీవల ద్రోణి కారణంగా రెండు.. మూడ్రోజులు వర్షాలు కురవడంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడినా.. మళ్లీ టెంపరేచర్ పెరగడంతో వెదర్ హీటెక్కింది. రాబోయే నాలుగు రోజుల్లో ఉష్ణోగ్రతలు భారీగా పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. పగటి ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు ఆరెంజ్, మిగతా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. నిన్న ఉమ్మడి నిజామాబాద్ అధికంగా 40.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక రాష్ట్రంలో పొడి వాతవరణం ఏర్పడే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రంలో రోజురోజుకూ ఎండలు పెరుగుతుండడంతో జనం ఉక్కపోతతో అల్లాడుతున్నారు.



ఎండలతో జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# నిద్రలేని రాత్రులు గడిపా

- డ్రోన్ ఎగరవేస్తే రూ.500 ఫైన్‌వేస్తారు
- కానీ ఎంపీగా ఉన్న నన్ను అరెస్ట్ చేశారు
- నక్సలైట్లు, టెర్రరిస్టులను ఉంచే డిటెన్షన్ సెల్‌లో పెట్టి వేధించారు
- నా బిడ్డ పెళ్లికి దూరం చేశారు.. మధ్యంతర బెయిల్‌పై వచ్చి వెళ్లాను
- ఇప్పుడు చెప్పండి రాజకీయ కక్ష సాధింపు మీదా నాదా..?
- అసెంబ్లీలో బీఆర్ఎస్ నేతలపై సీఎం రేవంత్‌రెడ్డి ఫైర్
- కక్షపూరిత రాజకీయాలు చేసే వ్యక్తిని కాదని వెల్లడి



**చట్టం , హైదరాబాద్:** బడ్జెట్ సమావేశాల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్‌నాయకుల పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు చేస్తే.. కేటీఆర్ ఇప్పటికే చంచల్‌గూడ జైలులో ఉండేవారన్నారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. అనుమతి లేకుండా ఎవరైనా డ్రోన్ ఎగరవేస్తే రూ.500 జరిమానా విధిస్తారు. కానీ, డ్రోన్ ఎగరవేశారని ఒక ఎంపీ మీద కేసు పెట్టి చర్లపల్లి జైలులో వేశారు. రూ.500 జరిమానా వేసే కేసులో జైలులో పెట్టి వేధించారని సీఎం అన్నారు. నా బిడ్డ పెళ్లికి కూడా మధ్యంతర బెయిల్‌పై వచ్చి వెళ్లాను. నేను కూడా అలా ప్రతీకార రాజకీయాలు చేయదలిస్తే.. ఇప్పటికే కొందరు జైలులో ఉండేవారు. కేటీఆర్, కేసీఆర్‌ను జైల్లో వేయాలని చాలా మంది మమ్మల్ని అడుగుతున్నారు. కానీ, అక్రమ కేసులు పెట్టి వాళ్లను జైలుకు పంపే కక్షపూరిత రాజకీయాలు చేసే వ్యక్తిని కాదు'' అని రేవంత్ అన్నారు.

**రూ.500 బోనస్‌ఇచ్చాం..**

''బీఆర్ఎస్‌మొదటి విడత ప్రభుత్వం కేవలం రూ.13 వేల కోట్లు రుణమాఫీ చేసింది. తొలి విడత రుణమాఫీకి ఐదేళ్లు తీసుకున్నారు. రెండోసారి గెలిచాక రుణమాఫీని అసలు పూర్తే చేయలేదు. నాలుగేళ్ల తర్వాత మాత్రం రూ.11 వేల కోట్లు మాఫీ చేశారు. నాలుగేళ్ల తర్వాత రుణమాఫీ చేసినందుకు వాటికి వడ్డీ రూ.8,500 కోట్లకు పైగా అయ్యింది. మేం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రూ.26 వేల కోట్లు రుణమాఫీ చేశాం. ఎన్నికల కోడ్ అడ్డుపెట్టుకొని రైతుబంధు కూడా వేయలేదు. భారాస ఎగవేసిన రైతుబంధు రూ. 7,625 కోట్లు మేం చెల్లించాం. వరి వేస్తే ఉరే అని మాజీ సీఎం స్వయంగా బెదిరించారు. మేం మాత్రం వరి వేసిన వారికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇచ్చాం'' అని రేవంత్ తెలిపారు.

**కమీషన్ల కోసం ప్రాజెక్టుల రీడిజైన్**

ప్రాజెక్టుల కోసం పేదల భూములు తీసుకున్న కేసీఆర్.. వాళ్ల బంధువుల భూములు మాత్రం తప్పించారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు దిగువన ఉన్న రైతులు అందోళన చేయలేదా? అని ప్రశ్నించారు. 14 గ్రామాల ప్రజలను పోలీసులతో కొట్టించి బలవంతంగా భూసేకరణ చేశారన్నారు. ''ప్రాజెక్టు వద్ద ఎవరికి భూములు, ఫామ్‌హౌజ్‌లు ఉన్నాయో నిజనిర్ధారణ కమిటీ వేద్దామా? కేసీఆర్ ఫామ్‌హౌజ్ చుట్టూ కాలువలు తీసినట్లు నిరూపిస్తాను. నేను భూసేకరణను వ్యతిరేకించలేదు.. పరిహారం చెల్లించాలని ధర్నాలు చేశాను. కమీషన్ల కోసం ప్రాజెక్టులను రీడిజైనింగ్ చేశారు. రూ.36 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టును పక్కకు పెట్టి.. రూ.లక్ష కోట్లతో కాళేశ్వరం చేపట్టారు. కాళేశ్వరం అవినీతి విషయంలో త్వరలోనే వీళ్లు జైలుకు వెళ్తారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని ఏకసభ్య కమిషన్ నివేదిక ఇచ్చింది'' అని రేవంత్ అన్నారు.



# రన్యారావుకు నో బెయిల్

- గోల్డ్ స్మగ్లింగ్ కేసులో పిటిషన్ కొట్టేసిన బెంగళూరు కోర్టు

**చట్టం, బెంగళూరు :** బంగారం స్మగ్లింగ్ కేసులో అరెస్టయిన కన్నడ నటి రన్యా రావుకు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో రన్యారావుకు బెంగళూరులోని 64వ సీసీహెచ్ సెషన్స్ కోర్టు బెయిల్ నిరాకరించింది. బంగారం స్మగ్లింగ్ కేసులో అరెస్టయిన రన్యారావు మొదట బెయిల్ కోసం మెజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ వేశారు. కోర్టు తిరస్కరించడంతో ఆమె ప్రత్యేక కోర్టును ఆశ్రయించగా అక్కడ కూడా ఆమె పిటిషన్ తిరస్కరణకు గురైంది. బెయిల్ కోసం సెషన్స్ కోర్టును ఆశ్రయించాలని రన్యారావు న్యాయవాదులు నిర్ణయించారు. దీంతో ఆమె బెయిల్ కోసం బెంగళూరులోని 64వ సీసీహెచ్ సెషన్స్ కోర్టును ఆశ్రయించింది. బెయిల్ పిటిషన్‌పై విచారణ చేపట్టిన కోర్టు రెండు రోజుల క్రితం వాదనలు విన్నది. ఈ సందర్భంగా బంగారం అక్రమ రవాణా కేసుకు సంబంధిం డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ కోర్టుకు కీలక విషయాలను వెల్లడించింది. విదేశాల్లో బంగారం కొనుగోలు చేసేందుకు ఆమె హవాలా మార్గంలో లావాదేవీలు జరిపిన డబ్బులను ఉపయోగించినట్లు డీఆర్ఐ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ విషయాన్ని విచారణ సమయంలోనూ నటి రన్యారావు అంగీకరించినట్లు కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. నటితో పాటు డీఆర్ఐ తరఫున వాదనలు విన్న కోర్టు మార్చి 27కి తీర్పును రిజర్వ్ చేసింది. ఈ మేరకు నటికి బెయిల్ నిరాకరిస్తూ గురువారం తీర్పు వెలువరించింది. మార్చి 3న దుబాయి నుంచి వచ్చిన రన్యారావు నుంచి రూ.12.56కోట్ల విలువైన బంగారాన్ని డీఆర్ఐ స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

## అప్పుల్లో తెలంగాణ రైజింగ్

- రాష్ట్ర ప్రభుత్వ పరిస్థితి అప్పుల అప్పారావు, రొటేషన్ చక్రవర్తిలా ఉంది
- ఈ దుస్థితికి మొదటి ముద్దాయి బీఆర్ఎస్.. రెండో ముద్దాయి కాంగ్రెస్
- 5 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.63 లక్షల కోట్లు అప్పులు చేసింది
- అసెంబ్లీలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మండిపాటు



**చట్టం , హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయిందని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. అప్పులు తీర్చేందుకు మళ్లీ అప్పులు చేయాల్సిన స్థితిలో ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లకు రూ.12వేలు ఇస్తామన్న హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ''రాష్ట్ర ప్రభుత్వ పరిస్థితి అప్పుల అప్పారావు, రొటేషన్ చక్రవర్తిలా ఉంది. రాష్ట్ర దుస్థితికి మొదటి ముద్దాయి బీఆర్ఎస్అయితే.. రెండో ముద్దాయి కాంగ్రెస్. డీలిమిటేషన్ మీద రాహుల్‌గాంధీ వైఖరి చెప్పాలి. 15 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.63 లక్షల కోట్లు అప్పులు చేసింది. అప్పులు చేయటంలో మాత్రమే తెలంగాణ రైజింగ్ కనిపిస్తోంది. గత ప్రభుత్వం చేసిన లక్షల కోట్ల విధ్వంసం వల్ల రాష్ట్రం అప్పుల కుప్పగా మారింది. గత ప్రభుత్వ దారిలోనే ఈ ప్రభుత్వం నడవటం బాధాకరం. తెలంగాణకు కేంద్రం నిధులు ఇవ్వలేదంటూ అవాస్తవాలు మాట్లాడొద్దు. కాంగ్రెస్ కూటమిలో చేరేందుకు భారాస ప్రయత్నిస్తోంది. డీలిమిటేషన్‌తో అన్యాయం అంటూ కొత్త రాగం ఎత్తుకున్నారు. కుటుంబ పార్టీలే బీజేపీని వ్యతిరేకిస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసంపై ఈ ప్రభుత్వం ఏం చర్య తీసుకుంటుందో చెప్పాలి. గత ప్రభుత్వం 11 శాతానికి తెచ్చిన వడ్డీలను రీకన్‌స్ట్రక్షన్ చేస్తున్నారో.. లేదో? చెప్పాలి. కాళేశ్వరం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ప్రాజెక్టుల్లో జరిగిన అవినీతిపై ఏం చర్యలు తీసుకున్నారు?'' అని ఏలేటి ప్రశ్నించారు.

# యోగి వర్సెస్ స్టాలిన్

- హిందీ వివాదంపై సీఎంల మధ్య మాటల యుద్ధం
- ఓటు బ్యాంకు కోసమే వ్యతిరేకిస్తున్నారన్న యూపీ సీఎం
- యోగిది డార్క్ కామెడీ అన్న తమిళనాడు సీఎం
- బలవంతంగా రుద్దితే సహించేది లేదని స్పష్టం

**చట్టం, చెన్నై :** జాతీయ విద్యా విధానంలో భాగమైన త్రిభాషా సూత్రం అమలుపై తమిళనాడు కేంద్ర ప్రభుత్వాల మధ్య తీవ్ర వివాదం కొనసాగుతోంది. ఈ సమయంలో ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్‌ల మధ్య మాటల యుద్ధం నడిచింది. యోగి తమకు పాఠాలు నేర్పడం పొలిటికల్ బ్లాక్ కామెడీలా ఉందని స్టాలిన్ ఎద్దేవా చేశారు. అంతకుముందు ఓటు బ్యాంకు ప్రమాదంలో పడింది కాబట్టే స్టాలిన్ త్రిభాషా సూత్రాన్ని వ్యతిరేకిస్తున్నారని యోగి విమర్శలు చేశారు. వీటిపై స్టాలిన్ స్పందించారు. ''తమిళనాడు రాష్ట్రం తమ ద్విభాషా విధానం, నియోజకవర్గాల పునర్విభజనపై న్యాయమైన, దృఢమైన స్వరాన్ని వినిపిస్తోంది. దీనిపై కలవరం చెందుతోన్న బీజేపీ తన నేతలతో రకరకాలుగా మాట్లాడిస్తోంది. విద్వేషం అంశంపై యోగిజీ మాకు పాఠాలు నేర్పాలనుకుంటున్నారా..? మమ్మల్ని వదిలేయండి. ఇది రాజకీయంగా అత్యున్నతస్థాయి డార్క్ కామెడీ. మేము ఏ భాషను వ్యతిరేకించం. కానీ బలవంతంగా రుద్దడాన్ని అంగీకరించం. ఇది న్యాయం కోసం జరుగుతోన్న పోరాటం'' అని కౌంటర్ ఇచ్చారు. స్టాలిన్ వ్యాఖ్యలకు తమిళనాడు బీజేపీ చీఫ్ అన్నామలై కౌంటర్ ఇచ్చారు. ''ప్రజల దృష్టిని మళ్లించడానికి మీరు చేస్తోన్న రాజకీయాలు అందరికీ అర్థమయ్యాయి. ఆ విషయాన్ని మీరు గ్రహించకపోవడం దురదృష్టకరం'' అంటూ అన్నామలై స్పందించారు.



**త్రిభాషా సూత్రంపై దుమారం**

కాగా జాతీయ విద్యావిధానంలోని త్రిభాషా సూత్రంపై రాజకీయ దుమారం రేగుతోంది. కొత్త విధానంలో భాగంగా మూడు భాషలను విద్యార్థులు నేర్చుకోవాల్సిందేనని, అందులో రెండు భారతీయ భాషలుండాలని కేంద్ర ప్రభుత్వం అంటుండగా.. హిందీని అందరిపై రుద్దడానికే కేంద్రం దీనిని తెరపైకి తెచ్చిందని కొన్ని రాష్ట్రాలు ఆరోపిస్తున్నాయి. మరీ ముఖ్యంగా ఈ విషయంలో తమిళనాడు అగ్గి మీద గుగ్గిలమవుతోంది. ఈ నేపథ్యంలో త్రిభాషా సూత్రంపై దేశవ్యాప్తంగా పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. ప్రతిపక్షాల ఆరోపణలను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తిప్పికొట్టారు. విద్యార్థులు చదువుకునే హక్కును హరించేందుకు విపక్షాలు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు.

# భూములు వేలం వేయొద్దు





- ప్రభుత్వ ఆర్థిక సమస్యల పరిష్కారానికి భూములు అమ్ముతారా?
- హెచ్‌సీయూలో ఉన్న 400 ఎకరాల భూమి వేలం ప్రక్రియను విరమించుకోవాలి
- సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి లేఖ

**చట్టం , ఢిల్లీ:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి లేఖ రాశారు. రాష్ట్ర ఆదాయం కోసం గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి వేలం కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ భూముల వేలంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సీఎంకు రాసిన లేఖలో హెచ్‌సీయూలో ఉన్న 400 ఎకరాల భూమి వేలం ప్రక్రియను విరమించుకోవాలని కోరారు. అలాగే గతంలో ప్రభుత్వ భూముల అమ్మకాలను వ్యతిరేక కించిన రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గుర్తు చేశారు. ఇదిలా ఉంటే ప్రభుత్వం వేలానికి నోటిఫికేషన్ ఇచ్చిన భూమి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఉంది. అది పూర్తిగా అటవీ సంపద, జింకలు, నెమళ్లు, వేలాది పక్షులు ఉన్నాయని వాటిని పరిరక్షించే అవసరం ఉందని, యూనివర్సిటీలోని విద్యార్థి సంఘాలు ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టాయి. ఇదే క్రమంలో బీజేపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో సైతం ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**కోల్ రంగంలో ఎన్నో సంస్కరణలు: కిషన్‌రెడ్డి**

12వ కమర్షియల్ బొగ్గు గనుల వేలాన్ని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఈరోజు ఢిల్లీలో ప్రారంభించారు. ఇటీవలే బిలియన్ టన్ ఉత్పత్తి మైలు రాయిని కోల్ మినిస్ట్రీ చేరుకుందని తెలిపారు. ప్రపంచంలో కోల్ ఉత్పత్తిలో ఇండియా ముందుందని అన్నారు. కోల్ ఉత్పత్తి గ్రోత్ రేట్ పెరిగిందని వివరించారు. కోల్ రంగంలో ఎన్నో సంస్కరణలను మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిందని చెప్పారు. దేశంలో కావాల్సిన విద్యుత్ తయారీకి కోల్ ఉత్పత్తి కీలకమని అన్నారు. కోల్ గనుల వేలం పారదర్శకంగా జరుగుతోందని చెప్పారు. 11వ కోల్‌మైన్స్ కమర్షియల్ వేలంలో అత్యధిక ఆదాయం వచ్చిందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఫర్టిలైజర్ దుకాణం పై ఆకస్మిక తనిఖీ

- ఖేడ్ వ్యవసాయ సంచాలకులు నూతన్ కుమార్



**చట్టం నారాయణ ఖేడ్ :** రైతులకు నకిలీ పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ నూతన్ కుమార్ హెచ్చరించారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండల తడ్కల్ గ్రామంలోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. యూరియా, ఇతర ఎరువుల స్టాక్ను పరిశీలించారు. ఎక్కువ ధరలకు, నకిలీ పురుగు మందులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని సంబంధిత డీలర్లను హెచ్చరించారు. రైతులకు నాణ్యమైన పురుగు మందులు, ఎరువులు నిర్దేశిత ధరలకు అమ్మాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నూతన్ కుమార్ తో పాటు ఏఈఓ సంతోష్ ఫర్టిలైజర్ ప్రొప్రైటర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత ఎల్లారెడ్డిని నిర్మిద్దాం




**చట్టం ఎల్లారెడ్డి:** ప్లాస్టిక్ రహిత ఎల్లారెడ్డిని నిర్మిద్దామని బహుజన సమాజ్ పార్టీ ఎల్లారెడ్డి పట్టణ కమిటీ అధ్యక్షులు మద్దు సాయిబాబు ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి పట్టణ పురపాలక కమిషనర్ మహేష్ కి వినతి పత్రం అందజేశారు. స్థానిక నాయకులు ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని మనవి చేస్తూ ప్లాస్టిక్ రహిత ఎల్లారెడ్డిని ముందంజలో ఉంచడంలో అందరం భాగస్వామ్యం అవుదాం, ప్లాస్టిక్ రహిత ఎల్లారెడ్డిని నిర్మిద్దామని తెలియజేయడం కోరారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ ఎల్లారెడ్డి పట్టణ కమిటీ అధ్యక్షులు మద్దు సాయిబాబు, సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జిల్లా సలహాదారులు లింగమయ్య, సాయికుమార్, వేముల భాను తదితరులు పాల్గొన్నారు.

## డిఎస్పిని మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ జెడ్పిటిసి



**చట్టం ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి నూతన డీఎస్పీగా ఎస్. శ్రీనివాస్ రావ్ పదవీ బాధ్యతలు స్వీకరించిన విషయమై గురువారం మాజీ జెడ్పిటిసి సామెల్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి సామెల్ మాట్లాడుతూ.. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా, చట్టాన్ని ఎవరు చేతిలోకి తీసుకోకుండా, ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఆయనతో పాటు తిమ్మారెడ్డి మాజీ సర్పంచ్ శ్రీనివాస రెడ్డి ఉన్నారు.

## తాజా మాజీ సర్పంచుల అరెస్ట్




**చట్టం ముస్తాబాద్ :** ముస్తాబాద్ మండలంకి చెందిన తాజా మాజీ సర్పంచులను పోలీసులు గురువారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. పెండింగ్ బిల్లుల కోసం అసెంబ్లీని ముట్టడిస్తారన్న ముందస్తు సమాచారంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా తమను అరెస్టు చేయడం ప్రభుత్వానికి సరి అయింది కాదన్నారు.

## మిషన్ భగీరథ ట్యాంకు పరిశీలించిన కలెక్టర్



**చట్టం ముస్తాబాద్ :** ముస్తాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో కలెక్టర్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా చిప్పలపల్లిలో మిషన్ భగీరథ అధికారులతో కలిసి పరిశీలించారు. గ్రామంలో నీటి సరఫరాపై అధికారులను ఆరాతీశారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ అధికారులు జానకి, ప్రేమ్కుమార్, రాము, ఎంపీడీవో బీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భగలాముఖి అమ్మవారి క్యాలెండర్ అందుకున్న వైశ్య కుల గురువు



**చట్టం ఎల్లారెడ్డి:** పరమ పూజ్య వామనాశ్రమ స్వామి కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి ఆలయంలోని క్షేత్ర హలదీ పూర్ పీఠాధిపతులు వామనాశ్రమ స్వామినీ ఎల్లారెడ్డి పట్టణంలో ఉన్నటువంటి ప్రసిద్ధ శ్రీ భగలాముఖి అమ్మవారి పీఠం నూతన సంవత్సర క్యాలెండర్నీ పీఠాధిపతి క్రాంతి పటేల్ వైశ్య కుల గురువుకు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పీఠం సభ్యులు లింగంపేట్ ప్రముఖ వ్యాపారవేత్త రవి గౌడ్, ఎల్లారెడ్డి పట్టణ వైశ్య ప్రముఖులు ఆకుల వెంకటేశం గుప్తా, అలాగే లింగంపేట్ పట్టణ వైశ్య ప్రముఖులు చింతల వేణు గుప్తా, వైశ్య సమాజ యువ నాయకులు కొండ శైలేంద్ర గుప్తా పాల్గొన్నారు.

## ప్రయాణం సురక్షితం రోడ్డు ప్రమాదాల నివారణ

- స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు చేసిన పోలీసులు




**చట్టం కోరుట్ల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు జిల్లా రోడ్డు ప్రమాదాల నివారణనే లక్ష్యంగా జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అశోక్ కుమార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "సురక్షిత ప్రయాణం" అనే కార్యక్రమంలో భాగంగా కొండగట్టు పుణ్యక్షేత్రం ఘాట్ రోడ్డు నుండి వాహనాలు కొండకు వచ్చి నేషనల్ హైవే 63 ని కలిసే వద్ద తరచుగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నందున మల్యాల సర్కిల్ ఇన్స్పెక్టర్ రవి, సబ్ ఇన్స్పెక్టర్ నరేష్ ఆధ్వర్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని రెండు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ స్పీడ్ బ్రేకర్ల వల్ల అధిక స్పీడుతో వస్తున్న వాహనాలు నియంత్రణలోకి వచ్చి ప్రమాదాల సంఖ్య ఘననీయంగా తగ్గే అవకాశం ఉంటుందని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజలు కూడా భాగస్వాములై ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను నివరించడంలో కృషి చేయాలని ప్రజలను కోరారు. రోడ్డుప్రమాదాల నివారణ గురించి పోలీసులు తీసుకున్న చొరవకు పలువురు స్థానిక ప్రజలు అభినందించారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీడీవో



**చట్టం ధర్పల్లి. ;** ధర్పల్లి మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ లో గురువారం శ్రీ మణికంఠ ప్యూరిఫై వాటర్ సప్లై ఆధ్వర్యంలో నిర్వాహకులు గిరిధర్ ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఎంపీడీవో బాలకృష్ణ ప్రారంభించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రయాణికుల కోసం స్వచ్ఛందంగా చల్లటి నీటి సదుపాయాన్ని ఏర్పాటు చేసినందుకు గిరిధరును అభినందించారు.

# మాల్ ప్రాక్టీస్ యత్నం కేసులో ఎనిమిది మంది అరెస్ట్.... పరారీలో ముగ్గురు

- మాల్ ప్రాక్టీస్ చేస్తే కఠిన చర్యలు
- జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర వెల్లడి




**చట్టం కామారెడ్డి ప్రతినిధి ;** గణితంలో వీక్ ఉన్న తన కొడుకును ఎలాగైనా పాస్ చేయించాలనుకున్న తండ్రి ఆరాటం కొడుకుతో పాటు పలువురిని కటకటాల పాలు చేసింది. కామారెడ్డి జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది.జుక్కల్ లో మాల్ ప్రాక్టీస్ కు యత్నించిన ఘటనలో 11 మందిపై కేసు నమోదైంది. వీరిలో ముగ్గురు పరారీలో ఉన్నారు. అరెస్టు చేసిన ఎనిమిది మందిలో ఇద్దరు విలేకరులు కూడా ఉన్నారు. కేసుకు సంబంధించిన వివరాలను ఎస్పీ రాజేష్ చంద్ర గురువారం మీడియాకు వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జుక్కల్ జిల్లా పరిషత్ పాఠశాల పరీక్ష కేంద్రంలో గణితం పరీక్ష రాస్తున్న ఓ విద్యార్థికి సబ్జెక్టు సరిగ్గా రాదు. దీంతో విద్యార్థి తండ్రి పాఠశాలలో వాటర్ సప్లయ్ చేస్తున్న ఓ వ్యక్తితో మాటలతో మచ్చిక చేసుకుని.. అతనికి ఓ తెల్ల కాగితం ఇచ్చి తన కొడుకు వివరాలు చెప్పి ప్రశ్నలను రాసుకుని రావాలని పంపించాడు. తెల్ల కాగితాన్ని సదరు వ్యక్తి విద్యార్థికి ఇచ్చాడు. కాసేపటికి 5 ప్రశ్నలతో కూడిన కాగితాన్ని ఆ విద్యార్థి సదరు వ్యక్తి అందించాడు. అతను ఆ కాగితాన్ని తిరిగి విద్యార్థి తండ్రికి ఇచ్చాడు. అనంతరం విద్యార్థి తండ్రి ఆ పేపర్ ను గ్రామ పంచాయతీ కారోబార్కు ఇచ్చి జవాబులు తేవాలని చెప్పాడు. ఆ పేపర్ను ఫొటో తీసుకున్న కారోబార్ అక్కడే ఉన్న విలేకరికి పంపించాడు. అలాగే ఆ పేపర్ కారోబార్ నుంచి ఓ యూట్యూబ్ రిపోర్టర్కు చేరగా అతని నుంచి మరో రిపోర్టర్కు వాట్సాప్ లో పంపారు. సదరు విలేకరి ఆ పేపర్ను ఓ క్లిప్పింగ్ తయారు చేసి లోకల్ గా ఉన్న డిజిటల్ మీడియా గ్రూపులో షేర్ చేశాడు. తర్వాత ఓ మైనర్ బాలుడు పరీక్ష కేంద్రానికి వెళ్లి మరొక మైనర్ బాలుడి ఫోన్ నుంచి ప్రశ్నలతో కూడిన పేపర్ ను ఫొటో తీసి కారోబార్ కు పంపించి డిలీట్ చేశారు. పోలీసులు ఈ విషయాన్ని గుర్తించి ప్రశ్నలు బయటకు వెళ్లకుండా విచారణ చేపట్టి ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. కాగా ఓ యూట్యూబ్ ఛానల్ విలేకరితో పాటు వాట్సప్ గ్రూప్ అడ్మిన్, మరో మైనర్ పరారీలో ఉన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి, ఎస్ బి సీఐ తిరుపతి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ధన్ పాల్ వ్యాఖ్యలకు స్పందించిన ముఖ్యమంత్రి

- అసెంబ్లీ సాక్షిగా సిట్ ఏర్పాటు చేసి విచారణకు ఆదేశించిన ముఖ్యమంత్రి



**చట్టం హైదరాబాద్ :** సోమవారం రోజున జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఇందూర్ *అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ఈ మధ్యకాలంలో తెలంగాణలో బెట్టింగ్ యాప్స్ మాఫియా విస్తృతంగా జరుగుతున్నాయి అని మాట్లాడటం జరిగింది. అనేకమంది మధ్యతరగతి యువత ఈజీ మనీకి అలవాటుపడి ఈ బెట్టింగ్ ఊబిలో పడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని యువత ఈ యాప్స్ వలన పెద్ద మొత్తంలో డబ్బు కోల్పోయి ఆర్థికంగా, మానసికంగా క్రుంగిపోయి ఆత్మహత్యలు చేసుకున్నారని దాని కారణంగా వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఈ మధ్య ఒక మీడియా పత్రికలో ఒక మాజీ మంత్రి ప్రమేయంతో ఈ యాప్స్ నిర్వాహణ జరిగిందని వస్తున్నా కథనాలపై విచారణ జరపాలని ప్రభుత్వం కేవలం కొందరు ప్రమోటర్లకు నోటీసులు పంపి కేసులు బుక్ చేసి చేతులు దులుపుకోవడానికే పరిమితం కాకుండా అసలైన దోషులను గుర్తించి ముఖ్యంగా యాప్ ఓనర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని గతంలో డ్రగ్స్ కేసు నిరుకార్చినట్టు కాకుండా ఈ బెట్టింగ్ మాఫియా పై పూర్తి స్థాయి విచారణ జరపాలని దోషులు ఎంతటి వారినైనా ఉపేక్షించకుండా చర్యలు తీసుకోవాలని అసెంబ్లీలో డిమాండ్ చేయడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ముఖ్యమంత్రి బుధవారం అసెంబ్లీలో సిట్ వేసి విచారణకు ఆదేశించడం జరిగింది. బెట్టింగ్ యాప్ ల నుండి యువతను రక్షించాలని బెట్టింగ్ యాప్ ఓనర్లపై చర్యలు తీసుకోవాలన్నా డిమాండ్ కు స్పందించి ముఖ్య మంత్రి సిట్ ఏర్పాటు చేసి విచారణకు ఆదేశించడం పట్ల ఎమ్మెల్యే ధన్ పాల్ ధన్యవాదాలు తెలిపారు.

## ప్రభుత్వ భూమి కబ్జా చేస్తే చర్యలు తప్పవు హైడ్రా కమిషనర్ రంగనాథ్..



**చట్టం, శంషాబాద్ :** ప్రభుత్వ భూమిని ఎవరైనా కబ్జా చేసి అక్రమ లేఅవుట్ చేస్తే చర్యలు తప్పవని హైడ్రా కమిషనర్ రంగనాద్ అన్నారు. గురువారం శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని ఆయన పర్యటించారు మున్సిపల్ పరిధిలోని తొండుపల్లిలో సర్వే నంబర్ 108 లో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తు తెలియని వ్యక్తులు కబ్జా చేసి అక్రమ లేఅవుట్ వెంచర్ చేస్తున్నారని తెలియడంతో అక్కడికి వచ్చి పరిశీలించి ఎవరైనా ప్రభుత్వ భూమిలో అక్రమ లేఅవుట్ చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను ఎంతటి వారైనా కబ్జా చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని అన్నారు. గొల్లపల్లి వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న స్మశాన వాటికలో అక్రమ హోర్డింగ్ కూడా తొలగిస్తామన్నారు. గత కొన్ని రోజుల క్రితం శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని కొన్ని ప్రభుత్వ భూములను పర్యవేక్షించామని వాటి పైన కూడా త్వరలోనే చర్యలు తీసుకుంటామన్నారు.

## గడపగడపకు జై భీమ్ జై సవిధాన్ నినాదాన్ని వినిపించాలి

- మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణరావు పటేల్




**చట్టం, భైంసా :** నిర్మల్ జిల్లా భైంసా మండలంలోని మాటేగం గ్రామంలో గురువారం జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో ముధోల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే నారాయణ్ రావు పటేల్ మాట్లాడుతూ.... రాజ్యాంగాన్ని బీజేపీ పార్టీ నాశనం చెయ్యాలి అనుకుంటుంది కానీ కాంగ్రెస్ పార్టీ ఉన్నన్ని రోజులు రాజ్యాంగాన్ని మార్చేటోడు ఇంకా పుట్టలేదు, పుట్టబోడు అని మాట్లాడారు దేశాన్ని అప్పుల పాలు చేసిన బీజేపీ, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిన బిఆర్ఎస్ పార్టీ కాముగా రేవంత్ రెడీ మన రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్తున్నారు. కావున మన అభివృద్ధి ప్రజలకు తెలియజేయాలి. రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల పలు చేసింది కాక రైస్ మిల్లు పేరిట ఎన్నో కోట్లు కేవలం మన నియోజకవర్గంలో ఎన్నో కోట్లు అవినీతి ఉంటే రాష్ట్ర మొత్తంగా ఎంత ఉంటది అని మాట్లాడారు రైతు బంధు, రైతు రుణమాఫీ ఉద్యోగాలు, ఫ్రీ బస్, గ్యాస్ సిలిండర్ 50 వేలకి పైగా ఉద్యోగాలు ఇచ్చిన ఘనత మన ముఖ్యమంత్రి ది. ప్రతి ఒక్కరూ మన అబివృద్ధి నీ ప్రజల దృష్టికి తీసుకెళ్తూ జై బాపు జై భీమ్ జై సంవిదాన్ ప్రజలో ఇంటి ఇంటికి వెళ్ళాలి అని కార్యకర్తలు మాట్లాడేరు రామ్ భూపాల్ జై బాపు జై భీమ్ జై సంవిధాన్ ముధోల్ తాలూకా ఇంచార్జి అర్జుమాన్ అలి జిల్లా గ్రంథాలయ చైర్మన్ పత్తి రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి తానుర్ మండలం ఇన్చార్జి ముధోల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే నియులు విఠల్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, Ex జడ్పీటీసీ సూర్యం రెడ్డి, భైంసా మండలం అధ్యక్షులు రామచంద్ర రెడ్డి, శంకర్ చేంద్రే ముత్యం రెడ్డి, గజనంద్ పటేల్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పుట్టిన రోజు కానుకగా విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ



**చట్టం ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి పట్టణ కేంద్రానికి చెందిన లింగారెడ్డిపేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు జన్మదినం సందర్భంగా ప్లేట్ల పంపిణీ చేశారు. నార్ల రాజు అఖిల దంపతులకు జన్మించిన పుత్రుడు "మహాన్ష్" యొక్క మొదటి పుట్టిన రోజు కానుకగా వారు ఇట్టి కార్యక్రమం నిర్వహించడం జరిగిందని వారి సంతోషాన్ని విద్యార్థులతో పంచుకుంటూ కానుకలు ఇవ్వాలనే వారి మంచి ఆలోచనను ఉపాధ్యాయులు కొనియాడుతూ "మహాన్ష్" ఇలాంటి పుట్టిన రోజులు వేడుకలు మరెన్నో జరుపుకుంటూ మంచి స్థాయికి ఎదగాలని ఉపాధ్యాయులు విద్యార్థులు అభినందనలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దాసిరాం, ఉపాధ్యాయులు రామకృష్ణ, ఉమాదేవి మరియు నార్ల రాజు అఖిల తదితరులు పాల్గొన్నారు.

## ప్రాజెక్ట్ రామడుగులో ఉపాధి హామీ పనులు, నర్సరీని పరిశీలించిన ఎంపీడీవో



**చట్టం ధర్పల్లి. ;** ధర్పల్లి మండలం లోని ప్రాజెక్టు రామడుగు గ్రామంలో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న, అటవీ ప్రాంతంలోని క్షేత్రస్థాయిలో ఉపాధి సిబ్బందితో వెళ్లి ఎంపీడీవో బాలకృష్ణ గురువారం పనులను పరిశీలించారు. ఎండాకాలంలో కూలీలకు ఇలాంటి ఇబ్బందులు కలగకుండా నీటి సదుపాయాన్ని, నీడను ఏర్పాటు చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలన్నారు. గ్రామంలోని నర్సరీని పరిశీలించి ఎండలు మండిపోతున్న తరుణంలో మొక్కలు ఎండిపోకుండా నీరును అందించాలని నిర్వాహకులకు సూచించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కొన్ని నర్సరీలకు నీటు సదుపాయాన్ని కల్పించాలని, కార్యదర్శులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## ఒకే దేశం ఒకే ఎన్నిక

- రాష్ట్ర నాయకులు బత్తిని దేవేందర్



**చట్టం ఎల్లారెడ్డి :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో గురువారం ఒకే దేశం ఒకే ఎన్నిక నినాదంతో దేశంలో మరియు రాష్ట్రంలో ఏకకాలిక ఎన్నికల సంస్కరణలు కోసం కేంద్రం తీసుకున్న నిర్ణయాని బలపరచవలసిందిగా బిజెపి రాష్ట్ర నాయకులు బత్తిని దేవేందర్ కోరారు. ఈ కార్యక్రమంలో బిజేపీ రాష్ట్ర నాయకులు మర్రి బాల కిషన్, పట్టణ అధ్యక్షులు రాజేష్, మండల అధ్యక్షులు పెద్దెడ్ల నర్సింలు, మాజీ ఎంపీపీ నక్క గంగాధర్, బీజేవైఎం పట్టణ అధ్యక్షులు శంకర్, ఎస్సీ మోర్చ పట్టణ అధ్యక్షులు పండరి, ఓబీసీ పట్టణ అధ్యక్షులు శివ, ఓబీసీ మండల అధ్యక్షులు సాయిలు, మహిందర్, సీనియర్ నాయకులు ఎస్.ఎన్ రెడ్డి, బాలరాజు, మర్రి బాలయ్య, పండరి, పద్మ శ్రీను, సత్యం, శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేశ రాజ్యాంగాన్ని మార్చే శక్తి ఎవరికీ లేదు

- కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంభూపాల్



**చట్టం, తానురు :** దేశ రాజ్యాంగాన్ని మార్చే శక్తి ఎవరికీ లేదని నిర్మల్ జిల్లా కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాంభూపాల్ అన్నారు. గురువారం నిర్మల్ జిల్లా తానూర్ మండలం లోని వడ్గం గ్రామం లో పుండలిక్ మండల అధ్యక్షులు అధ్యక్షతన జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ముధోల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే నారాయణ్ రావు పటేల్ మాట్లాడుతూ... రాజ్యాంగాన్ని బీజేపీ పార్టీ నాశనం చెయ్యాలి అనుకుంటుంది కానీ కాంగ్రెస్ పార్టీ ఉన్నని రోజులు రాజ్యాంగాన్ని మార్చెటోడు ఇంకా పుట్టలేదు పుట్టబోడు అని అన్నారు. దేశంలో అప్పుల పాలు చేసిన బీజేపీ, రాష్ట్రాన్ని అప్పుల పలు చేసిన బిఆర్ఎస్ పార్టీలు యని అన్నారు. కాని రేవంత్ రెడీ మన రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్తున్నారు కావున మన అబివృద్ధి ప్రజలకు తెలియజేయాలి రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల పాలు చేసింది. రైస్ మిల్లు పేరిట ఎన్నో కోట్లు కేవలం మన నియోజకవర్గం లో ఎన్నో కోట్లు అవినీతి ఉంటే రాష్ట్ర వెప్తంగా ఎంత ఉంటది అని అన్నారు. రైతు బంధు రైతు రుణమాఫీ ఉద్యోగాలు మరియు ఫ్రీ బస్ గ్యాస్ సిలిండర్ 50 వెలకి పైగా ఉద్యోగాలు కావున ప్రతి ఒక్కరూ మన అబివృద్ధి నీ ప్రజల దృష్టికి తీసుకెళ్తూ జై బాపు జై భీమ్ జై సంవిదాన్ ప్రజలో ఇంటి ఇంటికి వెళ్ళాలి అని కార్యకర్తలు మాట్లాడినారు. ఈ కార్యక్రమానికి వందలాది మంది వచ్చి కార్యక్రమానికి విజయోత్సవంగా జరుపారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న రామ్ భూపాల్ జై బాపు జై భీమ్ జై సంవిధాన్ ముధోల్ తాలూకా ఇంచార్జి, చైర్మన్ మరియు పత్తి రెడ్డి, రాజేశ్వర్ రెడీ, తానుర్ మండలం ఇన్చార్జి మరియు శంకర్ చేంద్రే ,ముత్యం రెడ్డి , మాజీ ఎంపీపీ చంద్రకాంత్ , మధుపటేల్, మాజీ సర్పంచ్ అటల్ దేవిదాస్ తదితరులు పాల్గొన్నారు.

## బాదిత కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేత



**చట్టం, తూప్రాన్ :** తూప్రాన్ మున్సిపల్ పరిధిలో నీ రెండవ వార్డు అబోతుపల్లి కి చెందిన పొండేటి యాదగిరి అప్పులబాధతో, ఆర్థిక సమస్యలతో మరణించిన విషయం తెలుసుకొని వారి కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు బుడ్డ భాగ్యరాజ్ పరామర్శించారు. మృతుని భార్య మహేశ్వరికి సహాయంగా దశదినకర్మకు 50 కేజీల బియ్యంను గురువారం జిల్లా కాంగ్రెస్ నాయకులు బుడ్డ భాగ్య రాజ్ , చందాయిపేట తాజామాజీ సర్పంచ్ స్వర్ణలత లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఎం.పి, పి.ఎం.పి డాక్టర్లు అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ అప్సర్ భాయ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొత్తపల్లి నర్సింగరావు, గుర్రం రాము, గుడిసె సిద్ధిరాములు, పోడేటి స్వామి తదితరులు ఉన్నారు.

## రాంభూపాల్ కు ఘన సన్మానం



**చట్టం, భైంసా :** భైంసా పట్టణంలోని నారాయణరావు పటేల్ నివాస గృహంలో గురువారం ముధోల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అబ్జర్వర్ రాంగోపాల్ కు ముధోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు బోసులే నారాయణరావు పటేల్ పూలమాల శాలువతో ఘనంగా సత్కరించారు. జై బాబు, జై భీమ్, జై సబితా కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథులుగా హాజరైన రాంభూపాల్ ను మర్యాదపుర్వకంగా ఆహ్వానించి సన్మానించడం జరిగిందని తెలిపారు. వీరి వెంట తానుర్ మండల ఇన్చార్జి పత్తి రాజేశ్వర్ ,మాజీ జెడ్పిటిసి సారంగాపూర్ లను సన్మానం చేసిన మాజీ శాసనసభ్యులు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నారాయణరావు పటేల్. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తనూర్ మండల ఎంపీపీ చంద్రకాంత్ యాదవ్,బ్లాక్ అధ్యక్షుడు ముత్యం రెడ్డి,ఎస్సీ సెల్ ముధోల్ నియోజకవర్గం నాయకులు శరత్ డోంగ్రే , మాజీ ఎంపిటిసి బోసి శంకరన్న ఉన్నారు.

చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక
CHATTAM NEWS
@ChattamTV
శుక్రవారం
28.03.2025



# ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సలు అందించాలి

- **ముజ్గి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ వైద్యాధికారులను ఆదేశించారు.గురువారం నిర్మల్ గ్రామీణ మండలం ముజ్గి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్నీ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బయోమెట్రిక్ హాజరు, ఇన్ పేషేంట్ వార్డు, ఆయుష్ క్లినిక్, డ్రగ్స్ స్టోరూంలను సందర్శించి, రిజిస్టర్లను పరిశీలించారు. అందిస్తున్న వైద్య సేవలు, రోగులకు లభిస్తున్న సదుపాయాలపై వైద్యులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని ఆదేశించారు. వైద్యం కోసం వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు కల్పించాలని, ఆసుపత్రుల్లో సరిపడినన్ని బెడ్లు, మందులు, ఇతర వైద్య పరికరాలు అందుబాటులో ఉండాలని సూచించారు. అందిస్తున్న వైద్యచికిత్సలు, మందులను రోజువారీగా రిజిస్టర్ లలో నమోదు చేయాలన్నారు. వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలనను పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆసుపత్రిలో నిరంతరం పరిశుభ్రతను పాటించాలని, ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అనంతరం చికిత్స కోసం వచ్చిన రోగులతో కలెక్టర్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలోని సౌకర్యాలు, అందిస్తున్న చికిత్సల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ రాజేందర్, వైద్యశాఖ అధికారులు శ్రీనివాస్, రవీందర్, తహసీల్దార్ సంతోష్, ఎంపిడిఓ గజానంద్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 31న గడువులోపు ఆస్తి పన్నులు చెల్లించండి



**చట్టం, రామకృష్ణాపూర్:** క్యాతనపల్లి మున్సిపాలిటీ నందు 202425 ఆర్థిక సంవత్సరానికి ఈ నెల 31వ తేదీ లోపు పెండింగ్లో ఉన్న ఆస్థి పన్ను (ఒకేసారి పద్ధతి స్కీమ్) ద్వారా బకాయిలను చెల్లించే వారికి 90 శాతం వడ్డీ మాఫీ చేయడం జరుగుతుందని, ఇది వరకు వడ్డీతో కలిపి పూర్తిగా చెల్లించిన వారికి వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పనుల్లో సర్దుబాటు చేయడం జరుగుతుందని పుర కమిషనర్ గద్దె రాజు గురువారం పత్రిక ప్రకటనలో పేర్కొన్నారు. కాబ్బటి ప్రభుత్వం అవకాశం కల్పించిన (ఒకేసారి పద్ధతి స్కీమ్) ద్వారా ఈ నెల 31వ తేదీన గడువులోపు చెల్లించి 90 శాతం వడ్డీ మాఫీ సదవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఆస్తి పన్ను చెల్లించని పక్షంలో (తెలంగాణ పురపాలక చట్టం 2019) సెక్షన్ 87 ప్రకారం తమ ఆస్తులను జప్తు చేయడం జరుగుతుందని ప్రకటనలో పేర్కొన్నారు.

**తైబజార్ వేలంపాటకు వాయిదా ...**

క్యాతనపల్లి మున్సిపాలిటీ నందు 202526 ఆర్థిక సంవత్సరానికి రోజువారి తైబజార్, రామాలయం ప్రాంతంలో బుధవారం నిర్వహించే అంగడి బజార్ ఫీజులు వసూలు చేయుటకు ఈ నెల 19న బహిరంగ వేలం ప్రకటన జారీ చేశామని, వాటికి సంబంధించి ఒక్క దరఖాస్తు కూడా రాకపోవడంతో, రెండో ప్రకటన జారీ చేయగా ఒకే దరఖాస్తు రావడంతో మళ్ళీ వేలంపాట వాయిదా వేయడం జరిగిందని, తదుపరి తేదీలను ప్రకటనల మళ్ళీ ద్వారా జారీ చేస్తామని పుర కమిషనర్ పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

## ఉస్మానియాలో ప్రజాస్వామ్యం నిర్బంధం .?

- **ఉస్మానియా ఉద్యమ చరిత్రకు గండిపెట్టే సర్క్యులర్!**
- **ఉస్మానియాలో నిరసనల నిషేధం – రాజ్యాంగ విరుద్ధమా?**
- **ప్రజాస్వామ్యానికి గ్యారెంటీ లేని ప్రభుత్వ పాలన**



**చట్టం,షాద్ నగర్ ప్రతినిధి ;**దిర్షిణం శంకర్మ ఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థుల హక్కులపై మాట్లాడిన మాటలు కేవలం ఎన్నికల ప్రచార హంగామా మాత్రమేనని ఇప్పుడు బహిరంగమవుతోంది. ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీ విడుదల చేసిన సర్క్యులర్ దీనికి నిదర్శనం. ధర్నాలు, ప్రదర్శనలు, నిరసనలు నిషేధించి, విద్యార్థుల హక్కులను కాల రాస్తున్నారు.

**రాజ్యాంగాన్ని తోసిపుచ్చిన ప్రభుత్వం**

భారత రాజ్యాంగం ఆర్టికల్ 19(1) ప్రకారం ప్రతి పౌరుడికి అభివ్యక్తి స్వేచ్ఛ, శాంతియుతంగా సమావేశమవడానికి హక్కు ఉంది. కానీ ఉస్మానియా యూనివర్సిటీ ఈ హక్కును "క్యాంపస్ శాంతిభంగం" అనే పేరుతో తొలగిస్తోంది. ఇది కేవలం నియంతృత్వ పాలనలో మొదటి అడుగు.

**రేవంత్ రెడ్డి డబుల్ స్టాండర్డ్**

2019లో విద్యార్థి ఉద్యమాలను సమర్థించి, విద్యార్థులు రాజకీయాల్లో పాల్గొనాలని ప్రకటించారు. 2024లో ఇప్పుడు విద్యార్థులను పోలీసు బలత్కారంతో అరెస్టు చేయిస్తున్నారు.

**హామీ vs వాస్తవం**

ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తాను"_ అన్న మాటలు ఎక్కడ? యూనివర్సిటీలను జైళ్లుగా మారుస్తున్నారు.

**విద్యార్థులపై యుద్ధం ఎందుకు?**

స్కాలర్షిప్లు నిలిపివేతతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఆర్థిక సహాయం అందకుండా చేస్తున్నారు. ఫీజులు పెంచడంతో "సెల్ఫ్‌ఫైనాన్స్" పేరుతో ఫీజులు 300% పెంచి, పేద విద్యార్థులను బహిష్కరిస్తున్నారు. హాస్టళ్లలో దుర్భర పరిస్థితులతో అసలైన భోజనం, తాగునీరు లేక విద్యార్థులు బాధపడుతున్నారు. అధ్యాపక ఖాళీలతో 50% కంటే ఎక్కువ పోస్టులు ఖాళీగా ఉంచడం వల్ల చదువుల నాణ్యత దెబ్బతింటోంది.

**ప్రభుత్వం యొక్క నిజమైన ఎజెండా విద్యా ప్రైవేటీకరణ**

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 400 ఎకరాల భూమిని కార్పొరేట్ కంపెనీలకు విక్రయించే ప్రణాళిక. నిజామాబాద్ యూనివర్సిటీ పేరు మార్చి, దాని స్వభావాన్ని మార్చే ప్రయత్నం.స్కిల్ యూనివర్సిటీలు పేరుతో విద్యను బిజినెస్ గా మార్చేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపిస్తున్నారు.

**ఉస్మానియా యూనివర్సిటీ చరిత్ర**

1938లో నిజాం పాలనను ఎదుర్కొన్న విద్యార్థులు.1969, 2009 తెలంగాణ ఉద్యమాల్లో ముందంజలో నిలిచిన యూనివర్సిటీ. 2024లో మళ్లీ అణచివేతను ఎదుర్కోవాల్సిన సమయం వచ్చింది.! ప్రభుత్వం సర్క్యులర్ను వెనక్కి తీసుకోకపోతే ప్రజాస్వామ్య పోరాటం తప్పదు అంటూ పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు. విద్యార్థులు, ప్రజలు ఒక్కటైతే... ఈ నియంతృత్వాన్ని మట్టుబెట్టవచ్చని రాజకీయ విశ్లేషకులు నిపుణులు సూచిస్తున్నారు.

## బాధిత కుటుంబానికి బియ్యం అందజేసిన జర్నలిస్టులు



**చట్టం, శంకరపట్నం :**శంకరపట్నం మండలం కేశవపట్నం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మక్త గ్రామానికి చెందిన షేక్ అజీమ్, రెహమాన్ తండ్రి కొడుకులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా శంకరపట్నం మండల జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మానవతా దృక్పథంతో తమ వంతు సహాయంగా బియ్యం అందజేసి ఉదారత చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల జర్నలిస్ట్ యూనియన్ సభ్యులు ఉన్నారు.

## ఈ ఇద్దరిపై వేటు

**చట్టం:** ఐపీఎల్ ముగిసిన తర్వాత.. భారత జట్టు టెస్టు సిరీస్‌ను ఆడనుంది. ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ ఆడనుంది. తాజాగా మరో విషయం వెలుగులోకి వచ్చింది. ఇంగ్లాండ్ పర్యటన నాటికి టీమ్‌ఇండియా సహాయక స్టాఫ్‌లో బీసీసీఐ భారీ మార్పులను చేయనుందని వార్తలు వస్తున్నాయి. జట్టుతో పాటు జంబో సపోర్ట్ స్టాఫ్‌ను పంపించేందుకు బీసీసీఐ అనాసక్తి కనబరుస్తోంది. ఈ క్రమంలో బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మార్చి 29న గౌహతిలో సమావేశం కానున్నట్లు సమాచారం. రాహుల్ ద్రవిడ్ తర్వాత ప్రధాన కోచ్‌గా గంభీర్ బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. తనకు సహాయం అందించేందుకు రైన్ టెన్ డస్కతే, అభిషేక్ నాయర్‌లను అసిస్టెంట్ కోచ్‌లుగా.. మోర్నీ మోర్కెల్‌ను బౌలింగ్ కోచ్‌గా నియమించుకున్నాడు. ఫీల్డింగ్ కోచ్‌గా దిలీప్‌ను కొనసాగించాడు. సితాన్షు కోటక్‌ను బ్యాటింగ్ కోచ్‌గా నియమించాడు. ఛాంపియన్స్ ట్రోఫీగా విజేతగా నిలవడంలో వీరందరూ కీలక పాత్రే పోషించారు. ఈ క్రమంలో రాబోయే ఇంగ్లాండ్ పర్యటనకు ప్రత్యేకంగా అసిస్టెంట్ కోచ్, ఫీల్డింగ్ కోచ్ అవసరం లేదని బీసీసీఐ భావిస్తోంది. దీంతో అభిషేక్ నాయర్, దిలీప్‌ను పక్కన పెట్టే అవకాశాలు ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే జట్టుతోపాటు ఉన్న సితాన్షు, మోర్నీ మోర్కెల్ పదవులకు ఎలాంటి ఇబ్బంది ఉండకపోవచ్చు. అయితే, గౌతమ్ గంభీర్ నిర్ణయం ఎలా ఉంటుంది.

## ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- **ప్రతి పిఎస్ కు ట్రాఫిక్ నియంత్రణ సామాగ్రి పంపిణీ**
- **జిల్లా ఏస్పీ జానకీ షర్మిల**



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని నిర్మల్ జిల్లా ఎస్పి జానకి షర్మిల అన్నారు. ట్రాఫిక్ ఉల్లంఘన , డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎస్పి డాక్టర్ జానకి షర్మిల పేర్కొన్నారు. ఇటీవల జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల జిల్లాలో ట్రాఫిక్ నియంత్రణ పై రోడ్డు ప్రమాదాలపై రోడ్డు ప్రమాదాలు జరిగే కారణాలపై ప్రత్యేక దృష్టి సారించి పలుమార్లు జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించటం జరిగింది. ఇందులో భాగంగానే రెండు రోజుల క్రితం ట్రాఫిక్ నియత్రాణ సామాగ్రిని అన్ని పోలీస్ స్టేషన్లు కు సరఫరా చేయటం జరిగింది.రాత్రి వేళల్లో హోటళ్లలో, డాబాల్లో మద్యం సేవించి వాహనాలు నడపటం వాళ్ళ ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి అని గ్రహించి, ఇందులో భాగంగానే మంగళవారం రోజు రాత్రి డాబా లాపై ఆకస్మిక తనిఖి నిర్వహించటం జరిగింది. అదేవిధంగా ఈ రోజు రాజేష్ మీన ఐపిఎస్ నేతృత్వంలో నిర్మల్ రూరల్ మండల్ గ్రామం రాణాపూర్ లో రిలయన్స్ పెట్రోల్ బంకు దగ్గర మరియు గ్రామంలోని రోడ్డుపై గల హోటల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినారు. అదే చందు వద్ద రూ.73,187 రూపాయల విలువగల 104 లీటర్ల మందు బాటిళ్లు సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## ఆశీర్వచనం అందించు అంబేద్కరా...!



**చట్టం, ముధోల్ :**నిర్మల్ జిల్లా ముధోల్ మండలం రామ్ టెక్ గ్రామంలో విక్రయశీల బుద్ధ విహారంలో దేవకే లక్ష్మీబాయి హైబత్ కుమారుడు రాందాస్ వివాహం జరగగా బుధవారం డాక్టర్ భీమ్రావు రాంజీ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వందనం చేసి నూతన నవ దంపతులు మమ్మల్ని ఆశీర్వదించు వయ్యా ఓ బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ అంటూ వినూత్న రీతిలో మా పాలిట మీరే దేవుడు అంటూ సాక్షాత్తు బాబా సాహెబ్ అంబేద్కర్ పూలమాలలు వేసి పాదాభివందనం చేశారు. కొందరు తమ ఆరాధ్య దేవుళ్లను తలుచుకొని మొక్కులు తీర్చుకుంటారు కానీ రామ్ గ్రామంలో వివాహ అనంతరం నూతన దంపతులు ఇలా ఈ గ్రామంలో ప్రతి ఒక్కరు బౌద్ధ ఉపవాసకులు గ్రామానికి చెందిన దళితులు నూతన రీతిలో నూతన పద్ధతి ద్వారా నడవడం గత కొన్ని సంవత్సరాల నుండి వస్తుందని గ్రామస్తులు తెలుపుతున్నారు. దీనితో అంబేద్కర్ భావజాలం కలిగిన అంబేద్కర్ లిస్టులు పలువురు దళిత నాయక సోదరులు వీరిని అభినందించారు.

## పాస్టర్ ను హత్య చేసిన నిందితులను అరెస్టు చేయాలి

- **క్రిస్టియన్, మైనారిటీలపై దాడులు ఆపాలి**
- **అత్య వెనుక ఉన్న మతోన్మాద కుట్రలను వెలికి తీసి కఠినంగా శిక్షించాలి.. సిపిఎం ప్రజాసంఘాలు డిమాండ్**



**చట్టం వికారాబాద్ ప్రతినిధి :**వికారాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రాజమండ్రిలో పాస్టర్ ను హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు రాయల్ నవీన్ కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి ఆర్ మహిపాల్ పాల్గొని మాట్లాడుతూ..దేశంలో రోజు రోజుకు క్రిస్టియన్ మైనార్టీ లపై రోజు రోజుకు దాడులు హత్యలు అత్యాచారాలు పెరిగిపోతున్నాయి అన్నారు. దాడులు వెనుక దాగి ఉన్న మతోన్మాద కుట్రదారులను వెలికి తీసి వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కేంద్ర రాష్ట్ర పాలకులను డిమాండ్ చేశారు. భారతదేశం లౌకిక ప్రజాస్వామ్య దేశం, మత సమరసాన్ని కాపాడుదాం, భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం, కొంతమంది కుట్ర దారులు దేశద్రోహులు దేశ వ్యతిరేకులు రాజ్యాంగ వ్యతిరేకులు కావల్సుకొని మత కలహాలు సృష్టించి రాజకీయ పబ్బం కోసం దాడులకు పాల్పడుతున్నారు. ఈ పాలకులు, రాజ్యం కలగజేసుకుని దాడులకు పాల్పడుతున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకొని కటినంగా శిక్షించాలని పాలకులకు డిమాండ్ చేశారు. పాలకులు చట్టాలను పటిష్టంగా అమలు చెయ్యాలి. లేనిచో పెద్ద ఎత్తున పోరాటాలకు పిలుపునిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కె వి పి ఎస్ కన్నా, సిఐటియు శంకర్, సి బి టి డేవిడ్. సిపిఎం బి నర్సింలు శ్రీను కుమారు నర్సింలు అంజి దేవయ్య రాములు బుచ్చయ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాసర సరస్వతి ఆలయంలో లింగం గుట్ట పీఠాధిపతి పూజలు



**చట్టం, బాసర :** భారతదేశంలో పవిత్ర పుణ్యక్షేత్రమైన చదువుల తల్లి బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ క్షేత్రంలో శుక్రవారం సిద్దిపేటకు చెందిన నిజామాబాద్ జిల్లాలోని నవీపేట్ మండలం సిద్ధాశ్రమం అనంతసాగర్ లింగం గుట్ట పిఠాధిపతి శ్రీ రాజయోగి దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులతో కలిసి నూతన తెలుగు పంచాంగాలకు ప్రత్యేక పూజకార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాసర ఆలయ అభివృద్ధికి తన వంతుగా సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.మరి కొన్ని రోజుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు దేవదాయశాఖ మంత్రి కొండ సురేఖ లతో కలిసి ఆలయ అభివృద్ధి పై వివరించనున్నట్లు పేర్కొన్నారు.

## సిసి రోడ్డు పనులకు భూమి పూజ



**చట్టం, బీర్కూర్ :**బీర్కూర్ మండలంల బరంగేడ్గి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు గోండ్ల శ్రీనివాస్,ఏఎంసీ డైరెక్టర్ గోండ్ల రాజు,దేవానంద్ దేశముఖ్,ఇందూరి గంగాధర్,ఇందూరి లక్ష్మణ్, నాచారం రాములు,పసుపుల రమేష్,కామప్ప,వీరప్ప తదితరులు నాయకులు పాల్గొన్నారు.

## కోటి తలంబ్రాల దీక్షలో పాల్గొన్న జడ్జి ప్రియాంక

- **గోటితో వడ్లను ఓలిచి రామకోటి రామరాజుకు అందజేత**
- **రామయ్య కళ్యాణ తలంబ్రాలలో పాల్గొనడం నా అదృష్టం**
- **రామకోటి రామరాజు కృషి అమోగమన్న జడ్జి ప్రియాంక**



**చట్టం, సిద్దిపేట :** భద్రాచల సీతారాముల కళ్యాణానికి శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ అందించే కోటి తలంబ్రాల దీక్షలో గురువారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి. ప్రియాంక పాల్గొన్నారు. రామనామస్మరణ చేస్తూ గోటితో వడ్లను ఒలిచి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు రామకోటి రామరాజుకు తన నివాసంలో అందజేసి రామభక్తిని చాటుకున్నారు. అనంతరం జడ్జి ప్రియాంక మాట్లాడుతూ.. మొదటి సారిగా నేను ఈ గోటి తలంబ్రాల కార్యక్రమంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు. మనము భద్రాచలం వెళ్లలేకపోయినా కూడా మన చేతులతో ఓలిచిన తలంబ్రాలు భద్రాచల సీతారాముల కళ్యాణానికి వెళ్లడం అదృష్టం అన్నారు. ప్రతి ఒక్కరూ కూడా హిందూ సనాతన ధర్మాన్ని కాపాడాలన్నారు. ఇలాంటి పుణ్య కార్యక్రమంలో మమ్మల్ని కూడా బాగా స్వాములను చేసిన రామకోటి రామరాజు కృషి, పట్టుదల అమోగం అన్నారు. బిజీగా ఉన్నా కూడా రామభక్తికి సమయం ఇచ్చినందుకు జడ్జి ప్రియాంకకి రామకోటి సంస్థ ద్వారా సీతారాముల జ్ఞాపికను అందజేసి రామకకోటి రామరాజు సన్మానించారు.

## జై బాపూ జై భీమ్ జై సవిధాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి




**చట్టం, కుంటాల :** నిర్మల్ జిల్లా కుంటాల మండల కేంద్రంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు జై బాబు జై సవిధాన్ జై భీమ్ అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముదురు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు నారాయణరావు పటేల్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి మీనాక్షి నటరాజన్, ముధోల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ శాసనసభ్యులు నారాయణరావు పటేల్ ఆదేశాల మేరకు జై బాపు జై భీమ్ జై సంవిధన్ అనే కార్యక్రమం కుంటాల మండల కేంద్రం లో సమస్త కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించుటకు విచ్చేస్తున్న సదా సుదర్శన్ కుంటాల మండల ఇంచార్జి మరియు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ జుట్టు అశోక్ మరియు మాజీ ఎంపీపీ భోజరం పాటిల్ కుంటాల కు విచ్చేస్తున్నారు. కావున కుంటాల మండల సమస్త కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రతి ఒక్కరు కార్యక్రమం కు హాజరు కావలిసిందిగా జుట్టు లక్ష్మణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## పాత్రికేయుడి అరెస్టుకు నిరసనగా ధర్నా, రాస్తారోకో




**చట్టం బీర్కూర్ :** బీర్కూరు మండల కేంద్రంలోని సీనియర్ పాత్రికేయుడు కొప్పుల గంగాధర్ ను బుధవారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా మండల పాత్రికేయులు అరెస్టుకు నిరసనగా మండల కేంద్రంలోని కామప్ప చౌరస్తాలో ధర్నా, రాస్తారోక నిర్వహించి అనంతరం ఎమ్మార్వో లతకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ప్రవీణ్ మాట్లాడుతూ.. టీ తాగుదామని చెప్పి బయటకు తీసుకెళ్లి అరెస్టు చేశారని ఇంట్లో వారికి కనీసం సమాచారం ఇవ్వలేదని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కథేపురం గంగన్న, మేకల రవి, భవాని నరేష్, భవాని, సాయి, పండరి,కానూరి శ్రీనివాస్, ధర్మతేజ ప్రవీణ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## పాఠశాలలో ట్విన్నింగ్ ప్రోగ్రాం



**చట్టం బీబీపేట్ :** బీబీపేట్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం సమగ్ర శిక్ష ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్స్ కార్యక్రమంలో భాగంగా ఉప్పర్ పల్లి ,ఇస్సా నగర్ గ్రామాల యు పి ఎస్ పాఠశాలల విద్యార్థులు పాఠశాలను సందర్శించారు.పాఠశాలలోని కంప్యూటర్ ల్యాబ్ ,సైన్స్ ల్యాబ్ ,డిజిటల్ తరగతి గదులు ,హాకీ క్రీడలు ,గ్రంధాలయం ,రోబోటిక్స్ ,సోలార్ ప్లాంట్ ,వాటర్ ప్లాంట్ లాంటివి చూడడం జరిగింది .ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి అశోక్ ,ప్రదనోపాధ్యాయులు మూల రవీంద్రారెడ్డి ,యు పి ఎస్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాఘవరెడ్డి ,పద్మిని తో పాటు ఉపాధ్యాయులు విశ్వ మోహన్ ,అరుంధతి ,స్వామి ,నాగరాజు, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు పరామర్శ



**చట్టం, భైంసా ;** నిర్మల్ జిల్లా ముదురు నియోజకవర్గంలోని బైంసా మండల పరిధిలో సావ్లి గ్రామంలో రెండు కుటుంబాలకు చెందిన వేరే వేరే కారణాలవల్ల మృతి చెందగా గురువారం భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత ప్రజా ట్రస్ట్ చైర్మన్ బోస్లే మోహన్ రావు పటేల్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. మరణానికి గల కారణాలను తెలుసుకొని అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ మనోధైర్యాన్ని అందించారు. వారి కుటుంబాలకు ఆర్థిక సాయంతో పాటు మౌలిక వస్తువులను అందించారు. ఇకనుండి మీకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా మీ వెంట నేనుంటా అంటూ తెలుపుతూ వారికి ధైర్యాన్ని అందించారు. వీరి వెంట ముధోల్ మాజీ మండల అధ్యక్షులు సుభాష్ పటేల్, నాయకులు గ్రామస్తులు, అభిమానులు తదితరులు ఉన్నారు.

## పిప్రి లిఫ్ట్ ఇరిగేషన్ కు రూ.18 కోట్ల నిధులు విడుదల చేయండి

- **శాసనసభలో ఎమ్మెల్యే పవార్ రామరావు పటేల్**



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** పిప్రి లిఫ్ట్ ఇరిగేషన్ కు అదనంగా రూ.18 కోట్ల రూపాయల నిధులు ఇవ్వాలని ఎమ్మెల్యే పవర్ రామరావ్ పటేల్ శాసనసభ లో కోరారు. గడువు మూడు నెలలు మాత్రమే ఉందని తక్షణమే జీవో విడుదల చేయలన్నారు. పనులు పూర్తయితే 4200 ఎకరాలకు సాగునీరు అందుతుందని, పిప్రి, మొల, నగర్, ధర్మోరా, బాగాపూర్, రాయపూర్ కాండ్లి, లోకేశ్వరం, నగర్ తండాల తో పాటు, పలు తండాల్లో, సాగునీరు అందుతుందన్నారు. ఎలక్ట్రికల్ పనులు మినహా అన్ని పనులు పూర్తి కావడం జరిగిందని ఇప్పటివరకు ప్రభుత్వం రూ.40 కోట్లు ఖర్చు చేసిందని తక్షణమే ప్రభుత్వం రూ.18కోట్లు విడుదల చేస్తే తక్కువ ఖర్చుతో రైతాంగానికి ఎక్కువ సాగునీరు అందుతుందన్నారు. ఈ విషయంలో సంబంధిత శాఖ మంత్రి సానుకూలంగా స్పందించారు.

## బోథ్ అడెల్లి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

▶ ఇచ్చోడలో రూ.4 కోట్లతో షాదిఖాన మంజూరు చేయాలి



**చట్టం, బోథ్:** బోథ్ అడెల్లి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలంటూ అసెంబ్లీలో జరిగిన క్వశ్చన్ హావర్ లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బోథ్ అడెల్లి రోడ్డు కొరకు గత ప్రభుత్వం రూ.18 కోట్లు మంజూరు చేసిందని ఇంకా రూ.4 కోట్ల రూపాయలు అవసరం ఉన్నాయని ప్రభుత్వం మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా ఇచ్చొడలో షాదీఖాన నిర్మాణం కొరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందని ప్రభుత్వం రంజాన్ మాసాన్ని దృష్టిలో పెట్టుకొని తక్షణమే షాదీఖాన మంజూరు చేయాలని కోరారు.

## వడగండ్ల వర్షా నికి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

▶ టిడిపి కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జ్ మానుక ప్రవీణ్ కుమార్ డిమాండ్



**చట్టం, కోరుట్ల ప్రతినిధి :** జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గం మేట్ పల్లి మండలంలోని పలు గ్రామాలలో వడగళ్ల వర్షానికి పంట నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని మానుక ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఏఎస్ఆర్ తండా, రంగారావుపేట, మెట్లచిట్టాపూర్ తదితర గ్రామాలలో వడగండ్ల వాన వల్ల నష్టపోయిన రైతు కుటుంబాలను అయన పరామర్శించి రైతులు ధైర్యంగా ఉండాలని అయన విజ్ఞప్తి చేశారు. వరి పొలాల్లో ధాన్యం రాలిపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి, జిల్లా మంత్రి, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని మానుక ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గజేల్లి రాజగణేష్, సిహేచ్ నరసింహ, చందు, ఎండి షాదుల్ల, ఫిరోజ్ ఖాన్, సిద్ధు, రైతులు గుగులోతు మార్వార్, గుగులోతు కర్ణ, జి ప్రభాకర్, జి బాపూలాల్, జై రమేష్, జి తిరుపతి, దాసు, గంగాధర్, గంగుల గంగా భూమయ్య, బుచ్చి నర్సయ్య తదితరులు ఉన్నారు.

## వివాహిత అదృశ్యం – ఆచూకీ తెలిపిన వారికి సమాచారం అందించాలి

▶ ఆచూకీ లభిస్తే,8639189301,9908337990 సంప్రదించండి



**చట్టం, షాద్ నగర్ ప్రతినిధి:–** రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని మొదల్ల గూడెం గ్రామానికి చెందిన పడకల వినోద (38) , కుమార్తె వెన్నల రెండు సంవత్సరాల పాపతో ఈనెల 24న ఉదయం 5 గంటల సమయంలో తన ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు .ఈ సంఘటనపై వినోద అన్నా రామాంజనేయులు నందిగామ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కుటుంబ తగాదాల కారణంగానే ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.వినోద గురించి ఏమైనా సమాచారం లభిస్తే కుటుంబ సభ్యులను లేదా నందిగామ పోలీస్ స్టేషన్‌ను వెంటనే సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 8639189301, 9908337990 సంప్రదించాలని కోరారు.

## మహిళను వేధిస్తున్న వ్యక్తి పై కేసు నమోదు

▶ గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఏ.ఇంద్రసేనరెడ్డి




**చట్టం రామగుండం కమిషనరేట్:** సుందిళ్ల గ్రామానికి చెందిన బోగిరి విజయ్ కుమార్ అను వ్యక్తి గత కొంతకాలంగా గంగానగర్ కు చెందిన ఒక మహిళను వేధిస్తున్నాడని, ఆ మహిళ బుధవారం గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఇచ్చిన దరఖాస్తు మేరకు కేసు నమోదు చేసి విచారించి గురువారం విజయ్ కుమార్ ను పట్టుకొని అరెస్టు చేయడం జరిగింది . ఈ కేసులో మహిళ తెలిసినతదని ఫోన్లో మాట్లాడినందుకు, ఆ ఫోన్ రికార్డును ఆసరాగా చేసుకొని ఆ మహిళను వేధించడం మొదలు పెట్టాడు. ప్రజలందరికీ పోలీస్ శాఖ తరపున విజ్ఞప్తి, ముఖ్యంగా మహిళలకు ఆడపిల్లలకి తెలిసిన వ్యక్తులైన, తెలువని వ్యక్తులతోనైనా ఫోన్లలో, సోషల్ మీడియాల లో ఎక్కువసేపు మాట్లాడటం కానీ, మెసేజ్లు పంపడం కానీ, ఫోటోలు షేర్ చేయడం గానీ చేయకూడదని, వాటి వల్ల సమస్యలు ఎదురవుతాయని తెలియజేస్తున్నాం. సోషల్ మీడియాలో మహిళలు ఎలాంటి ఫోటోలను గాని, వీడియోలను గాని పోస్ట్ చేయరాదని, ముఖ్యంగా వారి కుటుంబానికి సంబంధించిన ఫోటోలను పోస్ట్ చేయరాదని తెలియజేస్తున్నాము. సైబర్ నేరస్తులు మహిళల యొక్క, ఆడపిల్లల యొక్క ఫోటోలను మార్ఫింగ్ చేసి వారిని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తారు కాబట్టి, ఎవరు కూడా సోషల్ మీడియాలో ఫోటోలను వీడియోలను పోస్ట్ చేయరాదని గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఏ. ఇంద్రసేనరెడ్డి విజ్ఞప్తి చేశారు.

## రాజ్యాంగాన్ని మార్చడం మీ ఇష్టమేనా..?

▶ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ రాంభూపాల్



**చట్టం, కుబీర్ :** కుబీర్ మండల కేంద్రం లో ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నిర్మల్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి ధనసూరి అనసూయ సీతక్క ఆదేశాల మేరకు జై బాపు జై భీమ్ జై సంవిధన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం కి ముఖ్య అతిధిగా జై బాపు జై భీమ్ జై సంవిధన్ నిర్మల్ జిల్లా ఇంచార్జి రామ్ భూపాల్ ముధోల్ మాజీ శాసనసభ్యులు జి విఠల్ రెడ్డి మాజీ డీసీఎంఎస్ చైర్మన్ నారాయణ రెడ్డి, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటిల్ పాల్గొన్నారు. మాజీ శాసనసభ్యులు మాట్లాడుతూ.. మహిళా సాధికారత కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి మహిళలను అన్ని రంగాలలో ముందంజలో ఉంచాలని అన్నారు. మహిళల కోసం ఉచిత బస్సు పథకం అమలు చేయడం జరిగిందని మరియు గృహ జ్యోతి పథకం ద్వారా సుమారు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటును కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 55 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చాం అని ఉగాది తర్వాత వచ్చే నెల నుండి సన్నబియ్యం పంపిణీకి కూడా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు, ఎంపీటీసీ లు, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన సీసీ రోడ్ల నిర్మాణం ప్రారంభం



**చట్టం, పెద్ద కొడప్గల్ :** మండలంలోని బాబల్గాం గ్రామంలో వర్షాకాలంలో వీధులలో గ్రామస్తులు నడవడానికి ఎంతో ఇబ్బందికరంగా ఉండేది. దీనిపై ప్రభుత్వం స్పందించి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షల రూపాయలతో నూతనంగా సిసి రోడ్లు పనులు ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్యా పటేల్ , బసవరాజు దేశాయ్, కల్లూరు పండరి, గ్రామంలోని కాంగ్రెస్ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# యూడిఐడి కార్డుల పంపిణీ ప్రక్రియ ప్రారంభించండి

▶ అన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు.. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**చట్టం ,నిర్మల్ ప్రతినిధి :** జిల్లాలో ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డుల (యూడిఐడి కార్డుల) పంపిణీ కోసం అర్హుల ఎంపిక ప్రక్రియను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. గురువారం హైదరాబాదు నుంచి సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి సెక్రటరీ లోకేష్ కుమార్ తో కలిసి జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో యుడిఐడి కార్డులు, ఇందిరా మహిళా శక్తి పెట్రోల్ బంకుల ఏర్పాటు, ప్రమాద బీమా మంజూరు, ఏకరూప దుస్తుల తయారీ, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. సెర్ప్ సీఈఓ మాట్లాడుతూ... అన్ని జిల్లాల్లో ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డులను జారీ చేసేందుకై అర్హుల గుర్తింపు ప్రక్రియను ప్రారంభించాలన్నారు. యుడిఐడి కార్డులను పొందేందుకై దివ్యాంగులకు నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులందరికీ ఏకరూప దుస్తులను పంపిణీ చేసేందుకై, ఎస్ హెచ్ జి సభ్యులచే ఏకరూప దుస్తుల తయారీ ప్రక్రియను ప్రారంభించాలన్నారు. ఇందిరా మహిళా శక్తి పెట్రోల్ బంకులు, విద్యుత్ వాహనాల ఛార్జింగ్ కేంద్రాలు, మహిళా శక్తి బజార్లు ఏర్పాటు చేసేందుకు అనువైన స్థలాలను గుర్తించాలన్నారు. మహిళా శక్తి బజార్లలో ఆయా జిల్లాలలో స్థానికంగా తయారయ్యే లభ్యమయ్యే వస్తువులను, మహిళా సంఘాలచే తయారు చేయబడిన వస్తువులను ఒక చోటికి చేర్చి విక్రయించాలన్నారు. ప్రమాదవశాత్తు మరణించిన మహిళా సంఘాల సభ్యులకు సంబంధించిన భీమా డబ్బులను మంజూరు చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ.. యుడిఐడి కార్డుల మంజూరు కోసం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇప్పటికే నమోదు చేసుకున్న దివ్యాంగులకు సమాచారం అందించి, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో యుడిఐడి కార్డుల నమోదు శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. యూడిఐడి కార్డుల ప్రక్రియపై సందేహాలను తొలగించేందుకు హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేశామన్నారు. మహిళా శక్తి పెట్రోల్ బంకులు, విద్యుత్ వాహనాల ఛార్జింగ్ కేంద్రాలు, ఏర్పాటు చేసేందుకై అనువైన స్థలాలను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ఇప్పటికే ఇందిరా మహిళా బజార్ ఏర్పాటుకు సంబంధించి స్థల గుర్తింపు ప్రక్రియ పూర్తయిందని, ఇందిరా మహిళా బజార్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సంవత్సరం నుంచి ఐకెపికి అదనపు వరి కొనుగోలు కేంద్రాలను కేటాయించడంతో పాటు సిబ్బందికి శిక్షణను అందించనున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు పైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్ లు, ఆర్డీవో రత్నకళ్యాణి, ఇన్ ఛార్జ్ డిఆర్డిఓ శ్రీనివాస్, మెప్మా పీడీ సుభాష్, డిఎస్ఓ కిరణ్ కుమార్, డిఎం సివిల్ సప్లయిస్ వేణుగోపాల్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రైతు రుణమాఫీ ప్రదర్శనకై ఫ్లెక్సీల తయారికి టెండర్ల ఆహ్వానం

▶ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ .




**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** రైతు రుణమాఫీ, రైతు భరోసా లబ్ధిదారుల వివరాలను ప్రదర్శించుటకు ఫ్లెక్సీ తయారీదారుల నుంచి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాలలో రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాలలో లబ్ధి పొందిన వారి వివరాలను గ్రామపంచాయతీ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలలో ప్రదర్శించేందుకై ఫ్లెక్సీ తయారీదారుల నుంచి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. 6×3 సైజులలో ఒక ఫ్లెక్సీలో దాదాపు 35 నుంచి 40 మంది రైతుల పేర్లు ప్రచురించవలసి ఉంటుందన్నారు. దాదాపు 2000 ఫ్లెక్సీలు అవసరమగునని, ఒక్కో ఫ్లెక్సీ గరిష్ట ధర రూ.350 రూపాయలుగా నిర్ణయించామన్నారు. ఆసక్తి గలవారు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, నిర్మల్ పేరు మీద పదివేల రూపాయల డీడీ ని (ఎస్బిఐ బ్యాంకు) తీసి సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయాల ప్రాంగణంలోని మొదటి అంతస్తులో గల 27వ నంబరు జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఈనెల 27వ తేదీ నుంచి 29 వ తేదీ మధ్యాహ్నం 2 గంటల లోపు అన్ని పని వేళలలో జీఎస్టీ పత్రాలతో కలిపి సమర్పించాలని తెలిపారు. 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు టెండర్ దాఖలు చేసిన వారందరి సమక్షంలో టెండరు ఖరారు చేయబడునని అదనపు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## లేబర్ కార్డు కొరకు దరఖాస్తు చేసుకోవాలి



**చట్టం ఎల్లారెడ్డి:** అర్హులైన కార్మికుల కొరకు తెలంగాణ ప్రభుత్వం వెల్ఫర్ బోర్డ్ ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తుందని అర్హులైన 12 రంగాల కార్మికులు ప్రతి ఒక్కరు కార్మిక లేబర్ కార్డు తీసుకోవాలనీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఎల్లారెడ్డి మండల కమిటీ అధ్యక్షులు మార్లు సాయి బాబు అన్నారు.కార్మిక లేబర్ కార్డు తీసుకోవడం వలన వివాహ బహుమతి పథకం, ప్రసూతి వైద్య సహజ పథకం, సహజ మరణం, ప్రమాద మరణం లాంటి లబ్ధి చేకూరుతుందని ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం ఎల్లారెడ్డి మండల కమిటీ అధ్యక్షులు మార్లు సాయిబాబు తెలియజేశారు. దరఖాస్తు కొరకు దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉన్నాయని ఈ నెలవారి సమావేశంలో ఎల్లారెడ్డి మండలంలోని వివిధ గ్రామాల నుండి అర్హులైన కార్మికులు అందరూ వచ్చి కార్మిక లేబర్ కార్డులు లేని వాళ్ళు, కార్మిక లేబర్ కార్డు కోరకు ఆన్లైన్ చేసుకోగలరనీ ఆయన తెలియజేశారు. స్థానిక లేబర్ అధికారులు నిజమైన కార్మికులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరు కార్మిక సంక్షేమ పథకాలు అందేటట్టు చూడాలనీ లబ్ధిదారుల ఎంపిక వాల్ పోస్టర్స్ ద్వార పురపాలక సంఘం అయితే పురపాలక సంఘం వాల్ పైన అతికించాలనీ అలాగే గ్రామపంచాయతీలు అయితే గ్రామపంచాయతీ మరియు మండల ఆఫీస్ లో వాల్ పైన అతికించాలనీ అప్పుడే అర్హులైన కార్మికులకు సంక్షేమ పథకాలు అందుతాయనీ భవన నిర్మాణ కార్మిక సంఘం ఎల్లారెడ్డి మండల కమిటీ అధ్యక్షులు మార్లు సాయి బాబు అన్నారు. ఆయనతో పాటు భవన నిర్మాణ కార్మిక సంఘం ఎల్లారెడ్డి మండల కోశాధికారి దుర్గా సింగ్ లక్ష్మణ్, మరియు కార్మిక సంఘం ఎల్లారెడ్డి మండల సలదారుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి వేళ పెద్దపల్లి పట్టణం పరిసరాల్లో పోలీస్ కమీషనర్ ఆకస్మిక తనిఖీ



▶ అర్ధరాత్రి వేళ పెద్దపల్లి పట్టణం పరిసరాల్లో పోలీస్ కమీషనర్ ఆకస్మిక తనిఖీ

**చట్టం రామగుండం కమిషనరేట్:** రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, బుధవారం అర్ధరాత్రి పెద్దపల్లి లోని సాగర్ రోడ్డు ప్రాంతం లో పెద్దపల్లి పోలీస్ లు నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం ను, ఎల్లమ్మ చెరువు కట్ట ప్రాంతం, మున్సిపాల్ కాంప్లెక్స్ ఏరియా ప్రాంతాలను,పట్టణంలో ని ఏటీమ్ సెంటర్ లను ఆకస్మికంగా సందర్శించారు. అర్ధరాత్రి సమయంలో బయట తిరుగుతున్న వారిని ఆపి వారితో మాట్లాడడం జరిగింది. ప్రధానంగా శాంతి భద్రత పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న ముందస్తు చర్యల్లో భాగంగా స్థానిక పోలీసులు చేపడుతున్న పోలీస్ పెట్రోలింగ్ తోపాటు, రాత్రి సమయంలో అనుమానాస్పదంగా తిరిగే వారి గురించి, గంజాయి, మద్యం సేవించి తిరిగే ఆకతాయిల గురించి, ఎల్లమ్మ చెరువు కట్ట వద్ద నుండి డ్రోన్ ద్వారా ఆ చుట్టూ ప్రక్కల ప్రాంతాలలో ఎవరైనా ఉన్నారా అని పరిశీలించడం జరిగింది. ఎటిఎం సెంటర్ లను సందర్శించి అలారం సిస్టమ్, సిసి కెమెరాల పని తీరు, ఇతర భద్రత విషయాలపై సెక్యూరిటీ గార్డ్ తో మాట్లాడి అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. అదేవిదంగా పెద్దపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని బ్యాంకులలో అలారం సిస్టం, సీసీ కెమెరాలు పనితీరు, సెక్యూరిటీ గార్డ్స్, ఇతర భద్రత పరమైన ఏర్పాట్లు సరిగా ఉన్నాయా లేదా అనేది స్వయంగా వెళ్లి తనిఖీ చేసి సంబంధించిన అధికారులతో మాట్లాడి భద్రత చర్యలు సరిగా లేని బ్యాంకులలో ఏర్పాటు చేసే విధంగా చూడాలని అధికారులను ఆదేశించడం జరిగింది. ప్రభుత్వ నిబంధనలు అనుసరించి మద్యం షాపులు, ఇతర వ్యాపార సంస్థలు పాటిస్తున్న సమయపాలనపై పోలీస్ కమిషనర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

## మిడవల్లి పట్టాభి సేవలు ఎనలేనివి



**చట్టం, భూపాల్ పల్లి ప్రతినిధి :** విద్యా రంగంలో పట్టాభి సేవలు ఎనలేనివి అని తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కామిడి సతీష్ రెడ్డి అన్నారు. ఓడితల గ్రామములో పుట్టి జడల్ పేటలో చదివి ఉపాధ్యాయ వృత్తిలో సుమారు 42 ఏళ్ళు వివిధ పాఠశాలల్లో చేసి ఎంతో మందిని బావి బారత పౌరులుగా తయారు చేసిన ఘనత వారికే దక్కుతూ వుందని అన్నారు. గీసుకొండ ఉన్నత పాఠశాలలో పదవీ విరమణ సందర్బముగా వారిని సన్మానించారు. పట్టాబి సార్ వృత్తి ని దైవంగా భావించే వారని గోర్లవీడు చెల్పూర్ శ్యాంపేట్ ఇస్సిపేట నడికూడ గీసుకొండ పాఠశాలలో సేవలు చేశారని వృత్తిలో ఎన్నో పురస్కారాలు పొంది గొప్ప వ్యక్తి గా గుర్తింపు పొందారని గణిత ఉపాధ్యాయునిగా గుర్తింపు పొందారని వారి శిష్యులు జాతీయ అంతర్జాతీయ స్థాయిల్లో రాణిస్తూ వున్నారని అన్నారు. అందరి ఆదరాభిమానాలు పొందిన వారు ఉపాధ్యాయ వృత్తి లో లెజెండ్ అని అన్నారు. కల్మషం లేని వారని సామాజిక సేవలో వారికి వారే సాటి అన్నారు. వారితో వారి శిష్య బృందం మందల రఘునాథ్ రెడ్డి దాసరి రవీందర్ రెడ్డి పింగిలి రవీందర రెడ్డి ఉన్నారు.

## ట్రేడింగ్ ఇన్వెస్ట్మెంట్ పేరుతో మోసం


**చట్టం రామగుండం కమిషనరేట్:** ట్రేడింగ్ ఇన్వెస్ట్మెంట్ పేరుతో మోసపోయిన ఒక వ్యక్తి, తేది: 01 112024 రోజున, పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన ఒక వ్యక్తి మోసగాళ్ళ చేతిలో చిక్కుకొని 57,13,332 రూపాయలు మోసపోయి సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ కి రాగా డిజి షికా గోయల్ ఆదేశాల మేరకు, రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు వెంటనే సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ యం.వెంకటరమణ డిఎస్పి కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు .ఇట్టి పరిశోధనలో డిఎస్పి,జె.క్రిష్ణమూర్తి ఇన్స్పెక్టర్, పోలీస్ సిబ్బంది అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడుని నపవాడి గ్రామం,రహతా మండలం,ఆహుల్యానగర్ ఓల్డ్ అహ్మద్నగర్ జిల్లా,మహారాష్ట్ర నందు పట్టుకొని విచారించగా అతని పేరు శుభం నవనాథ్ షెల్కే నపవాడి గ్రామం,రహతా మండలం, ఆహుల్యానగర్ ఓల్డ్ అహ్మద్నగర్ జిల్లా, మహారాష్ట్ర , ఇతడు జల్సాలకు అలవాటుపడి సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో టెలిగ్రామ్ లో పరిచయమైన ఒక వ్యక్తికి ఇతడి పేరు మీద అకౌంట్ ఓపెన్ చేసి అకౌంట్ పాస్ బుక్, ఎ.టి.ఎం అతనికి ఇచ్చి, ఈ అకౌంట్ ఇచ్చినందుకు గాను నెలకు 5000 రూపాయలు కమిషన్ తీసుకుంటూ ఇలా వచ్చిన డబ్బులను అతని అవసరాలకు జల్సాలకు వాడుకుంటున్నాడు. ఆ నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడిషియల్ రిమాండ్ కు పంపించడం జరిగిందని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ యం.వెంకటరమణ డిఎస్పి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఎవరు కూడా ఆన్లైన్ గేమ్స్,ట్రేడింగ్ ఇన్వెస్ట్మెంట్ , లోన్ యాప్స్ , డిజిటల్ అరెస్ట్ , మల్టీ లెవెల్ మార్కెటింగ్ , క్రిప్టో కరెన్సీ , ఫెడెక్స్ కొరియర్ ఫ్రాడ్స్ , ఓటిపి, ఓఎల్ఎక్స్ ఫ్రాడ్స్ లను నమ్మి మోసపోకూడదు, సులభంగా డబ్బులు వస్తాయని నమ్మి ఎటువంటి ఆన్లైన్ యాప్స్ లో డబ్బులు ఇన్వెస్ట్మెంట్ చేయకూడదని, సైబర్ మోసాలకు గురవకుండా జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

## బాలల పరిరక్షణ కమిటీ సమావేశం




**చట్టం, శంకరపట్నం :** శంకరపట్నం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల బాలల పరిరక్షణ కమిటీ సమావేశం ఎంపీడీవో కృష్ణ ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశంలో మండలంలోని బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నివారణ, బడి మానేసిన పిల్లలను గుర్తించడం, బాల కార్మికుల సమస్యలు, దత్తత ప్రక్రియ, పిల్లల రక్షణ మరియు సంరక్షణ వంటి కీలక అంశాలపై సీడీపీఓ శ్రీమతి చర్చించారు.ఈ సమావేశంలో పాల్గొన్న అధికారులు బాలల హక్కుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలు, బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలు, బడి మానేసిన పిల్లలను తిరిగి బడిలో చేర్పించడం, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడం, దత్తత ప్రక్రియను సులభతరం చేయడం, పిల్లల రక్షణ మరియు సంరక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. బాలల సంక్షేమం కోసం తమవంతు కృషి చేస్తామని అంగన్వాడీ కార్యకర్తలు సుమలత, కమల మరియు ఇతర కమిటీ సభ్యులు తెలిపారు.ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడానికి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు. ఈ సమావేశంలో మండల అభివృద్ధి అధికారి కృష్ణ ప్రసాద్, తహశీల్దార్ భాస్కర్, సీడీపీఓ శ్రీమతి, మండల విద్యాధికారి ఎంఈఓ లక్ష్మీనారాయణ,ఏఎస్ఐ సుధాకర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీహెచ్ సి డాక్టర్ శ్రవణ్ కుమార్, ఎ ఎల్ ఓ చందన, ఐసీడీస్ సూపర్వైజర్లు అరుణ, పద్మ, డీసీపీ యు సిబ్బంది శాంత, సాదినేని రమేష్, సాయి కిరణ్, గౌడ్, ఏపీఎం సుధాకర్, శాంత తదితరులు పాల్గొన్నారు.

## మద్యం షాపులో చోరికి యత్నం..



**చట్టం, శంకరపట్నం :** మొలంగూర్ గ్రామంలో బుధవారం అర్ధరాత్రి మద్యం దుకాణంలో చోరీకి యత్నం ఘటన వివరాలు శంకరపట్నం మండల పరిధిలోని మొలంగూర్ గ్రామ శివారులోని ఓ వైన్ షాప్ లో గుర్తుతెలియని వ్యక్తులు వైన్స్ దుకాణం పైకప్పు తొలగించి లోపలికి ప్రవేశించారు. దుకాణానికి విద్యుత్ సరఫరా నిలిపివేసి, సీసీ కెమెరాలు, వీడీఆర్ బాక్స్, ఇన్వర్టర్ ధ్వంసం చేశారు. వీడీఆర్ బాక్స్, రెండు బీరు సీసాలు ఎత్తుకెళ్లారని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.మొలంగూర్ గ్రామ శివారులోని మద్యం దుకాణం బుధవారం అర్ధరాత్రి చోరీకి యత్నం సీసీ కెమెరాలు, వీడీఆర్ బాక్స్, ఇన్వర్టర్ ధ్వంసం, రెండు బీరు సీసాలు, వీడీఆర్ బాక్స్ చోరీ ఘటన స్థలానికి స్థానిక ఎస్సై కొత్తపల్లి రవి, క్లూస్ టీం, సీఐ స్వర్ణ జ్యోతి విచారణ చేస్తున్నారు.

# కాంగ్రెస్‌పై అసంతృప్తి – గ్రామాల్లో పట్టు కోల్పోతున్న హస్తం

- బీఆర్ఎస్ పునరుద్ధరణ – వ్యూహాత్మక అడుగులు
- తెలంగాణ పల్లెల్లో రాజకీయ మార్పు – బీఆర్ఎస్ బలం పెంచుకుంటుందా?
- వాగ్దానాల్లో విఫలమవుతున్న కాంగ్రెస్ – బీఆర్ఎస్ వ్యూహం ఫలిస్తుందా?"




**చట్టం, షాద్ నగర్ ప్రతినిధి దిర్షిణం శంకర్ :–** తెలంగాణలో గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ సమీకరణాలు మారుతున్న సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమవుతున్నట్లు గ్రామస్థాయిలో ప్రజల నుంచి వస్తున్న స్పందనలు సూచిస్తున్నాయి. రైతు రుణమాఫీ, రైతు బంధు, గృహలక్ష్మీ వంటి పథకాలను సకాలంలో అమలు చేయకపోవడంతో గ్రామీణ ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. ఈ పరిస్థితి కాంగ్రెస్‌కు పెను సవాలుగా మారుతుంది, అదే సమయంలో బీఆర్ఎస్‌కు తిరిగి పుంజుకునే అవకాశాన్ని కల్పిస్తోంది.

**కాంగ్రెస్‌పై అసంతృప్తి – గ్రామాల్లో పట్టు కోల్పోతున్న హస్తం**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో స్పష్టమైన పురోగతి కనిపించడం లేదు. రైతులకు సాగునీరు సకాలంలో అందకపోవడం, పంటలు ఎండిపోవడం, రుణమాఫీ వాగ్దానం ఆలస్యం కావడం వంటి సమస్యలు ప్రజల్లో నిరాశను కలిగిస్తున్నాయి. గ్రామసభల్లో ప్రజలు కాంగ్రెస్ నాయకులను, అధికారులను నిలదీస్తూ తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ అసంతృప్తి కాంగ్రెస్‌కు గ్రామీణ ప్రాంతాల్లో బలాన్ని కోల్పోయే ప్రమాదాన్ని తెచ్చిపెడుతోంది.

**బీఆర్ఎస్ పునరుద్ధరణ – వ్యూహాత్మక అడుగులు**

గత ఎన్నికల్లో ఓటమి తర్వాత కొంత వెనుకబడిన బీఆర్ఎస్, ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో తిరిగి పట్టు సాధించేందుకు కసరత్తు చేస్తోంది. కేసీఆర్ నేతృత్వంలో పార్టీ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ, ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమాలను చురుకుగా నిర్వహిస్తున్నారు. గ్రామస్థాయి నాయకులను సమన్వయం చేసుకుని, రైతు సమస్యలపై ప్రజా సమావేశాలు నిర్వహిస్తూ, తమ పాత బలాన్ని పునరుద్ధరించే ప్రయత్నంలో ఉన్నారు. అసెంబ్లీలోనూ రైతు రుణమాఫీ, సాగునీటి సమస్యలపై నిరసనలు చేస్తూ ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతున్నారు.త్వరలో జరగనున్న సర్పంచ్ ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని, బీఆర్ఎస్ స్థానిక సంస్థల్లో తమ ఆధిపత్యాన్ని తిరిగి స్థాపించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. గతంలో తమ హయాంలో చెరువులు, కుంటలు నీటితో నిండి పంటలు సమృద్ధిగా పండిన విషయాన్ని గుర్తు చేస్తూ, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రైతుల దుస్థితిని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.

**రైతు వర్గంలో నమ్మకం తగ్గుదల – బీఆర్ఎస్‌కు అవకాశం**

రైతులు తెలంగాణ రాజకీయాల్లో కీలక శక్తిగా ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయకపోవడంతో, ఈ వర్గంలో నమ్మకం సన్నగిల్లుతోంది. ఈ పరిస్థితిని బీఆర్ఎస్ తనకు అనుకూలంగా మలచుకునేందుకు ప్రయత్నిస్తోంది. గతంలో రైతు బంధు, సాగునీటి సౌకర్యాల్లో బీఆర్ఎస్ చూపిన చొరవ ఇప్పటికీ గ్రామీణ రైతుల మదిలో ఉంది. ఈ బలాన్ని ఆధారం చేసుకుని, ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, తిరిగి మద్దతు సంపాదించే దిశగా అడుగులు వేస్తోంది.

**రాజకీయ సమీకరణాలు – గ్రామీణ ఓటర్ల తీర్పు కీలకం**

ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తన వాగ్దానాలను నెరవేర్చడంలో విఫలమైతే, గ్రామీణ తెలంగాణలో బీఆర్ఎస్ మరింత బలపడే అవకాశం ఉంది. సర్పంచ్ ఎన్నికలు, ఉప ఎన్నికలు ఈ రెండు పార్టీల బలాన్ని పరీక్షించే కీలక సమయంగా మారనున్నాయి. గ్రామీణ ఓటర్లు తమ అసంతృప్తిని ఓటుగా మార్చితే, కాంగ్రెస్‌కు ఇది పెద్ద ఎదురుదెబ్బ కాగలదు, అదే సమయంలో బీఆర్ఎస్‌కు పునరుజ్జీవానికి మార్గం సుగమం కావచ్చు.రాజకీయ విశ్లేషకులు గమనిస్తున్నట్లుగా, గ్రామీణ తెలంగాణలోని ప్రజల తీర్పు రాష్ట్ర రాజకీయ భవిష్యత్తును నిర్ణయించనుంది. కాంగ్రెస్ తన వైఫల్యాలను సరిదిద్దుకుని ప్రజల విశ్వాసాన్ని చూరగొంటే తప్ప, బీఆర్ఎస్ తిరిగి రాజకీయ కేంద్ర బిందువుగా మారే సంకేతాలు కనిపిస్తున్నాయి.

## దేవాలయ అభివృద్ధికి ఇనగాల చారిటబుల్ ట్రస్టు ద్వారా విరాళాన్ని అందించిన కుడా చైర్మన్



**చట్టం / పరకాల ;** సంగెం మండలం కాట్రపల్లి వడ్డెర గూడెంలో నూతనంగా నిర్మించిన శ్రీ పోచమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి పాల్గొని దేవాలయాల అభివృద్ధికి ఇనగాల చారిటబుల్ ట్రస్టు సహకారంతో 50,000 విరాళంగా అందించారు. ఈ సందర్భంగా కుడా చైర్మన్ మాట్లాడుతూ ఆధ్యాత్మికతను ప్రోత్సహించేందుకు, దేవాలయాల అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. ప్రజలందరూ భగవంతుడి కృపతో సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం దేవాలయాల నిర్వాహకులు, మండల అధ్యక్షులు చొల్లేటి మాధవ రెడ్డి మరియు ఇతర నాయకులు చైర్మన్ ని శాలువాతో సన్మానించారు.

## బీసీ హక్కుల సాధన – బీసీ సేన స్పష్టమైన కార్యాచరణ

- ఐక్య బలం, ఉద్యమమే మార్గం – బీసీ సేన ప్రతిజ్ఞ
- షాద్ నగర్‌లో బీసీ సేన సమావేశంలో భవిష్యత్తు ప్రణాళిక




**చట్టం, షాద్ నగర్ ప్రతినిధి:–** బీసీ హక్కుల పరిరక్షణ, అభివృద్ధి కోసం బీసీ సేన ఐక్యంగా ముందుకు సాగాలని భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలను రూపొందిస్తూ పలు నిర్ణయాలతో షాద్ నగర్ బీసీ సేన కార్యాలయంలో నియోజకవర్గ సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశాన్ని బీసీ సేన నియోజకవర్గ అధ్యక్షుడు చంద్రశేఖర్ అప్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. బీసీ హక్కుల సాధనకు ఐక్య పోరాటం అవసరం ఈ కార్యక్రమానికి బీసీ సేన రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు పసుపుల ప్రశాంత్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై, బీసీల సామాజిక, రాజకీయ అభ్యున్నతిపై కీలక వ్యాఖ్యలు చేశారు.బీసీ హక్కుల పరిరక్షణ, ప్రగతికి బీసీ సేన అన్ని స్థాయిల్లో కృషి చేస్తోంది. ఈ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడానికి అందరూ ఒకే తాటిపై రావాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమానికి ప్రత్యేక కార్యచరణ ఈ సందర్భంగా, భవిష్యత్తులో బీసీ హక్కుల సాధన కోసం మరిన్ని కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందించాలనే అంశంపై సభ్యులు చర్చించారు.ఈ సమావేశం బీసీల హక్కులను బలోపేతం చేయడం, రాజకీయంగా బీసీలకు మరింత సమర్థవంతమైన ప్రాతినిధ్యం కల్పించడం అనే లక్ష్యంతో ముగిసింది. బీసీ సంక్షేమం కోసం మరో కీలక అడుగు వేసిన బీసీ సేన, త్వరలో మరిన్ని కార్యక్రమాలను అమలు చేయనుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో భూషణ్ నరేష్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి,చందూలాల్ కోశాధికారి,మేకల వెంకటేష్ పరుఖ్ నగర్ మండల అధ్యక్షుడు,శివ ముదిరాజ్ యువత ఉపాధ్యక్షుడు,రవి మల్కాపూర్ ప్రధాన కార్యదర్శి,పద్మ వెంకటేష్ బీసీ టౌన్ యూత్,వరలక్ష్మి అసెంబ్లీ మహిళా అధ్యక్షురాలు,భాగ్యలక్ష్మి టౌన్ అధ్యక్షురాలు,సౌజన్య ప్రధాన కార్యదర్శి,మమత ప్రచార కార్యదర్శి,విజయలక్ష్మి ఉపాధ్యక్షురాలు సమావేశంలో పాల్గొన్నారు.

## అధిక వడ్డీలు వసూలు చేస్తున్న వారిపై కేసు నమోదు





**చట్టం బిచ్కుంద;** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం బిచ్కుంద మండల కేంద్రంలో అధిక వడ్డీలు వసూలు చేస్తున్న వారిపై కేసు నమోదు అయినట్లు ఎస్సై మోహన్ రెడ్డి తెలిపారు ఇందులో భాగంగా బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన శ్రీరామ్ వీర్ కుమార్ తండ్రి బాలయ్య, పడగల లక్ష్మణ్ తండ్రి వీరయ్య, ఎన్ వర్ అశోక్ సార్, తండ్రి కిష్టయ్య అనువారు అధిక వడ్డీలకు ప్రామిసరీ నోటీస్ పైన లేదా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ కుదువ పెట్టుకుని పేదవాళ్లకు డబ్బులు ఇస్తూ మోసం చేస్తున్నారని నమ్మదగిన సమాచార మేరకు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు వారి ఇండ్లలో సోదాలు చేసి వారి దగ్గర ఉన్న అధిక వడ్డీలకు ఇస్తున్న పేపర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరిగిందన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అధిక వడ్డీలకు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకొని కేసు నమోదు చేస్తామన్నారు

## కోనాయమాకుల లిఫ్ట్ ఇరిగేషన్ కు పెండింగ్ నిధులు కేటాయించి, ప్రారంభించాలి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



**చట్టం / పరకాల ;** కోనాయమాకుల లిఫ్ట్ ఇరిగేషన్ కు పెండింగ్ నిధులు కేటాయించి, ప్రారంభించాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. గీసుకొండ మండలం కొనాయమాకుల లిఫ్ట్ ఇరిగేషన్ కు పెండింగ్ నిధులను మంజూరు చేయాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. ఈరోజు అసెంబ్లీలో ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 2007 లో శంకుస్థాపన చేశారని,లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ఇప్పటికే 95 శాతం వరకు పూర్తయ్యాయని అన్నారు. సబ్ స్టేషన్ నిర్మాణ పనులు పెండింగ్లో ఉందని అన్నారు.లిఫ్ట్ ఇరిగేషన్ ను మే నెలలో ప్రారంభించడానికి సిద్ధంగా ఉందని,రాష్ట్ర ప్రభుత్వం సాగు, తాగునీటిరంగాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. లిఫ్ట్ ఇరిగేషన్ పనులు త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని కోరారు.

## కోరుట్ల ఏరియా ఆసుపత్రిని సందర్శించిన కేంద్ర బృందం



**చట్టం,కోరుట్ల ప్రతినిధి :** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణం కేంద్ర ప్రభుత్వ ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ ప్రతినిధులు, డాక్టర్ రమణ, డాక్టర్ శ్రీనివాస్ లు గురువారం కోరుట్ల పట్టణ ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, సిబ్బదితో సమావేశం ఏర్పాటు చేసి ఆరోగ్య కార్యక్రమాల అమలు, సిబ్బంది నియామకం, నిధులు వినియోగం గురించి చర్చించారు. కేంద్రంలో జాతీయ స్థాయిలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ఎలా నడుస్తున్నాయని పరిశీలించారు. ఏరియా ఆసుపత్రి ద్వారా లబ్ధిపొందిన వివిధ వ్యక్తులను కలిసి ఆరోగ్య సేవలు అందుతున్న విధానాన్ని వారితో ముఖముకి సంభాషణద్వారా తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతులు, ల్యాబ్ సేవలు, గర్భిణీలకు, ప్రసవ అనంతరం తల్లులకు అందించే సేవలు, పిల్లల వ్యాధినిరోధక టీకాలు, యుక్తవయస్సు వారికి ఆరోగ్యము, ప్యూబార్టి సమయంలో వచ్చే మార్పులు, వారికి కౌన్సిలింగ్ చేయడం, అసంక్రమిత వ్యాధులకు, సంక్రమిత వ్యాధులకు అందించే సేవలను, మందుల నిలువలు, నిధుల వినియోగం గురించి క్షుణ్ణంగా సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలు, ఆరోగ్య సేవల పట్ల సంతృప్తి వ్యక్తపరిచారు. అనంతరం ఐసిటిసి సెంటర్, టిబీ యూనిట్లను సందర్శించి ఆన్ హ్యాండ్ క్షయ వ్యాధిగ్రాస్తుల కేసులు ఎన్ని ఉన్నాయి? వారందరికీ చికిత్స అందించే కార్డ్స్ ఉన్నాయా లెవా అని సరిచూశారు. నిక్షయ పోషణ యోజన క్రింద వారందరికీ డబ్బులు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలా ప్రిజంటివ్ టెస్టింగ్ ఎక్కువగా జరిగేలా చూడాలని తర్వాత ఏ ఒక్క టిబీ కేసు తప్పిపోకుండా చికిత్స అందించబచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వినోద్ కుమార్, డాక్టర్ లక్ష్మి, ఈఎన్టీ డాక్టర్ రమేష్, జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా ప్రోగ్రాం అధికారి తులసి రవీందర్, హెచ్ ఈ తరాల శంకర్, సూపర్వైజర్ బి మురళీధర్, సీనియర్ ఫార్మసిస్ట్ ఉదయ్ ప్రసాద్, టిబీ సూపర్వైజర్ ఇమ్రాన్, రియాజ్, ఆంజనేయులు, ఆకుల మల్లికార్జున్, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## కేటీఆర్ పై అట్రాసిటీ కేసు నమోదు చేయడం దుర్మార్గం

- మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



**చట్టం, వికారాబాద్ ప్రతినిధి :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై అట్రాసిటీ కేసు నమోదును మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా కేసు నమోదు చేయడం దుర్మార్గం మని అన్నారు. ప్రభుత్వం మీద ప్రజల్లో వచ్చిన వ్యతిరేకతను తట్టుకోలేక ఈ కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతుందని అన్నారు. కేసులు పెట్టి అక్రమంగా అరెస్టులు చేయడమేనా మీ పాలన?మీకు పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి చేతకావడం లేదు. దాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఈ కేసులు పెడుతున్నారు.కేసులు పెట్టాల్సి వస్తే మొదటగా సీఎం రేవంత్ రెడ్డి పైన పెట్టాలి. ఎందుకంటే నిన్నమొన్నటి వరకు గురుకులాల్లో ప్రవేశాల కోసం తీవ్రంగా పోటీపడ్డ విద్యార్థులు ఇప్పుడు పాముల, తేళ్ల కాట్లకు, కలుషిత ఆహారానికి గురి అవుతూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. గురుకులాలలోని వేధింపులను భరించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. పదవ తరగతి ప్రశ్నా పత్ర లీకేజీ తతంగాన్ని బయటపెట్టినందుకు కేటీఆర్ మీద అట్రాసిటీ కేసులు పెట్టడమా? ఆయన ఏమైనా కులం పేరు పెట్టి నిందించాడా? అసలు నిందితులు ఏ కులస్తులో కూడా కేటీఆర్ కి తెలియదు.ఎన్ని నిర్బంధాలు పెట్టినా, కేసులు నమోదు చేసినా, అరెస్ట్ చేసినా ప్రజా సమస్యల పట్ల బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన ప్రశ్నిస్తూనే ఉంటుంది. కేటీఆర్ పైన పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని వికారాబాద్ జిల్లా తరపున డిమాండ చేస్తున్నామని అన్నారు.

## అగ్ని వీర్ కు ఓని గ్రామ యువకుడు ఎంపిక




**చట్టం, బాసర :** నిర్మల్ జిల్లా బాసర మండల పరిధిలోని ఓని గ్రామానికి చెందిన యువకుడు సైనికుడిగా ఎంపిక అయ్యారు. ఇండియన్ ఆర్మీ అగ్నివీర్ ఫలితాలను విడుదల చేసిన జాబితాలో బాసర మండలం పరిధిలోని ఓని గ్రామానికి చెందిన నేరడి సుజాత కుమారుడు నేరడి యోగేష్ ఎంపికయ్యారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన యోగేష్ చిన్నప్పటి నుండి చదువులో చురుకుగా ఉంటు పదవ తరగతి వరకు జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల కౌటాలో, ఇంటర్ ప్రభుత్వ బాలుర కళాశాలనిర్మల్ లో విద్యనభ్యాసించారు. పల్లి సుజాత ఒంటరి మహిళగా ఉంటూ తమ కుమారుడిని చదివించి ఆమె తమ నిత్యజీవితంలో భాగంగా కూలి నాలి చేసి పుటగడవని స్థితిలో ఉన్న కుటుంబం పని చేస్తేనే కడుపు నింపుకొని నిత్యం కూలినాలి చేస్తూ తమ బ్రతుకు నావ గడుపుతున్న తరుణంలో విధంగా ఉన్న ఈ కుటుంబం నుండి సైనికుడిగా సేవాలాందించాలని పట్టుదలతో కష్టపడి ఇటికేలకు కొడుకుని ఉద్యోగం సాధించేలాచేసి కలను సాకారం చేసుకున్నారు.యోగేష్ చదువులకోసం మామయ్యలు ప్రసాద్,పండరీలు చేదోడువాదోడుగా నిలిచారు. అల్లుడు సైనికుడిగా ఎంపికైనందున హర్షం వ్యక్తం చేస్తున్నారు.తమ గ్రామం నుంచి మొదటి సారి ఆర్మీ ఉద్యోగం సంపాదించిన యోగేష్ కి ఓని గ్రామ ప్రజల తరుపున వారి బంధుమిత్రులు స్నేహితులు ఉపాధ్యాయులు గ్రామస్తులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలను సందర్శించిన సబ్ కలెక్టర్



**చట్టం రెంజల్ :** రెంజల్ మండలం సాటాపూర్ మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాల, ఉర్దూ మీడియం పాఠశాలలను గురువారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతి సందర్శించారు. పాఠశాలలోని రికార్డులను తనిఖీ చేశారు ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విధులకు హాజరుకావాలని సూచించారు. అభ్యాసన సామర్థ్యాలను, మిడ్ లైన్ టెస్ట్ లో తక్కువ మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాల ఆవరణలో సూచి శుభ్రత పాటించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల్లో నైపుణ్యాన్ని గుర్తించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థిని, విద్యార్థులు చదువుతోపాటు క్రీడ రంగాలలో రాణించే విధంగా ఉపాధ్యాయులు కృషి ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవి, పిఆర్టియు సెక్రటరీ శ్రీనివాసరెడ్డి, తాహిర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## భక్తి, సేవా స్ఫూర్తికి నిలయంగా ఇఫ్తార్ విందు

- కొత్తపేట మస్జిద్, డి.ఓ.డి సొసైటీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ వేడుకలు
- ఆధ్యాత్మిక జీవితమే గొప్పదని జర్నలిస్ట్ కేపీ ప్రకటన



**చట్టం, షాద్ నగర్ ప్రతినిధి:–** కేశంపేట మండలంలోని కొత్తపేట గ్రామంలో గురువారం సాయంత్రం స్థానిక మస్జిద్‌లో మైనార్టీ సోదరుల కోసం ఇఫ్తార్ విందు అత్యంత ఘనంగా జరిగింది. అదే విధంగా, గ్రామంలోని డి ఓ డి ఎడ్యుకేషనల్ సొసైటీలో విద్యార్థులకు కూడా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ సీనియర్ జర్నలిస్ట్, టీయూడబ్ల్యూజే 143 రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.డి ఖాజాపాషా (కేపీ) ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా జర్నలిస్ట్ కేపీ మాట్లాడుతూ...సమాజంలో ఆధ్యాత్మిక జీవితమే ఎంతో గొప్పది. ఇఫ్తార్ విందు వంటి కార్యక్రమాలు అందరిలో ఆత్మీయత, ఆప్యాయత, ఐక్యమత్యాన్ని పెంపొందిస్తాయి. పవిత్ర రంజాన్ మాసంలో కఠిన నియమాలతో ఉపవాస దీక్షలు చేపట్టడం మైనార్టీ సోదరులలోని భక్తి, సంకల్పానికి నిదర్శనం అని అన్నారు. కొత్తపేట గ్రామంతో తనకు విడదీయలేని ఆత్మీయ అనుబంధం ఉందని, ఈ ప్రాంతంలో జరిగే సామాజిక కార్యక్రమాలు ఎల్లప్పుడూ ప్రత్యేకమైనవని ఆయన తెలిపారు.డి ఓ డి ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకుడు రఫీక్ సేవలను కేపీ కొనియాడారు. ఎంతోమంది నిరుపేద, అణగారిన విద్యార్థులకు ఉచిత హాస్టల్ సౌకర్యం కల్పిస్తూ, ప్రభుత్వ విద్యతో పాటు అరబీ విద్యను అందిస్తున్న రఫీక్ పనితీరు అభినందనీయం. దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యా సేవలు అందించడం గర్వకారణం అని ఆయన పేర్కొన్నారు.

## ఆస్తి పన్ను 90 శాతం రాయితీని వినియోగించుకోవాలి



**చట్టం, భీంగల్ :** నిజామాబాద్ జిల్లా భీంగల్ పట్టణ పరిధిలోగల స్థానిక మున్సిపల్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ఆస్తి పన్ను వడ్డీ రాయితీ 90శాతం ఇచ్చినందున పట్టణంలోని పెద్ద మొత్తంలో ఉన్న బకాయి దారుల నుండి ఆస్తిపన్ను ని చెల్లించడం జరిగిందని మునిసిపల్ కమిషనర్ గోపు గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు . ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ .. ఈనెల 31 వరకు ఇట్టి అవకాశాన్ని కల్పించినందున పట్టణ ప్రజలందరూ ఇట్టి అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఆస్తి పన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. ఇట్టి అవకాశం ఇంకా నాలుగు రోజులు ఉన్నందున అందరూ ఉపయోగించుకోవాలని కోరారు. సహస్ర ఫంక్షన్ హాల్ ఓనర్ రూ.4, 78, 000 ఆస్తి పన్ను చెల్లించడం జరిగింది. మరియు కృష్ణవేణి టాలెంట్ హై స్కూల్ వారు యజమాన్యం రూ.56, 000 చెల్లించడం జరిగిందని తెలిపారు. పట్టణంలో వివిధ వారి నుండి ఆస్తి పన్ను మొత్తం ఏడు లక్షలు ఆస్తి పన్ను వసూలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది లు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## సాదా సిదాగా మహాజన సభ



**చట్టం,పెద్ద కొడప్గల్ :** మండల కేంద్రలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో గురువారం సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ సి.ఈ.ఓ సందీప్ సొసైటీ ద్వారా జరిపిన ఆదాయ వ్యయాల గురించి సభలో చదవి వినిపించారు.అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. రైతులు తీసుకున్న రుణాలను చెల్లించి సంఘం అభివృద్ధికి పాటుపడాలని సూచించారు.సొసైటీ పరిధిలో ఉన్న గ్రామాల్లో జొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సభలో తీర్మానం చేశారు. గతంలో ఒక ఎకరానికి 9 క్వింటాల జొన్న మాత్రమే కొనుగోలు చేశారని. కానీ దానికి 25 క్వింటాలు వరకు ప్రభుత్వం కొనుగోలు చేయాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. దింతో ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చైర్మన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ పండుగ సందర్భంగా డివిజన్ పరిధిలోని పలు ఈద్గా లను పరిశీలించిన కార్పొరేటర్...



**చట్టం / పరకాల ;** వరంగల్ మహానగర పాలక సంస్థ 16వ డివిజన్ పరిధిలోని కీర్తినగర్, జాన్ పాకలలోని ఈద్గా లలో రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులు పాల్గొనే ఈద్గా లలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ సుంకరి.మనీషా శివకుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొనే ప్రార్థనలలో యిబ్బంది కలగకుండా ఈద్గా లను క్లీన్ చేసి ఎత్తు పల్లాలు వున్న దగ్గర కంకర చూర పోసి టెంట్ లు,ఈద్గా లలో రంగులు వేసే పనులు తొందరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కి సూచించారు.

## విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు చేయండి


- ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజ్ ఠాకూర్



**చట్టం, గోదావరిఖని:** అసెంబ్లీ సమావేశాల చివరి రోజు రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ పారిశ్రామిక ప్రాంతంలో విద్యుత్ పరిశ్రమ ఏర్పాటు గురించి ప్రస్తావించారు. ఎప్పుడో నిజాం కాలంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం సారథ్యంలో 62 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ను రామగుండంలో నిర్మించిందన్నారు. గత ప్రభుత్వం హయాంలో 1800 విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం అది కాకుండా యాదాద్రి కి తరలించడం విడ్డూరంగా ఉందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభం నుంచే రామగుండంలో 1800 విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు కోసం సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఇదే క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి సారధ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు సూచనలతో విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు నిర్మిస్తామని ఎనౌన్స్ చేశారన్నారు. అయితే నేరుగా రామగుండంకు వచ్చినప్పుడు కూడా 8*100 త్వరితగతిన పూర్తి చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. వెంటనే ప్లాంట్ ఏర్పాటుకు తగిన సన్నాహాలు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. ఇచ్చిన మాట ప్రకారం విద్యుత్ శాఖ లో పనిచేస్తున్న ఆర్టిజన్స్ ను రెగ్యులర్ చేయాలని కోరారు.

## అక్రమ మట్టి తవ్వకాలపై అధికారుల చర్యలేవి

- రూ.2కోట్ల ప్రభుత్వ ధనం లూటీ..
- అధికారుల అండదండలతోనే మట్టిదందా..
- గత ఎమ్మెల్యే అవినీతిపై తొడగొట్టినవారికీ హస్తం..
- అక్రమార్కులను జైలు ఊచలు లెక్కపెట్టిస్తా..
- బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సురేష్ రెడ్డి..



**చట్టం రామగుండం కమిషనరేట్:** జిల్లాలో కొనసాగుతున్న అక్రమ మట్టిదందాపై భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు తన నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావుతో పాటు ప్రభుత్వ అధికారి గిర్దావరుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గత కొంతకాలంగా ఆరుగురు ఇటుకబట్టీల యజమానులు మైనింగ్ శాఖ నుండి అనుమతి పొందిన దానికంటే ఎక్కువమొత్తంలో మట్టి తవ్వకాలు జరుపుతున్నారని, విషయం వెలుగులోకి రావడంతో కొన్ని రోజులు నిలిపివేసినట్లు చేసిన అధికారులు, మళ్ళీ అనుమతులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇచ్చిన నివేధిక ప్రకారం 70వేల మెట్రిక్ టన్నులకు గానూ లక్షా 65వేల 5వందల పది మెట్రిక్ టన్నుల మట్టిని తవ్వుకున్నారని పేర్కొన్నారు. దీనిపై ఒక్కో కంపిణీ కి రూ.38లక్షల 56వేల 3వందల ఇరవై తొమ్మిది జరిమానా విధించారని వివరించారు. జరిమానా చెల్లించకుండానే ఇటుకబట్టీల యాజమాన్యం మట్టిని తరలించడంపై సురేష్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు.

**గిర్దావరు ఆడియో ప్రదర్శన..**

అక్రమంగా తరలిస్తున్న మట్టి వాహనాలను వదిలిపెట్టాలని గిర్దావరు సిబ్బందిని ఆదేశిస్తున్న ఆడియో లీకయ్యింది. ఆడియో సంభాషణను సురేష్ రెడ్డి విలేకరుల ముందు ప్రదర్శించారు. ఎవరి అండ చూసుకొని గిర్దావరు వాహనాలను వదిలిపెట్టమని ఆదేశిస్తున్నారో తెలపాలన్నారు. గత ప్రభుత్వంలోని మాజీ ఎమ్మెల్యే అక్రమంగా ఇసుక, మట్టి దందా చేస్తూ రూ.కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నాడని, తాను గెలిచిన వెంటనే జైలుకు పంపిస్తా అంటూ తొడగొట్టిన ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రజలకు ఏం సమాదానం చెబుతారని నిలదీశారు. రూ.2కోట్ల స్కాములో ఎమ్మెల్యేకు హస్తం ఉందని ఆరోపించారు.గత మూడేళ్ళుగా ఇసుక, మట్టి తవ్వకాలపై న్యాయస్థానాల్లో అలుపెరుగని పోరాటం చేస్తున్నానని, ఇప్పటికే గ్రీన్ ట్రిబ్యునల్ కేసులో విజయం సాధించానని తెలిపిన ఆయన, అక్రమార్కులను వదిలిపెట్టబోనని సురేష్ రెడ్డి స్పష్టం చేశారు. ఇటుకబట్టీల యజమానులకు వేసిన జరిమానాను ప్రభుత్వ ఖజానాలో జమచేయాలని డిమాండ్ చేశారు. కలెక్టరు, సంభందిత అధికారులు సత్వరమే స్పందించాలని సురేష్ రెడ్డి కోరారు.

## హనుమకొండ రెడ్ క్రాస్ సేవలు అభినందనీయం – కలెక్టర్




**చట్టం /హనుమకొండ;** హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ పాలకవర్గ సమావేశం గురువారం రెడ్ క్రాస్ భవనంలో జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు పి. ప్రావీణ్య సొసైటీ చైర్మన్ డాక్టర్ విజయ్ చందర్ రెడ్డి తో కలిసి నిర్వహించారు. ప్రారంభ కార్యక్రమంలో కలెక్టర్ ని రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు పూల మొక్క అందించి సత్కరించారు. అనంతరం కలెక్టర్ రెడ్ క్రాస్ ఆవరణలో నిర్మాణంలో ఉన్న అదనపు భవనాన్ని పరిశీలించి, రెడ్ క్రాస్ కాన్ఫరెన్స్ హాల్ లో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రెడ్ క్రాస్ ఆదాయం, వ్యయాలను సమీక్షించి, పాలకవర్గ సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంలో కలెక్టర్ మాట్లాడుతూ, రక్తదాన కార్యక్రమమే కాకుండా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రెడ్ క్రాస్ పాలకవర్గం అభినందనీయమైన సేవలు అందిస్తున్నదని ప్రశంసించారు. రెడ్ క్రాస్ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని తెలిపారు.

**సన్మానం:**

రెడ్ క్రాస్ పాలకవర్గం కలెక్టర్ ని శాలువా, షీల్డ్ తో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు పెద్ది వెంకట నారాయణ గౌడ్ (వైస్ చైర్మన్), బొమ్మినేని పాపిరెడ్డి (కోశాధికారి), ఈ. వి. శ్రీనివాస్ రావు (రాష్ట్ర పాలకవర్గ సభ్యులు), పుల్లూరు వేణు గోపాల్, డా. ఎం. శేషుమాధవ్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, డా. కె. సుధాకర్ రెడ్డి, డా. హెచ్. సంధ్యారాణి, చెన్నమనేని జయశ్రీ, బిళ్ళ రమణ రెడ్డి, బాశెట్టి హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మనసున్న మారాజు మా రాజిరెడ్డి




**చట్టం కొల్చారం :** ఆపద్బాంధవుడు ఏ ఆపద వచ్చింది నేనున్నాను అంటూ ప్రతినిత్యం నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండే మనసున్న మారాజు ఆవుల రాజిరెడ్డి అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్ అన్నారు. గురువారం నాడు పీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి జన్మదినం సందర్భంగా మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో ఏడుపాయల వన దుర్గ మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండల కేంద్రమైన కొల్చారం కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు పండ్లు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం నర్సాపూర్ నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించే జన్మదిన కార్యక్రమానికి భారీగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ముత్యం గారి గోవర్ధన్, ట్రెజరర్ చందాపురం మధుసూదన్ రెడ్డి, సీనియర్ నాయకులు దేవన్న గారి శేఖర్, మైనార్టీ విభాగం నాయకుడు సయ్యద్ అక్రమ్, మాజీ సర్పంచ్ లక్ష్మీపతి, మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండోమెంట్ మాజీ డైరెక్టర్ పంతులు సంగమేశ్వర్, పోతంశెట్టిపల్లి మాజీ సర్పంచ్ నాగరాణి నర్సింలు, గడ్డమీద శ్రీను, డాక్టర్ బాలరాజ్, నాగరాజు, నాగం రమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## తండాలో గంజాయి మొక్కలు స్వాధీనం



**చట్టం గాంధారి :** కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని జెమిని తండాలో 10 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకోవడం జరిగింది. ముద్దాయి ధారావత్ హనుమ ను కోర్టులో హాజరు పరిచి రిమాండ్ కి తరలించడం జరిగింది. జెమిని తండాలో రెండు లీటర్ల సారా నీ సీజ్ చేసి బెల్లం పానకాన్ని ధ్వంసం చేయడం జరిగిందని కబ్కారీ సిఐ షకీర్ అహ్మద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఫోర్స్మెంట్ సిఐ స్వప్న నిజామాబాద్ ఎస్సై జగన్ మోహన్ ఎల్లారెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన నాగుర్ల



**చట్టం /పరకాల;** హనుమకొండలోని జవహర్ కాలనీ లోగల సివిఆర్ ఫంక్షన్ హాల్ లో పేర్వాల ప్రభావతి శ్రీకాంత్ కుమార్తె సాన్విక కు నూతన వస్త్ర, ఫల, పుష్పాలంకరణ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విముక్తి కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు పాల్గొని, చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జెండా రాజేష్, కౌడగాని రాంబాబు, కౌడగాని నర్సింగారావు,తేజెశ్వర్, ఓదేలు తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# చేతకాకపోతే ప్రభుత్వాన్ని రద్దు చేసి ముందుకు రావాలి

- అసెంబ్లీలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**చట్టం, నిర్మల్ ప్రతినిధి :** రాష్ట్ర పాలన చేతకాక పోతే ప్రభుత్వాన్ని రద్దు చేయాలని అసెంబ్లీలో బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. బడ్జెట్ అంటే ప్రజా సమస్యలు పరిష్కరించే ఒక ఆర్థిక హామీలా ఉండాలని హితవు పలికారు. కానీ పాలకులే బడ్జెట్ ఈ బడ్జెట్ను చూసి భయపడే విధంగా ఉందని అన్నారు. రాష్ట్రం అప్పుల్లోకి కూరుకుపోయిందని ముఖ్య మంత్రి సైతం బడ్జెట్ ను చూసి బయపడుతున్నారని ఘాటు విమర్శలు చేశారు. ఉద్యోగులకు జీతాలు చెల్లించేందుకు అప్పులు చేయాల్సివస్తుంది. కొత్త అప్పులు పుట్టడం లేదు అని స్వయంగా ముఖ్యమంత్రే చెప్తున్నారని అన్నారు. ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలను, సంక్షేమ పథకాలకు మంగళం పాడేలా ఉందని ప్రజల్లో చర్చ నడుస్తోంది. ఒకవైపు చూసుకుంటే మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించలేదు. మహిళలకు ఇస్తామన్న రూ.2500 ల ఊసే లేదు. రైతు భరోసాలో రెండు హామీల జోలికి వెళ్లలేదు, కౌలు రైతులకు రైతు కూలీలకు బడ్జెట్ లో నిధులు కేటాయించకపోవడం బాధాకరం అని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు ఇప్పటివరకు ఇవ్వలేదు.యువ వికాసం, విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, లకు నిధులు ఇప్పటివరకు సమకూర్చుకోలేదు.చేయూత నిరుద్యోగ భృతి లాంటి అంశాలకు బడ్జెట్ లో ఎక్కడ నిధులు కేటాయించలేదు. అభయహస్తం కు ఈ ప్రభుత్వం వరుసగా రెండు బడ్జెట్లలో ఎగనామం పెట్టారని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ముఖ్యమంత్రి చెప్పినట్టు ఉప్పర్ శేర్వాని అందర్ పరేషాని. మరి హామీలు ఇచ్చినపుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలిసే అడ్డగోలుగా హామీలిచ్చి, ఇప్పుడు అధికారం లోకి వచ్చాక దాటవేయడం సబబు కాదు. రాష్ట్ర పరిపాలన మరియు ఇచ్చిన హామీలు నెరవేర్చడం చేత కాక పోతే ప్రభుత్వాన్ని రద్దు చేసి ప్రజల ముందుకు రావాలని అన్నారు. రాష్ట్రానికి ప్రతీ నెల రూ.18500 కోట్ల మేర ఆదాయం వస్తుందని, అందులో ఉద్యోగుల జీతాలకు, పెన్షన్లకు రూ.6500 కోట్లు, గత ప్రభుత్వ అప్పులకు రూ.6500 కోట్లు, కాగా మిగిలేవి రూ.5500 కోట్లు అని ఇది FRBM పరిధిలోని అంశాలుగా పేర్కొన్నారు. అప్పుల అప్పారావు లా ముఖ్యమంత్రి కూడా రోటేశన్ పద్ధతిలో స్కీమ్ లకు, అభివృద్ధి కార్యక్రమాలకి నిధులు కేటాయించడం విడ్డూరం. ఇలా రాష్ట్రం అప్పుల్లో కూరుకు పోవడానికి మొదటి ముద్దాయి గత ప్రభుత్వం టిఆర్ఎస్ కారణం గత పదేళ్ళలో అరాచకాలు, ఆర్థిక విధ్వంసం చేసి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారు. అదే బాటలో నడుస్తున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రెండో ముద్దాయి అవుతుంది. కేంద్రంలో కాంగ్రెస్ ఉన్నపుడు రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంది అప్పుడు రాష్ట్రానికి ఎంత మేర నిధులు కేటాయించారు. దానికి మేం చర్చకు సిద్ధం మీరు సిద్ధామా...? ఇప్పటివరకు ఈ ప్రభుత్వం రూ.1,63,000 రూపాయల కోట్ల అప్పు చేసింది. తెలంగాణ రైజింగ్ రైజింగ్ అని అనుకుంటే అప్పుల్లో రైజింగ్ చేసారు. మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణ అప్పుల తెలంగాణ గా మారింది. అది గత ప్రభుత్వం చేసిన తప్పిదమా,లేక కళేశ్వరమా, మిషన్ భగీరథ కానీ, ఇలా అనేక పథకాలు ప్రాజెక్టుల పేరుతో లక్షల కోట్ల అప్పుచేసి అప్పుల కుప్పగా మార్చారని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం 120 సార్లు ఓవర్ డ్రాఫ్ట్ కి వెళ్లినట్టు తెలుస్తుంది.గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం, కాళేశ్వరం, మిషన్ భగీరథ ఇలా అనేక అంశాలపై ఈ ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలకు అనుమానాలు వస్తున్నాయి. కాంగ్రెస్ బిఆర్ఎస్ లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకొని ముందుకు సాగుతున్నట్లు గా అనిపిస్తుంది. మోడీ గ్యారెంటీ అంటే గ్యారంటీగా పూర్తయ్యే గ్యారెంటీ కాబట్టే కేంద్రంలో మూడోసారి ప్రజలు అధికారం ఇచ్చారు. ఇలా కాంగ్రెస్ ప్రభుత్వంలా అధికారం కోసం అడ్డగోలుగా హామీలు ఇవ్వము. అని తెలిపారు

పెండింగ్ బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల నుండి ఎన్ని పెండింగ్ బకాయిలు చెల్లించారు. ఇంకా ఎన్ని బకాయిలు ఉన్నాయి చెప్పాలి. చిన్న కాంట్రాక్టర్లకు, రిటైర్డ్ ఉద్యోగులకు, ఆరోగ్య శ్రీ కు, ఫీ రీయెంబర్స్ మెంట్ లకు ఎన్ని పెండింగ్ బిల్లులు చెల్లించారు, ఇంకా ఎన్ని బకాయిలు ఉన్నాయి. అలాగే బడా కాంట్రాక్టర్లకు ఎంత మేర బకాయిలు చెల్లించారు ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలి అని అన్నారు.

## ఎన్నికల హామీల అమలు పై కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- సిఐటియు జిల్లా కార్యదర్శి చంద్రమోహన్




**చట్టం, శంషాబాద్:** ఎన్నికల హామీల్లో కార్మికులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని సీఐటీయూ కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. గురువారం శంషాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని తొండిపల్లి హైవే రోడ్డుపై సిఐటియు ఆధ్వర్యంలో రాస్తారోకో కార్యక్రమము నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం చంద్రమోహన్ మాట్లాడుతూ... గత ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో విఫలమైందని అన్నారు. మొన్న ఆశ వర్కర్ల డిమాండ్లపై చలో హైదరాబాద్ కార్యక్రమం చేయడానికి వెళితే ఆశ వర్కర్లను ప్రభుత్వం ఎక్కడికక్కడ అరెస్టులు చేసి విచ్చలవిడిగా లాఠీచార్జ్ చేసి ఆశలను దారుణంగ కొట్టించడం ఎంతవరకు సమంజసమని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం వాళ్ల డిమాండ్లను నెరవేర్చకపోగా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోకపోగా ప్రభుత్వం మొండికేసి ప్రశ్నించే గొంతును నొక్కిన ఈ ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని అన్నారు. నిజంగా ప్రభుత్వం కార్మికులకు పేదలకు సరియైన సేవలు అందించాలంటే ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని అన్నారు. గత ఎన్నికల సందర్భంగా పేదలకు ఇల్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని అదే రకంగా గతంలో ఇచ్చిన ఇండ్ల పట్టాలు ఇచ్చి ఇంటి స్థలం చూపించకుండా రామోజీ ఫిలిం సిటీ లో ఇచ్చిన ఇంటి స్థలాలను రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యానికి ఈ ప్రభుత్వం కట్టబెట్టింది తీరా ప్రభుత్వాన్ని మా పట్టాలకు స్థలాలు చూపెట్టాలని అడిగితే అతి దారుణంగా ఇల్లు లేనటువంటి పేద ప్రజలను లాఠీచార్జ్ చేసి పోలీసులచే కొట్టించి ఈ ప్రభుత్వం పేదల ప్రభుత్వ మా లేదా పెద్దోళ్ల ప్రభుత్వమా అని ప్రశ్నించారు వెంటనే ప్రభుత్వం స్పందించి పేదలకు ఇచ్చినటువంటి ఇంటి పట్టాల ఇంటి స్థలాన్ని కేటాయించి ఇవ్వాలని అలాగే ఆశాలకు ఫిక్స్ వేతనం రూ.18 వేల రూపాయలు ఇన్సూరెన్స్ ఈఎస్ఐ పీఎఫ్ పర్మెంటు తదితర సౌకర్యాలు కల్పించాలని అన్నారు. లేదంటే పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన పోరాటాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు జాజాల రుద్ర కుమార్, శంషాబాద్ మండల సిపిఎం పార్టీ కన్వీనర్ కేవై ప్రణయ్, ఆశా వర్కర్ల సంఘం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బి సునీత సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు నీరటి మల్లేష్, సునంద రాములు, రెహానా,తదితరులు పాల్గొన్నారు.

## వెనుకబడిన తరగతుల కమిషన్‌కి మెమోరాండం అందజేత



**చట్టం, కోరుట్ల ప్రతినిధి:** జగిత్యాల జిల్లా కేంద్రం తెలంగాణ బడుగు బలహీన వర్గాల ప్రజలు 76 సంవత్సరాలుగా వెనుకబడి ఉన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు చట్టసభల్లో 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు బీసీలకు ఇస్తున్న పథకాలు కల్పించాలని విన్నవిస్తూ తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల కమిషన్ జి. నిరంజన్ రెడ్డికి జగిత్యాల జిల్లా బీసి సంక్షేమ నాయకులు మెమొరాండం అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల వారికి ఎస్సీ, ఎస్టీ మైనార్టీల వారితో పోల్చుకుంటే 76 సంవత్సరాల నుండి అన్యాయం జరుగుతున్నది బీసీ ఎంబిసి లను బాగుపరుస్తామని చెప్పిన గత ప్రభుత్వం ఎలాంటి సబ్సిడీ రుణాలు ఇవ్వకపోగా, తెలంగాణ రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాలకు చెందిన కులవృత్తుల వారు నానా ఇబ్బందులకు గురి అయ్యారని పేర్కొన్నారు. బీసీ ల బ్రతుకులు దుర్భరంగా మారాయి. కులవృత్తులకు ఆదరణ కరువైనది. ఇప్పటికైనా మేము ప్రతిపదిస్తున్న ఈ క్రింది అంశాలను పరిగణంలోకి తీసుకోని వాటి అమలుకు చట్ట పరిధిలో చర్యలు చేపట్టుటకు కృషి చెయాలని కోరారు.పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. 1.తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కల్పించిన 42%శాతం రిజర్వేషన్లను చట్టభద్దత చేయాలి. 2,రాష్ట్రంలోని కులవృత్తులవారికి బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీతో కూడిన రుణాలు ఇవ్వాలి. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లతో 42%రిజర్వేషన్ కల్పించాలి. 3,తెలంగాణ రాష్ట్రం మాదిరిగానే దేశంలో జనగననతో పాటు కులగణన చేపట్టి చట్టభద్దత కల్పించాలి. 4,తెలంగాణ రాష్ట్రములో ఉన్న 58%శాతం బీసీలను మేమెంతో మాకంతా వాటా అనే నినాదం అమలు చేయాలి. 5,తెలంగాణ రాష్ట్రములో ఖాళీ ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి. 6,తెలంగాణ రాష్ట్రంలో 14 జిల్లాల్లోని 72 మండలాల్లో కురిసిన అకాల వర్షానికి రైతులకు ఎకరానికి 25 వేల రూపాయల చొప్పున నష్టపరిహారం చెల్లించాలి. 7,కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి. రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మినారాయణ, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు కొక్కు గంగాధర్, బీసీ యువజన సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుపురం రాంచంధర్, బీసీ మహిళా సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రాచకొండ రోజా(న్యాయవాది), బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుంటి గంగారాం, బీసీ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు దండుగుల వంశీ, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గం అధ్యక్షురాలు బండపెల్లి మల్లీశ్వరి,బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షులు రాపర్తి రవి, యూత్ కోఆర్డినేటర్ హృషికేష్, బండపెల్లి నర్సయ్య బీసీ నాయకులు తదితరులు ఉన్నారు.

## ఎంఆర్ఓ ఆఫీస్ కి పాత్రికేయులకు కు అనుమతి లేదా ...

- వివరణ కోరిన విలేకరుల పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు.





**చట్టం నారాయణఖేడ్** : సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండల తహసీల్దార్ కార్యాలయనికీ గురువారం నాడు తహసీల్దార్ కార్యాలయం ప్రవేశం ద్వారం వద్ద విలేకరులకు అనుమతి లేదంటూ గోడకు పత్రిక ను అతికించారు. ఈ ఆవిషయాన్ని పత్రిక విలేకరులు తెలుసుకొని కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ అబ్దుల్ నజీమ్ ఖాన్ ను సంప్రదించగ వారు పక్క నున్న పోలీస్ స్టేషన్ కు వెళ్లి పాత్రికేయులపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వివరాలకు వెళ్ళితే తహసీల్దార్ కార్యాలయం రోజు లెక్కకు కాకుండా రిజిస్ట్రేషన్ గుత్తల మాదిరిగా ఎలాంటి లేఔట్లకు పర్మిషన్ లేకుండానే రాత్రి వేళలో రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కార్యాలయంలో చేసే కార్యకలాపాల వివరాలు గొప్యంగా ఉండాలని ఇలాంటివి గోడకు పెడుతున్నారని, ఈ సమాచారన్ని మండల పత్రిక యూనియన్ అధ్యక్షులు విజయ్ కుమార్ తెలిపారు.

**ఆర్డిఓ అశోక్ చక్రవర్తి వివరణ**

ఆర్డీవో అశోక్ చక్రవర్తిని వివరణ కోరగా రావద్దు అనే అధికారం ఎవ్వరికి లేదని అన్నారు. అతికించిన స్టిక్కర్ను తొలగించమని చెప్పానని తెలిపారు. అడిగే స్వేచ్ఛ ప్రతి ఒక్కరికి రాజ్యాంగ కల్పించిందని ఆయన తెలియచేసారు.

## వీధిలైట్లు వెలగావాయే ఇంకెంతకాలం...



**చట్టం, కొల్చారం :** కొల్చారం మండల పరిధిలోని అప్పాజీపల్లి గ్రామంలోని 1, 2, 3, 4 వార్డులలో గత ఐదు నెలల నుండి విద్యుత్ దీపాలు లేవు. రాత్రి అయితే చాలు బయటకు రావడానికి ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి వివరణ కోరగా గ్రామపంచాయతీలో డబ్బులు లేవు అంటూ సమాధానం చెబుతున్నారు. ఇట్టి విషయంపై స్థానిక మండల అధికారులు జోక్యం చేసుకొని మాకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు వేడుకుంటున్నారు.

## ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆంగ్లం బోధన

- హర్షం వ్యక్తం చేసిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**చట్టం, వికారాబాద్ ప్రతినిధి :** ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఆంగ్ల బోధన పట్ల వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ హర్షం వ్యక్తం చేశారు. గురువారము కలెక్టరేట్ సమావేశము హాలునందు జరిగిన యంగ్ ఓరేటర్స్ క్లబ్, బొస్చ్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విద్యా కదంబం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ.. జిల్లాలో ఈ విద్యా సంవత్సరంలో ఏర్పాటుచేసిన వై ఓ సి యంగ్ ఓటర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా లో ఉన్నటువంటి ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ బోధించడం జరిగిందని , ఇంగ్లీష్ కు సంబంధించి విద్యార్థులు దారాళంగా ఇంగ్లీషు మాట్లాడడానికి ఉపాధ్యాయులు వివిధ రకాల కృత్యాలు మరియు యాక్టివిటీస్ ద్వారా ఇంగ్లీష్ నేర్పించడం జరిగిందని , ఇంగ్లీష్ మాట్లాడడానికి ఉపాధ్యాయులు బోధన జరిపించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వై ఓ సి చేస్తున్నటువంటి సేవలు కొనియాడారు. అదేవిధంగా వైఓసి క్లబ్ ద్వారా పిల్లలు ఇంగ్లీషులో మాట్లాడటం చాలా సంతోషంగా ఉందని తెలియజేశారు. రాబోవు రోజుల్లో ఇంగ్లీష్ పట్ల మరింత శ్రద్దను చూపిస్తూ పిల్లలకు ఇంగ్లీషు భాష పట్ల ఆసక్తిని కలిగించేలా భోధించాలని సూచించారు. విద్యార్థులు మాతృభాషతో పాటు ఇంగ్లీష్ భాషను కూడా కచ్చితంగా నేర్చుకుని ఉండాలని తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన నాటికను తిలకించి సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాదికారి రేణుక దేవి ,మరియు వై ఓ సి సభ్యులు, డిఆర్పీలు విద్యార్థులు పాల్గొన్నారు.

## నష్టపరిహారాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**చట్టం, వికారాబాద్ ప్రతినిధి :** కొడంగల్ నియోజకవర్గం, దుద్యాల మండలం, హకీంపేట కు సంబంధించిన పట్టా భూమి కలిగిన రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సమ్మతి తెలిపిన రైతులకు తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ లతో కలిసి గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు నష్ట పరిహార చెక్కులను జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ... పారిశ్రామిక పార్కులో భూములను కేటాయించిన రైతులకు ఓకే విడత లో నష్టపరిహార చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. భూములు కోల్పోయిన రైతులు నష్టపరిహారం ద్వారా తమ కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు.దుద్యాల మండలం, హకీంపేటలో పట్టా భూమి కలిగిన 32 మంది రైతులు 29 ఎకరాల భూమిని పారిశ్రామిక పార్క్ కు తమ భూములను కేటాయించేందుకు సమ్మతి తెలుపనైనది. పారిశ్రామిక పార్కు కు భూములను కేటాయించిన రైతులకు నష్టపరిహారం కింద రూ.5,80,00,000 కోట్ల రూపాయల చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో దుద్యాల మండలం తహసీల్దార్ కిషన్, జి సెక్షన్ సూపరింటెండెంట్ నాఫీస్ ఫాతిమా, టీ ఎస్ ఐ ఐ సి అసిస్టెంట్ మేనేజర్ అనురాధ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక
CHATTAM NEWS
@ChattamTV
శుక్రవారం
28.03.2025


# ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌కు రోహితే కెప్టెన్!

▸ **హింట్ ఇచ్చిన అగార్కర్ టీమ్**

**చట్టం, స్పోర్ట్స్:** వరుసగా మూడోసారి టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు వెళ్లే ఛాన్స్‌ను టీమ్‌ఇండియా కోల్పోయిన విషయం తెలిసిందే. ఆసీస్‌తో జరిగిన బోర్డర్ గావస్కర్ ట్రోఫీని భారత్ చేజార్చుకోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. దీంతో రోహిత్‌ను సారథిగా తప్పించాలనే డిమాండ్లూ వచ్చాయి. ప్రస్తుతం ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్‌తో క్రికెటర్లు బిజీగా ఉన్నారు. ఇది మే చివరికి ముగియనుంది. ఆ తర్వాత జూన్‌లో ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ బరిలోకి భారత్ దిగనుంది. అప్పట్నుంచే ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ నాలుగో ఎడిషన్ ప్రారంభం వుతుంది. గత రెండుసార్లు ఫైనల్‌కు చేరినా విజేతగా నిలవడంలో మాత్రం విఫలమైన టీమ్‌ఇండియా.. డబ్ల్యూటీసీ నాలుగో సీజన్‌ను ఘనంగా మొదలుపెట్టాలని భావిస్తోంది. అయితే, ఆసీస్‌తో టెస్టు సిరీస్ సమయంలోనే సుదీర్ఘ ఫార్మాట్‌కు రోహిత్ వీడ్కోలు చెబుతాడనే వార్తలు వచ్చాయి. అలాంటిదేమీ లేదని స్వయంగా హిట్‌మ్యాన్ తేల్చేశాడు. అతడిని కొనసాగిస్తారా? లేకపోతే పక్కన పెడతారా? అనేది ఇప్పుడు సెలక్టర్ల చేతిలో ఉంది. ఈక్రమంలో రోహిత్ కెప్టెన్సీతోపాటు టెస్టు భవిష్యత్తుపై అజిత్ అగార్కర్ టీమ్ ఓ కీలక హింట్ ఇచ్చినట్లు తెలుస్తోంది.



**హిట్‌మ్యాన్‌పై నమ్మకం!**

ఇంగ్లండ్‌తో సిరీస్‌కూ రోహిత్‌నే సారథ్యం వహిస్తాడని సమాచారం. న్యూజిలాండ్, ఆసీస్‌తో సిరీస్‌లను కోల్పోయినా సరే రోహిత్‌పై నమ్మకం ఉంచనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 37 ఏళ్ల రోహిత్‌ను డబ్ల్యూటీసీ 202527 వరకూ కొనసాగిస్తారా? లేదా? అనే విషయంపై మాత్రం స్పష్టత లేదు. డబ్ల్యూటీసీ నాలుగో సీజన్ ఫైనల్ 2027లో జరగనుంది. వన్డే ప్రపంచకప్ కూడా అదే ఏడాది ఉంది. ఇప్పటికే టీ20లకు వీడ్కోలు పలికిన రోహిత్ 50 ఓవర్ల వరల్డ్‌కప్‌ను నెగ్గాలనే ఉద్దేశంలో ఉన్నట్లు తెలుస్తోంది. లేకపోతే ఛాంపియన్స్ ట్రోఫీని గెలిచాకనే గుడ్‌బై చెప్పేసి ఉండేవాడని క్రికెట్ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. మరోవైపు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మాత్రం కొత్త సారథ్యంలోనే డబ్ల్యూటీసీతోపాటు వన్డే ప్రపంచ కప్ బరిలోకి దిగాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

## నేడు నల్లమడుగు సొసైటీలో మహాజనసభ పిఏసిఎస్ చైర్మన్ సుప్పాల రమేష్

**చట్టం న్యూస్ లింగంపేట్ :** లింగంపేట మండలంలోని నల్లమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మహాజనసభ ఏర్పాటు చేయనున్నట్లు సింగిల్ విండో చైర్మన్ రమేష్ ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నల్లమడుగు సొసైటీ పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు సొసైటీ పాలకవర్గ సభ్యులు మహాజన సభకు హాజరు కావాలన్నారు. రైతులు పాలకవర్గ సభ్యులు సింగిల్ విండో లో సభ్యత్వం ఉన్న ప్రతి రైతు మహాజన సభకు హాజరు కావాలని సభలో పలు అంశాలను వివరించడం జరుగుతుందన్నారు.

## ఇఫ్తార్ విందుతో ముస్లిం ఎస్సీ బీసీల ఐక్యతకు మార్గం



**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని సైదాబాద్ కాలనీలో గల షాదిఖానా హాల్లో గురువారం రోజు సాయంత్రం డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం. ఏ.వై.ఎస్, జమాతే ఇస్లామి హింద్ సంయుక్తంగా ఇఫ్తార్ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ అడ్వకేట్, మాజీ జెడ్పి చైర్మన్ గంట సదానందం మాట్లాడుతూ, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలు ఒకరినొకరి ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సామాజిక ఉత్సవంలో పాల్గొంటూ, అదేవిధంగా తమ వర్గ ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సామాజిక ఆర్థిక సమస్యలపై కల్సి ఉద్యమించాలని ఆయన కోరారు. మరో వక్త ఏ.వై.ఎస్ జిల్లా అధ్యక్షులు ఇత్వార్పేట్ లింగన్న మాట్లాడుతూ, మరోవైపు సమాజంలో సకల సామరస్యత కోసం, ప్రజాస్వామ్య వాతావరణ నిర్మాణం కోసం సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఇందులో జమాతే ఇస్లాం ఇంద్ ఆర్మూర్ అధ్యక్షులు అసలం అమీర్, ముజాహీద్, రెహ్మాన్ ఖలీద్, మర్కజ్ కమిటి ఆర్మూర్ ప్రముఖులు మొహమ్మద్ రిజ్వాన్, మొహమ్మద్ సాజిద్, అహిలే హదీస్ కు చెందిన అసద్ హజ్రామి, జమతే ఉల్మాకు చెందిన ఖాజీ మజీద్, దళిత నాయకులు శెట్పెల్లి నారాయణ, టి.యు.డబ్ల్యూ.జె, ఐజేయు నిజామాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు పార్దెం సంజీవ్, సీనియర్ జర్నలిస్ట్ పింజ సుదర్శన్, జాంబావ చమార్, కొక్కార గంగాధర్, టీచర్ సంగెం అశోక్, మాసం కాపు రాజయ్య, సురేష్ వగ్మారే, మూలనివాసి మాలజీ తదితరులు పాల్గొన్నారు.

## వామ్మో కోటి రూపాయల చిట్టిలా???

▸ **నివ్వెర పోయిన పోలీసులు**




**(చట్టం ప్రతినిధి కామారెడ్డి)** కామారెడ్డి జిల్లా బిక్నూర్ మండల కేంద్రంలో కోటి రూపాయల చిట్టి వ్యాపారం వ్యవహారం కలకలం రేపు తుంది. మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్దగల ఓ బట్టల షాపులో బిక్నూర్ పోలీసులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో కోటి రూపాయల చిట్టి రిజిస్టార్లతోపాటు రెండు కోట్ల ఫైనాన్స్ సంబంధించిన ప్రాంసరీ కాగితాలు, చెక్కులు కూడా లభించినట్లు తెలిసింది. కాగా నిజామాబాద్, నిజాంపేట్, జగిత్యాల, హైదరాబాద్, రామయంపేట్, మెదక్ ,డిచ్పల్లి ఆయా ప్రాంతాల నుండి ఈ చిట్టి ల వ్యవహారంలో సభ్యులుగా ఉన్నట్లు సమాచారం. అధిక వడ్డీ, అక్రమ చిట్టీల పై జిల్లా పోలీస్ బాస్ సీరియస్ గా ఉన్నారు. బుధవారం తనిఖీలలో జిల్లా వ్యాప్తంగా 16 కేసులు అక్రమ వడ్డీ వ్యాపారం పై కేసులు నమోదయ్యాయి.

## మట్కా రాయుళ్ల అరెస్ట్




**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని పెర్కిట్ శివారులో మట్కా ఆడుతున్న అగల్ దివిటి సత్యనారాయణ, దండవుల పెద్ద వెంకటి అను వారిని పట్టుకుని వారి నుండి 10,000 రూపాయల నగదు, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆర్మూర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సిఐ పి సత్యనారాయణ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

## ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిపై నేషనల్ ఎస్టీ కమిషన్ కు ఫిర్యాదు



**చట్టం, హైదరాబాద్:** హస్తినాపురం డివిజన్ గిరిజన మహిళా కార్పొరేటర్‌పై అసభ్యకర వ్యాఖ్యలు చేసినందుకు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. అయితే, ఇప్పటికీ ఆయనను అరెస్ట్ చేయకపోవడంతో గిరిజన సంఘాల నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం నాడు ఢిల్లీలోని లోక్ నాయక్ భవన్ లో జాతీయ కమిషన్ ఎస్టీ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ కి గిరిజన సంఘాల నాయకులు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు.ఫిర్యాదుకు స్పందించిన జాతీయ ఎస్టీ కమిషన్ తక్షణమే ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి నోటీసులు జారీ చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గిరిజన సంఘాల నేతలు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులో సుధీర్ రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన శక్తి వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ వెంకటేష్ చౌహన్ గిరిజన సంఘాల జేఏసీ చైర్మన్ అశోక్ రాథోడ్, గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొర్ర లక్ పతి నాయక్, బంజారా విద్యార్థి సమైక్య రాష్ట్ర అధ్యక్షులు శివ నాయక్, భరత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నాటక రంగం ను కాపాడుకుందాం



నాటకం సర్వజననీయం, సర్వకాలీనం.అని ప్రాముఖ్యత కలిగిన ప్రాచీన కళల్లో నాటక కళ ఒకటి. అని ఒక దేశం ప్రేరణా, ప్రమేయం లేకుండా ఈ నాటక కళ వివిధ దేశాల్లో విడివిడిగా ఎదిగిందని తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్య క్షులు కామిడి సతీష్ రెడ్డి అన్నారు ప్రపంచ రంగ స్థల దినం సందర్భముగా వారు మాట్లాడుతూ దాదాపుగా ఒకే కాలంలో పాశ్చాత్య దేశాల్లోనూ, భారతదేశంలోనూ నాటక ప్రక్రియ మొదలయ్యిందని కాలాన్ని బట్టీ, ప్రదేశాన్ని బట్టీ, సంస్కృతిని బట్టీ నాటకం రూపం మారుతుందేగానీ అంతర్లీనంగా దాని మూల సూత్రం మాత్రం అందరికీ ఒక్కటే ఉంటుంది. అందువల్లే నాటకం బహుళాదరణ పొందిన రంగస్థల ప్రక్రియగావిరసిల్లుతుందని ప్రస్తుతమున్న నాటకం కాలక్రమేణా రూపం మార్చుకుంటూ విశ్వజనీయమయ్యింది. దాని గుర్తుగానే ప్రపంచ రంగస్థల దినోత్సవం పుట్టిందని అన్నారు ప్రపంచవ్యాప్తంగా నాటక ప్రియులు పెద్ద ఎత్తున సభలూ, సమావేశలు జరుపుకునే రోజు మార్చి 27. ఈ రోజు అంతర్జాతీయ రంగస్థల దినోత్సవం. ప్రాచీన కళల్లో నాటక కళ ఒకటి. దాదాపు ఒకే కాలంలో పాశ్చాత్య దేశాల్లోనూ, భారతదేశంలోనూ నాటక ప్రక్రియ మొదలైంది. కాలాన్ని బట్టీ, ప్రదేశాన్ని బట్టీ, సంస్కృతిని బట్టీ నాటక రూపం మారుతుంది.ప్రస్తుతం ఉన్న నాటకం కాలక్రమేణా రూపం మార్చుకుంటూ విశ్వజనీనమైంది. 1961లో వియన్నాలో ఇంటర్నేషనల్ థియేటర్ ఇన్‌స్టిట్యూట్ వారు నిర్వహించిన 9వ ప్రపంచ కాంగ్రెస్‌లో ఆనాటి అధ్యక్షుడు అరవికివియో ప్రపంచ రంగస్థల దినోత్సవం ప్రతిపాదన చేశారని అంతర్జాతీయ థియేటర్ ఇన్‌స్టిట్యూట్ (ITI) ద్వారా 1962 లో ప్రపంచ రంగస్థల దినోత్సవం ప్రారంభించబడింది . ఇది ప్రతి సంవత్సరం మార్చి 27న ITI కేంద్రాలు మరియు అంతర్జాతీయ థియేటర్ కమ్యూనిటీచే జరుపబడుతుందని ఈ సందర్భాన్ని పురస్కరించుకుని వివిధ జాతీయ మరియు అంతర్జాతీయ థియేటర్ ఈవెంట్‌లను నిర్వహిస్తారు. అని అన్నారు. తెలుగు ప్రాంతంలో ప్రసిద్ధి పొందిన సురభి థియేటర్ గ్రూప్‌ను ఇద్దరు సోదరులు వానరస గోవిందరావు మరియు వానరస చిన్న రామయ్య 1885లో ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాలోని సురభి రెడ్డివారిపల్లి అనే గ్రామంలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం టీవీ, సినిమా ప్రభావం వల్ల నాటక రంగం కుదేలయ్యిందని అన్నారు.

## పల్లె ప్రజలకు ఆరోగ్య ప్రదాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



**చట్టం ఆర్మూర్:**గ్రామీణ ప్రాంత పల్లె ప్రజలకు ఆరోగ్య ప్రదాతగా మారిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం కిసాన్ నగర్ గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దాదాపుగా 15 నుండి 20 గ్రామాల ప్రజలకు ఆరోగ్య ప్రదాతగా మారింది. గ్రామాలలో నివసిస్తున్న ప్రజలకు ఆశా వర్కర్ల ద్వారా అన్ని ఆరోగ్య పరీక్షలను నిర్వహిస్తూ అవసరమైతే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద చికిత్సను అందజేస్తూ ప్రజలకు అవసరమైన మందులు ఇస్తూ ఆరోగ్య ప్రధాయినిగా మారింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ, కిసాన్ నగర్ గ్రామం చుట్టుపక్కల ప్రాంతాల గ్రామాల ప్రజలకు ఎలాంటి చికిత్సలు అవసరం వచ్చిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ప్రతిరోజు దాదాపుగా 100 నుండి 120 వరకు పేషంట్లను చూడడం జరుగుతుందని ఆమె తెలిపారు. వేసవికాలం దృష్ట్యా ప్రజలకు కావలసిన ఓఆర్ఎస్ పాకెట్లు, డయేరియా వంటి వ్యాధులకు అవసరమైన మందులను ఆశ వర్కర్ల ద్వారా ఎప్పటికప్పుడు అవసరమైన వారికి అందజేయడం జరుగుతుందని తెలిపారు. పాముకాటు, కుక్క కాటు, కోతులబారిన గాయపడ్డ వారికి ఇతర జంతువుల ద్వారా గాయపడ్డ వారికి అవసరమైన వ్యాక్సిన్లను మందులను అందజేయడం జరుగుతుందన్నారు. ఇటుక బట్టీలలో పనిచేస్తున్న వారికి రాత్రిపూట ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేయడం జరుగుతుందన్నారు.

## ధర్నాలకు పిలుపు ఇవ్వకముందే అరెస్టులా

**చట్టం, సిద్దిపేట:** ధర్నాలకు పిలుపు ఇవ్వకముందే మాజీ సర్పంచ్ లను ముందస్తు అరెస్ట్ చేస్తున్నారని సర్పంచ్ ల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు నరసింహులు యాదవ్ మండిపడ్డారు. గురువారం సిద్దిపేట జిల్లాలో ఆయన మీడియాతో మాట్లాడారు. తోగుట మండలంలోని కొంతమంది మాజీ సర్పంచ్ లను ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ లో నిర్బంధించారని.. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు నాలుగైదుసార్లు ఇలా అరెస్టులు జరిగాయన్నారు. మాజీ సర్పంచ్ లకు, నాయకులకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం భయపడుతోందన్నారు. మాజీ సర్పంచ్ లకు పెండింగ్ బిల్లులు ఇప్పించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తోందన్నారు. వెంటనే పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలన్నారు. లేకపోతే భారీ ఎత్తున ఉద్యమిస్తామని నరసింహులు యాదవ్ హెచ్చరించారు

## నూకాంబిక అమ్మవారి వద్ద కుంకుమ పూజ, హోమం : కమ్మల పనిదర్శర్మ



**చట్టం రామగుండం:** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం టి టి ఎస్ అంతర్గం గ్రామంలో నూకాంబిక అమ్మవారి మండపం వద్ద వేద బ్రాహ్మణులు కమ్మల పనిధర్ శర్మ చేతుల మీదుగా కుంకుమ పూజ హోమం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ జమ్ముల రామారావు మాట్లాడుతూ ప్రతి ఏటా ఉగాది అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామ ఆరాధ్య దైవం అయినటువంటి నూకాంబిక అమ్మవారిని ప్రతిష్టాపించుకొని నిత్య పూజలు కొనసాగించడం జరుగుతుందని దీనిలో భాగంగానే గణపతి గౌరీ పూజ ,కుంకుమ పూజ, హోమం కార్యక్రమం భక్తుల మధ్య ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. అనంతరం అన్నదాన విస్తరణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఆలయ కమిటీ చైర్మన్ జమ్ముల రామారావు తెలిపారు. అనంతరం పూజా కార్యక్రమంలో అంతర్గాం తాసిల్దార్, తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు తూము రవీందర్ పటేల్, వేద బ్రాహ్మణులు కమ్మల పనిదర్ శర్మ, నటరాజ్ శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ జమ్ముల రామారావు, కమిటీ సభ్యులు, భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలోపాల్గొన్నారు.

## ఏఐటియుసి ఆర్ జి వన్ డిపార్ట్మెంట్స్ ఇన్చార్జిగా సయ్యద్ సోహెల్



**చట్టం రామగుండం :** గుర్తింపు సంఘం ఏఐటియుసి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆర్జీవన్ డిపార్మెంట్స్ ఇంచార్జి గా బ్రాంచి ఆఫీస్ బేరర్ సయ్యద్ సోహెల్ ని నియమించడం జరిగిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్జీవన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం లు ఒక సంయుక్త ప్రకటన లో పేర్కొన్నారు. గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యవర్గ సమావేశంలో నిర్ణయం జరిగిందని వారు పేర్కొన్నారు. ఈ నెల 22 న జరిగిన సమావేశంలో కేంద్ర కమిటి అధ్యక్ష కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్ కుమార్, అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య లు ముఖ్య అతిథులుగా హాజరై అతని నియామకాన్నీ నిర్ణయించారని వారు తెలిపారు. సయ్యద్ సోహెల్ ఆర్జీ వన్ ఓసిపి 5 లో పిట్టర్ గా విధులు నిర్వహిస్తూ, ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కమిటీకి ఆఫీస్ బేరర్ గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారని వారు తెలిపారు. సయ్యద్ సోహెల్ ఆర్జీ వన్ ఏరియా లోని ఓసిపి 5 మరియు డిపార్మెంట్లకు ఇంచార్జ్ గా వ్యవహరిస్తూ కార్మికుల కు సంబంధించిన పలు సమస్యల పరిష్కారం కోసం యాజమాన్యం దృష్టికి తీసుకెళ్ళేందుకు ఏఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కి అనుసంధానం గా ఉంటాడని వారు పేర్కొన్నారు.

## సమస్యలపై గల మెత్తిన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



**చట్టం కోరుట్ల :** జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గ సమస్యను శాసన సభ సమావేశంలో జీరో అవర్ లో లేవనెత్తిన ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్. మా కోరుట్ల నియోజకవర్గంలో షుగర్ ఫ్యాక్టరీ ఉంది. గతంలో ప్రభుత్వం తదనంతరం ప్రైవేట్ పరం అయ్యింది. కేసీఆర్ 2014 15 లో ఒక సహకార సంఘం ఏర్పాటు చేసి షుగర్ ఫ్యాక్టరీపై అధికారం రైతులకే ఇద్దాం అని ఆలోచన చేశారు. ఈ ప్రభుత్వం కమిటీ వేస్తాం అన్నారు. గతంలో దివంగత ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు కానీ ప్రస్తుతం నన్ను ఎమ్మెల్యే గా ఈ కమిటీలో చేర్చలేదు. మా తండ్రి మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు కూడా చెరుకు రైతుల పక్షాన నిరాహార దీక్ష చేశారు.భవిష్యత్తులో రైతాంగానికి ఇబ్బందులు లేకుండా మా నియోజకవర్గంలో ఉన్న షుగర్ ఫ్యాక్టరీ ని తెరిపించాలి. అక్కడి చెరుకు రైతుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి కమిటీలో ఎమ్మెల్యే గా నాకు స్థానం కల్పించాలి.భవిష్యత్తు లో రైతాంగ ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని పరిశ్రమల శాఖ మంత్రి త్వరగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కోరారు.

## ఆన్లైన్ గేమ్ ఆడి యువత జీవితం నాశనం చేసుకోవద్దు :ఎస్ హెచ్ ఓ అశోక్



**చట్టం భూపాలపల్లి ప్రతినిధి :** ఐపీఎల్ క్రికెట్ సీజన్ మొదలైన వేళ.. సరదా కోసం బెట్టింగ్ కట్టి ఈజీ మనీ కోసం ఆశపడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్ళపల్లి మండల ఎస్హెచ్ఓ బి అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. డబ్బుల కోసం అత్యాశపడి బెట్టింగ్ కట్టద్దని, యాప్ ఆన్లైన్ గేమ్ లాడి డబ్బులు పోగొట్టుకొద్దని యువతకి సూచించారు. ఆన్లైన్ గేమ్ ఆడి ఎంతోమంది యువకులు ప్రాణాలు పోగొట్టుకున్నారని అలాంటి గేమ్ లకి దూరంగా ఉండాలని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలకు అవసరాలకు మించి డబ్బు ఇవ్వద్దని, పిల్లల మీద ఓ కన్నేసి చూడాలని తల్లిదండ్రులకు సూచించారు. ఎవరైనా బెట్టింగ్లకు పాల్పడిన, యాప్ ఆన్లైన్ గేమ్ ఆడినట్టు తెలిస్తే 1930 కి కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. వివరాలను గోప్యంగా ఉంచుతామని ఎస్సై తెలిపారు.

## దొంగతనం కేసులో ఒకరి రిమాండ్

▸ **నిందితునికి పలు నేరాలతో సంబంధం**

▸ **ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్**



**చట్టం న్యూస్ లింగంపేట్ :** దొంగతనం కేసులో ఒకరి అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపించడం జరిగిందని ఎల్లారెడ్డి సిఐ రవీందర్ నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సి ఐ తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి...నల్లమడుగు గ్రామానికి చెందిన సిద్దయ్య ఈనెల 22న దొంగతనం జరిగిందని స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆ పిర్యాదులో భాగంగా దొంగతనంలో రెండు లక్షల30 వేలు నగదు,బైకు, సెల్ ఫోను వెండి సామాన్లు శ్రీకాంత్ అనే వ్యక్తి దొంగతనం చేశాడని ఫిర్యాదు చేశారు.బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లింగంపేట ఏఎస్ఐ ప్రకాష్ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నిందితుని ఆచూకీ కోసం విచారణ చేపడుతున్నారని అన్నారు .గురువారం సాయంత్రం పోల్కంపేట్ చౌరస్తాలో నిందితుని పట్టుకొని అతని వద్ద నుండి 17 వేల రూపాయల, నగదు బైకు, సెల్ ఫోన్, వెండి సామాగ్రిని స్వాధీనం చేసుకున్నామని ఆయన అన్నారు. పలు నేరాలలో నిందితుడిగా ఉన్నారన్నారు ఆగస్టు నెలలో లింగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనంలో ఈతని హస్తముంది అన్నారు. అదేవిధంగా అల్లాదుర్గం పోలీస్ స్టేషన్లో మర్డర్ కేసులో రిమాండ్ వెళ్లాడన్నారు. లింగంపేట్ సదాశినగర్ రామయంపేట్ రాచకొండ పోలీస్ స్టేషన్ల పరిధిలో కేసులలో జైలుకు వెళ్లి రావడం జరిగింది అన్నారు. వారం రోజుల వ్యవధిలో అతనిని చాకచక్యంగా పట్టుకొని వివరించని రికవరీ చేసినటువంటి ఏఎస్ఐ ప్రకాష్ ను పోలిసిబ్బందిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తులు సంచరించినట్లయితే వెంటనే సమాచారం అందించాలని అన్నారు. సమావేశంలో ఏఎస్ఐ ప్రకాష్, సిబ్బంది రమేష్ రెడ్డి, కాషా గౌడ్, మదన్, శంకర్, రాజయ్య, తదితరులున్నారు.

## బీసీ కమిషనర్ చెర్మన్ కు వినతిపత్రం



**చట్టం కోరుట్ల :**జగిత్యాల జిల్లా మేరు సంఘం ఆధ్వర్యంలో బీసీ కమిషన్ చెర్మన్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా రాగిల్ల సత్యనారాయణ మాట్లాడుతూ రోజు రోజుకు కులవృత్తి అంతరించి పోతుంది దీన్ని మళ్ళీ తిరిగి మా కులవృత్తి పనిని మాకు అందించాలని అలాగే కుట్టు మిషన్స్ దుకాణదారుల వారికి కరెంటు బిల్లు మాఫీ లాంటి చేయాలని వినతిపత్రం సమర్పించారు. అందుకు వారికి చెప్పగా రాజీవ్ యువ వికాస్ స్కీమ్ ను మేర కులస్తులు వినియోగించుకోవాలని కోరారు. అలాగే మేర అన్న పదాన్ని తీసేసి మేరు అన్న పదాలని మార్చుతా అని అన్నారు.

## ఉపాధి హామీ పనుల పరిశీలించిన ఎంపీడీవో నరేష్



**చట్టం న్యూస్ లింగంపేట్ :** లింగంపేట మండలంలోని బాయంపల్లి గ్రామంలో గురువారం ఉపాధి హామీ పనులను ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతులు ముందుకు వచ్చి చేపల చెరువు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు వచ్చారు కూలీల సాయంతో చేపల చెరువు పనులు ప్రారంభించారు. చేపల చెరువులో ఏర్పాటు చేయడం వల్ల రైతులు ఆర్థికంగా బలపడతారన్నారు మరి కొంతమంది రైతులు ముందుకు వస్తే ఉపాధి హామీ పథకము ద్వారా పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈయన వెంట కార్యదర్శి క్షేత్ర సహాయకులు కాళిదాస్ కూలీలు ఉన్నారు.

CHATTAM NEWS
చట్టం
సంపూర్ణ స్వతంత్ర దినపత్రిక

## ఒకే దేశం ఒకే ఎన్నిక విధానంతో ప్రజాస్వామ్యం బలపడుతుంది



**చట్టం, లింగంపేట్ :** కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న ఒకే దేశం ఒకే ఒక విధానంతో దేశంలో ప్రజాస్వామ్యం బలపడుతుంది భారతీయ జనతా పార్టీ లింగంపేట్ సీనియర్ నాయకులు రాజారాం నాగరాజ్ అన్నారు.గురువారం స్థానిక విలేకరులకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈసందర్బంగా ఓకే దేశం ఓకే ఎన్నికపై ప్రజల్లో ఉన్న అపోహాలను తొలగించాలని దేశం మొత్తం ఒకే సమయంలో ఎన్నికలు జరిగితే కలిగే ప్రయోజనాలు లాభాలను ప్రజలకు దిశా నిర్దేశంచేయడం మేధావులు యొక్క విధి అని అన్నారు, ప్రజలను వారు చైతన్యపరచాలని కోరారు. ఒకే దేశం ఒకే ఎన్నిక విధానంతో ఎన్నికల వ్యయం భారీగా తగ్గుతుందని అన్నారు, ప్రజాస్వామ్య దేశానికి ఇది ఎంతో ఉపయోగకరమన్నారు

## బోనాల్లో ఘనంగా కుస్తీ పోటీలు




**చట్టం న్యూస్ లింగంపేట్ :** లింగంపేట మండలంలోని బోనాలు గ్రామంలో గురువారం కుస్తీ పోటీలను గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. బోనాల గ్రామంలో ప్రభు స్వామి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఎడ్లబండ్ల ప్రదర్శన నిర్వహించారు. బుధవారము రథోత్సవ కార్యక్రమం దేవుని ఊరేగింపు రంగ రంగ వైభవంగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. గురువారం జాతర ఉత్సవాల ముగింపులో భాగంగా మధ్యాహ్నం నుండి కుస్తీ పోటీలను నిర్వహించారు టెంకాయ కుస్తీ నుండి మొదలుకొని వెండి కడియం వరకు కుస్తీ పోటీలో ఏర్పాటు చేశారు ఇతర మండలాలతో పాటు దూర ప్రాంతాలకు చెందిన మల్లయోధులు పాల్గొన్నారు. ప్రజలు ఆసక్తితో కుస్తీ పోటీలో తిలకించారు. విజేతలకు బహుమతులను గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు అందజేశారు.

## నేడు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

- తాసిల్దార్ ప్రవీణ్ కుమార్

**చట్టం న్యూస్ నస్రుల్లాబాద్ :** రంజాన్ మాసం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో, ఉర్దూ మీడియం స్కూల్లో అధికారికంగా నసురుల్లాబాద్, బీర్కూర్ ఉమ్మడి మండల, మైనార్టీ సోదరులకు శుక్రవారం రోజు సాయంత్రం ఇస్తారు విందు ఏర్పాట్లు చేస్తున్నట్లు పత్రిక పట్టణంలో నసురుల్లాబాద్ తహసీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి మండల మైనార్టీ సోదరులు హాజరై విజయవంతం చేయగలరని ఆయన తెలిపారు.

## నలంద ప్రీ స్కూల్ లో ఘనంగా ప్రదర్శనశాల




**చట్టం ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని మామిడిపల్లి నందు గల నలంద ప్రీ ప్రైమరీ స్కూల్ లో గురువారం రోజున పిపి ఎక్స్పో, ప్రదర్శనశాల ఘనంగా జరిపారు. ప్రిన్సిపాల్ సాగర్ మాట్లాడుతూ, మేము చదువుకొనే రోజులలో ఇలాంటి కార్యక్రమలు లేవు వీరు ఎంతో అదృష్టవంతులు చిన్ననాటి నుంచే నేర్చుకొంటున్నారు అన్నారు. కరెస్పాండంట్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ఆర్మూర్ లోనే పీపీ ఎక్స్ పో నిర్వహించడం మొదటి సారి గర్వనీయం అన్నారు. చిన్ననాటి నుంచే ప్రతి విషయం పట్ల పట్టు ఉండటం గర్వించదగ్గ విషయం అని తెలియజేశారు. విద్యార్థులు రాష్టాలు రాజధానులు, ప్రతిజ్ఞ ఆంగ్లంలో చుడకుండా చెప్పడం చూపారులకు అశ్చర్యం చేశారు. ఇంజనీర్, డాక్టర్, టీచర్, లాయర్, ఫార్మర్ వేశాధారణలో ఉండి వాటిని ఆంగ్లంలో చెప్పడం, నెలలు వారముల పేర్లు ఆంగ్లంలో చెప్పారు. హెల్త్, ఫుడ్స్, సెల్ ఫోన్, టేలీవిజన్, స్మోకింగ్, రెస్పెక్టెడ్ పేరెంట్స్, టీచర్స్, గ్రాండ్ పేరెంట్స్, గూడ్ మాన్నెర్స్, సండే హోమ్ టాస్క్, జాయింట్ ఫ్యామిలీ, ఇన్సూరెన్స్ పైన తెలిపిన విషయాల ప్రాముఖ్యత ను ఆంగ్లంలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలూ అడుగగా చిన్ననాటి నుంచే ప్రతి విద్యార్థి పాల్గొని చెప్పడం చాలా సంతోషం అని తెలియజేశారు. మునుముందు ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చెప్పటాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ప్రీ ప్రైమరీ టీచర్స్ అపూర్వ, అరుంధతి, సౌమ్య, జ్యోతి, నవనీత, మమత ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి.. రెండు గ్రామాల్లో ఉద్రిక్తత



**చట్టం కామారెడ్డి ప్రతినిధి ;** అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనతో రెండు గ్రామాలతో పాటు జిల్లా కేంద్రంలో గురువారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దోమకొండ మండలం ముత్యంపేట గ్రామానికి చెందిన గొల్ల రమేశ్(35) చింతామన్పల్లికి చెందిన వ్యక్తి కారు అమ్మాడు. తన కారు డబ్బుల కోసం వెళ్లిన ఆయన చింతామన్పల్లిలో అనుమానాస్పదంగా మృతి చెందాడు.కాగా కారు కొన్నవారు కొట్టడంతోనే తన భర్త చనిపోయాడని మృతుడి కుటుంబ సభ్యులు ఆరోపించారు. అంతేగాకుండా ఈ క్రమంలో రెండు గ్రామాల్లో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రెండు గ్రామాల ప్రజలు ఆస్పత్రికి పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఆస్పత్రి వద్ద కూడా ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు ఆస్పత్రి వద్ద హైడ్రామా చోటు చేసుకుంది.కాగా రమేశ్ కుటుంబ సభ్యులు మృతదేహంతో కలెక్టరేట్కు వస్తున్నారనే సమాచారంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆస్పత్రిలో బందోబస్తును పటిష్టం చేశారు. అలాగే కలెక్టరేట్ వద్ద రెండు వైపులా బారికేడ్లు ఏర్పాటు చేసి భారీగా మోహరించారు. చివరికి తప్పుడు సమాచారమని తెలియడంతో ఊపిరి పీల్చుకున్నారు.

## ట్వినింగ్ ప్రోగ్రాంలో పాల్గొన్న సంగోజి వాడి విద్యార్థులు




**చట్టం కామారెడ్డి ప్రతినిధి ;** ట్వినింగ్ ప్రోగ్రాంలో MPUPS సంగోజీవడి విద్యార్థులు గురువారం ఆయా కార్యక్రమాలలో పాల్గొన్నారు. అందులో భాగంగా ZPHS తాడ్వాయి పాఠశాల , గ్రంథాలయాన్ని , పోలీస్ స్టేషన్ ని సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి ,ఆ పాఠశాల ఉపాధ్యాయ బృందం, సంగోజివాడి పాఠశాల ఉపాధ్యాయ బృందం, స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐ సిబ్బంది లైబ్రరీ నిర్వాహకుడు పి రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ సారు 10వ తరగతి పరీక్షలు రాయమంటారా వద్దంటారా

- గోదావరిఖని బాయ్స్ హై స్కూల్ పరీక్ష కేంద్రంలో సిఎస్ తానం స్వర్ణ వేధింపులు భరించలేకపోతున్నాం
- ఫెర్టిలైజర్ సిటీ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో చదవడమే మా నేరమా
- రూమ్ నెంబర్ 8లో 11 మంది విద్యార్థినీల ఆవేదన




**చట్టం రామగుండం :** పదవ తరగతి వార్షిక పరీక్షలు వారం రోజులుగా జరుగుతున్న విషయం అందరికీ తెలిసిందే గోదావరిఖని బాలుర పాఠశాలలో 10వ తరగతి పరీక్షల కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది ఈ పరీక్షల కేంద్రంలో రామగుండం కార్పొరేషన్ పరిధిలోని ఫెర్టిలైజర్ సిటీ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో చదువుతున్న 11 మంది విద్యార్థులకు ఈ కేంద్రంలో 8వ రూమ్ నెంబర్లు సెంటర్ వేశారు ఈ సెంటర్ కు సి ఎస్ గా తాన స్వర్ణను అధికారులు నియమించారు పరీక్షల మొదటి రోజున సిఎస్ తన స్వర్ణ పరీక్షలు ప్రారంభమైన అరగంటకి ఎనిమిదవ రూమ్ నెంబర్ కు వచ్చి ఇందులో జెడ్ పి హెచ్ ఎస్ ఎఫ్ సి ఐ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు ఎవరైనా ఉన్నారా అనగానే ఈ రూమ్ లో ఉన్న ఆరుగురు విద్యార్థులు చేతులెత్తగా వారితో బెదిరింపుతో మాట్లాడుతూ పరీక్షలు రాయకుండా ప్రతిరోజు వచ్చి డిస్టర్బెన్స్ చేస్తుందని మెడలు విప్పవద్దని స్క్రిప్ట్ గా ఉంటుందని మాట్లాడవద్దని అరగంటకు సారి వస్తు మానసికంగా మమ్మల్ని వేధిస్తుండడంతో పరీక్ష రాయలేకపోతున్నామని బుధవారం ఆ విద్యార్థినిలు పోషకులకు తెలియజేయగా వారంతా పాఠశాల సెంటర్ వద్దకు వచ్చి జరుగుతున్న అన్యాయాన్ని విలేకరులకు తెలియజేశారు ఇందులో ఆ విద్యార్థినీలు రోజు మానసికంగా గురవుతున్న తీరును ఏడ్చుకుంట తెలుపుతున్న తీరును పలువురిని ఆశ్చర్యపరిచింది. వారి పోషకులు కూడా ఈ విషయంలో మానసికంగా వేధిస్తున్న సదర్ సిఎస్ పై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారికి సంబంధిత అధికారులకు విన్నపాలు చేసిన ఫోన్ ద్వారా తెలియపరిచిన పట్టించుకోవడం లేదంటూ ఆవేదనతో ఆరోపిస్తున్నారు ఇప్పటికైనా మీరు వెంటనే స్పందించి మా విద్యార్థులకు సిఎస్ వేధింపులు లేకుండా ఆదేశాలు జారీ చేయాలని లేకుంటే వారు పరీక్షలు రాయలేకపోతున్నారని మానసిక ఒత్తిళ్ల గురవుతున్నార నీ మండల విద్యాధికారికి జిల్లా విద్యాధికారికి పోషకులుగా మేము తెలియజేస్తే మీకు ఏమైనా కంప్లైంట్ ఇవ్వాలి అనుకుంటే పెద్ద పెళ్లికి వచ్చి ఇవ్వండి అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పి కనీసం పట్టించుకోవడం లేదు మా పిల్లలకి ఏమైనా అయితే మీ మాత్రం కోరుకునే సమస్య లేదు వారిని ఎవరు పట్టించుకోకుండా ఆమె అన్యాయాలకు గురి చేస్తున్నారు ఈ విషయంలో మేము ప్రజాభిమానం దగ్గర కూడా వెళ్లి న్యాయం జరిగే వరకు పోరాడుతామని పోషకుల డిమాండ్ చేస్తున్నారువారుఎగ్జామ్స్ సెంటర్లో పరీక్షలు సక్రమంగా నిర్వహించే ఒక సిఎస్ ఇలా వ్యవహరించడం ఎంతవరకు కరెక్ట్ ఎందుకు వారిని మానసికంగా వేధిస్తున్నారు. దీని వెనుక కథ ఏంటి? ఈమెపై ఎన్ని ఫిర్యాదులు చేసినా ఎవరు పట్టించుకోవడం లేదు. వీళ్ళు జెడ్పిహెచ్ఎస్ పెట్లియర్ సిటీ పాఠశాలలు చదువుకోవడం నేరమా అంటూ వాళ్ళు ప్రశ్నిస్తున్నారు మిగతా పరీక్షలన్నీ సజావుగా జరిగేలాగా మాకు న్యాయం చేయాలంటూ జిల్లా కలెక్టర్ మొరపెట్టుకుంటున్నారు.

## టెన్త్ ఎగ్జామ్ లో మాల్ ప్రాక్టీస్ కు యత్నం

- 8 మంది అరెస్ట్.. 11 మందిపై కేసు
- కామారెడ్డి జిల్లా జుక్కల్ జడ్పీ స్కూల్ లో ఘటన



**చట్టం కామారెడ్డి:** పదో తరగతి పరీక్షా కేంద్రంలో మాల్ ప్రాక్టీస్ కు యత్నించిన 8 మందిని కామారెడ్డి పోలీసులు అరెస్ట్ చేశారు. 11మందిపై కేసు నమోదు చేశారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. గురువారం జిల్లా పోలీస్ ఆఫీసులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ కేసు కు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. జుక్కల్ లో మాల్ ప్రాక్టీస్ కు యత్నించిన ఘటనలో 11 మందిపై కేసు నమోదైనట్లు చెప్పారు. అయితే వీరిలో ముగ్గురు పరారీలో ఉండగా అరెస్టు చేసిన ఎనిమిది మందిలో ఇద్దరు జర్నలిస్టులు కూడా ఉన్నారని తెలిపారు. జుక్కల్ జిల్లా పరిషత్ పాఠశాల పరీక్ష కేంద్రంలో గణితం పరీక్ష రాస్తున్న ఓ విద్యార్థికి సబ్జెక్టు సరిగ్గా రాదు. దీంతో విద్యార్థి తండ్రి పాఠశాలలో వాటర్ సప్లయ్ చేస్తున్న ఓ వ్యక్తిని మాటలతో మచ్చిక చేసుకున్నాడు. అతనికి ఓ తెల్ల కాగితం ఇచ్చి తన కొడుకు వివరాలు చెప్పి ప్రశ్నలను రాసుకుని రావాలని పంపించాడు. తెల్ల కాగితాన్ని సదరు వ్యక్తి విద్యార్థికి ఇచ్చాడు. కాసేపటికి 5 ప్రశ్నలతో కూడిన కాగితాన్ని ఆ విద్యార్థి సదరు వ్యక్తికి అందించాడు. అతను ఆ కాగితాన్ని తిరిగి విద్యార్థి తండ్రికి ఇచ్చాడు. అనంతరం విద్యార్థి తండ్రి ఆ పేపర్ ను గ్రామ పంచాయతీ కారోబార్ కు ఇచ్చి జవాబులు తేవాలని తెలిపారు. ఆ పేపర్ ను ఫొటో తీసుకున్న కారోబార్ అక్కడే ఉన్న విలేకరికి పంపించాడు. అలాగే ఆ పేపర్ కారోబార్ నుంచి ఓ యూట్యూబ్ రిపోర్టర్ కు చేరగా .. అతని నుంచి మరో రిపోర్టర్ కు వాట్సాప్ లో పంపారు. సదరు విలేకరి ఆ పేపర్ ను ఓ క్లిప్పింగ్ తయారు చేసి లోకల్ గా ఉన్న డిజిటల్ మీడియా గ్రూపులో షేర్ చేశాడు. తర్వాత ఓ మైనర్ బాలుడు పరీక్ష కేంద్రానికి వెళ్లి మరొక మైనర్ బాలుడి ఫోన్ నుంచి ప్రశ్నలతో కూడిన పేపర్ ను ఫొటో తీసి కారోబార్ కు పంపించి డిలీట్ చేశారు. పోలీసులు ఈ విషయాన్ని గుర్తించి ప్రశ్నలు బయటకు వెళ్లకుండా విచారణ చేపట్టి ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర తెలిపారు. ఓ యూట్యూబ్ చానల్ విలేకరితో పాటు వాట్సాప్ గ్రూప్ అడ్మిన్, మరో మైనర్ బాలుడు పరారీలో ఉన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి, ఎస్బీ సీఐ తిరుపతి పాల్గొన్నారు.

## పక్కా ప్లానింగ్ తోనే కెరీర్ లో సక్సెస్ కావొచ్చు

- ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్



**చట్టం, హైదరాబాద్:** విద్యార్థులు జీవితంలో, కెరీర్ లో సక్సెస్ కావాలంటే ఒక ప్లానింగ్ ప్రకారం ముందుకు వెళ్లాలని ప్రముఖ నవల రచయిత, మోటివేషనల్ స్పీకర్ యండమూరి వీరేంద్రనాథ్ అన్నారు. ఒత్తిడి లేకుండా పోటీ పరీక్షలకు ప్రిపేర్ కావాలని ఆయన సూచించారు. ఈ మేరకు పల్లవి ఇంజనీరింగ్ కాలేజీలో 'హౌ టు సక్సీడ్ ఇన్ లైఫ్ అండ్ కెరీర్' అనే అంశం పై బుధవారం వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన యండమూరి.. విద్యార్థులు పరీక్షలకు ఏ విధంగా ప్రిపేర్ కావాలి, పోటీ పరీక్షల్లో ఇచ్చే చిక్కు ప్రశ్నలకు సులువుగా సమాధానం చెప్పాలని సూచించారు. ఉద్యోగం కోసం వెళ్లినప్పుడు ఇంటర్వ్యూలో ఎలాంటి ప్రశ్నలు ఉంటాయి, ఆ ప్రశ్నలకు ఏ విధంగా సమాధానం చెప్పి ఉద్యోగం సాధించాలనే అంశంపై విద్యార్థులకు విలువైన సూచనలు చేశారు. వర్క్‌షాప్ లో భాగంగా విద్యార్థులకు చిన్నచిన్న ప్రశ్నలు ఇచ్చి సులువైన ప్రశ్నలైనా సరే విద్యార్థులు ఎలా తప్పులు చేస్తారో చూపించారు. ప్రశ్నలకు సరైన సమాధానాన్ని ఎలా గుర్తించాలని దానిపైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. చిన్నచిన్న ప్రశ్నలు ఇచ్చి వాటికి సరైన సమాధానం చెప్పిన వారికి బహుమతులు ఇచ్చి ప్రోత్సహించారు. అనంతరం విద్యార్థులకు టెస్ట్‌నిర్వహించారు. ఆ టెస్ట్‌లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థికి మెడల్‌అందజేశారు. ఈ కార్యక్రమంలో పల్లవి ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దీనివల్ల భవిష్యత్తులో ఉన్నత స్థానానికి ఎదగడానికి ఉపయోగపడుతుందని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎం నవీన్, డైరెక్టర్ సి శేషగిరిరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం బి రాజు పల్లవి ఇంజనీరింగ్ కాలేజ్ ఫ్యాకల్టీ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## భారతీయులకు అమెరికా షాక్




**చట్టం, ఢిల్లీ :** భారత్‌లోని అమెరికా దౌత్య కార్యాలయం భారతీయులకు షాకిచ్చింది. తాజాగా భారీ సంఖ్యలో వీసా అపాయింట్‌మెంట్లను రద్దు చేసింది. అపాయింట్‌మెంట్ వ్యవస్థలో భారీ లోపాన్ని గుర్తించినట్లు దౌత్య కార్యాలయం వెల్లడించింది. ఈ కారణంగా ఏకంగా 2 వేల యూఎస్ వీసీ దరఖాస్తులను రద్దు చేసినట్లు ప్రకటించింది. మోసపూరిత కార్యకలాపాలతో సంబంధం ఉండటంతో వీటిని రద్దు చేసినట్లు తెలిపింది. ఈ అపాయింట్‌మెంట్లు అన్నీ 'బాట్స్' ద్వారా వచ్చినట్లు గుర్తించినట్లు తెలిపింది. కాగా అమెరికా వీసాలకు అపాయింట్‌మెంట్ల కోసం సుదీర్ఘ సమయం వేచి ఉండాల్సిన వస్తుంది. వ్యక్తిగతంగా వీసా అప్లై చేసుకుంటే ఏండ్ల తరబడి వేచి చూడాల్సి ఉంటుంది. అయితే ఏజెంట్లను డబ్బు చెల్లిస్తే కేవలం నెల రోజుల్లోనే అపాయింట్‌మెంట్లు దొరుకుతాయి. ఇది చాలా కాలంగా జరుగుతున్నదే. ఏజెంట్లు కొన్నిరకాల ప్రత్యేకమైన బాట్‌స్‌ను ఉపయోగించి అపాయింట్‌మెంట్ స్లాట్లను బ్లాక్ చేస్తుంటారు. దీంతో వ్యక్తిగతంగా వీసాలకు అపాయింట్‌మెంట్లు చేసుకున్న వారు కూడా సుదీర్ఘ కాలం వేచి ఉండలేక ఏజెంట్లకు డబ్బులు చెల్లించి ఈ తరహాలో అపాయింట్‌మెంట్లు పొందుతుంటారు. దీని కోసం ఒక్కో వీసా దరఖాస్తుకి రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకూ ఏజెంట్లు వసూలు చేస్తుంటారు.

## బడంగ్‌పేటలో హైడ్రా పంజా

- అక్రమ నిర్మాణాల కూల్చివేత
- హైడ్రా అధికారులను అడ్డుకున్న బీఆర్ఎస్ నేతలు
- ఓ అధికారిపై దాడి .. పలువురు అరెస్ట్!




**చట్టం , రంగారెడ్డి:** తెలంగాణలో అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేస్తోంది. తాజాగా రంగారెడ్డి జిల్లాలోని బడంగ్‌పేటలో రోడ్డును ఆక్రమించి కట్టిన నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. ఈ క్రమంలో కూల్చివేతలను అడ్డుకునే ప్రయత్నం చేసిన వారిని అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేస్తున్నారు. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు హైడ్రా రంగంలోకి దిగింది. రోడ్డును ఆక్రమించి ఇండోర్ క్రికెట్ కోర్టును నిర్మాణం జరిగింది. ఈ క్రమంలో సదరు నిర్మాణాన్ని హైడ్రా ఆధ్వర్యంలో కూల్చివేశారు. గురువారం ఉదయం జేసీబీల సాయంతో క్రికెట్ కోర్టును కూల్చివేశారు హైడ్రా అధికారులు. ఫిర్యాదు చేయగానే స్పందించి అక్రమాలను కూల్చివేసినందుకు హైడ్రాకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు కాలనీ వాసులు. ఈ సందర్భంగా కూల్చివేతను అడ్డుకునే ప్రయత్నం చేసిన వారిని అరెస్ట్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీంతో, అక్కడ ఉద్రికత్తకర వాతావరణం చోటుచేసుకుంది. కూల్చివేతల సందర్భంగా హైడ్రా అధికారులను బీఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ భర్త శేఖర్ రెడ్డి, ఇతర వ్యక్తులు అడ్డుకున్నారు. ఈ క్రమంలోనే హైడ్రా సీఐ తిరుమలేష్‌పై దాడికి ప్రయత్నించారు. బోయపల్లి ఎన్‌క్లేవ్ కాలనీవాసులు బోయపల్లి వెంకటరెడ్డి, శేఖర్ రెడ్డిపై హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు.

## పదో తరగతి పేపర్లను రేవంత్ అమ్ముకున్నడు



**చట్టం , హైదరాబాద్:** రాష్ట్రంలో పదో తరగతి ప్రశ్నపత్రాలు లీక్ అవ్వడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం నాంపల్లిలోని ఎస్ఎస్‌సీ బోర్డు ఆఫీసును ముట్టడించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ ధర్నా నిర్వహించారు. సీమాంధ్ర కార్పొరేట్ విద్యాసంస్థలతో కుమ్మక్కై పదోతరగతి ప్రశ్నపత్రాలను రేవంత్ రెడ్డి అమ్ముకున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నప్పటికీ పరీక్షలకు ముందు సమీక్షించకుండా, పరీక్షలు నిర్వహించడం వల్లే నకిరేకల్, మంచిర్యాల, వికారాబాద్, జుక్కల్‌లో పేపర్ లీక్ జరిగిందని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. పేపర్ లీకేజీలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ బాధ్యుడైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలన్నారు. పేపర్ లీక్ బాధ్యులను వెంటనే అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు నాలుగు పరీక్షలు నిర్వహిస్తే నాలుగు ప్రశ్నపత్రాలు లీక్ అవ్వడం చూస్తుంటే విద్యాశాఖ ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థమవుతుందన్నారు. కార్పొరేట్ స్కూళ్లతో కుమ్మక్కై కాంగ్రెస్ ఎమ్మెల్యేలే లీకులకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. పరీక్షలు సరిగ్గా నిర్వహించమని కోరితే రేవంత్ రెడ్డి డైరెక్షన్ లో కేటీఆర్‌పై నకిరేకల్‌లో అక్రమ కేసు పెట్టారన్నారు. ముఖ్యమంత్రి పేషీ నుంచి ఆర్డర్ రాగానే సెకండ్లలో కేసులు నమోదు చేస్తున్నారని.. పేపర్ లీకేజీ కేసులో అసలు నిందితులను తప్పించారని ఆయన అన్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి చిల్లర వేషాలు మానుకోవాలని.. పోలీసులు చట్ట ప్రకారం నడుచుకుంటే మంచిదని గెల్లు శ్రీనివాస్ మండిపడ్డారు.

## సీఎస్కేతో జాగ్రత్త




**చట్టం , స్పోర్ట్స్ :** ఐపీఎల్ 2025 సీజన్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయంతో మొదలుపెట్టింది. కోల్‌కతాను ఈడెన్ గార్డెన్స్‌లోనే ఓడించింది. ఇక చెపాక్ వేదికగా నేడు చెన్నై సూపర్ కింగ్స్‌తో తలపడనుంది. ఇది సీఎస్కే సొంత మైదానం. ఈ క్రమంలో చెన్నైతో అత్యంత జాగ్రత్తగా ఉండాలని.. ఏ ఒక్క పొరపాటు చేసినా ఓటమి తప్పదని ఆర్సీబీని మాజీ క్రికెటర్ షేన్ వాట్సన్ హెచ్చరించాడు. వాట్సన్‌కు గతంలో చెన్నై, బెంగళూరు జట్లతో కలిసి ఆడిన అనుభవం ఉండటం గమనార్హం. ''చెపాక్‌లో ఆర్సీబీకి పెను సవాల్ తప్పదు. సీఎస్కే జట్టులో నాణ్యమైన బౌలర్లు ఉన్నారు. చెన్నైకి దీటుగా సమాధానం ఇవ్వాలంటే బెంగళూరు కూడా సరైన కూర్పుతో బరిలోకి దిగాలి. చెపాక్ బౌలర్లకు స్వర్గధామం. ఈ పిచ్‌పై వారిని ఎదుర్కోవడం తేలికేం కాదు. ఈ విషయంలో ఆర్సీబీకి సవాల్ తప్పదు. చెన్నై బ్యాటింగ్ లైనప్ కూడా బలంగా ఉంది'' అని వాట్సన్ వెల్లడించాడు.

PRINTED, PUBLISHED AND OWNED BY SIRIGADA PRASAD AND PRINTED AT INDUR OFFSET PRINTERS, OPPOSITE CHEER HANUMAN TEMPLE, WEEKLY BAZAR, NIZAMABAD DISTRICT,TELANGANA 503001., AND PUBLISHED AT: H.NO. 3-3-486/2, GAYATHRINAGAR, VARNI ROAD, NIZAMABAD DISTRICT, TELANGANA - 503001.,EDITOR: SIRIGADA PRASAD. RNI.NO. TELTEL/2010/32350. CELL ;9948884497. PRASADSIRIGADA27@GMAIL.COM